
ఓం భూర్భువః స్వః తత్సవితుర్వరేణ్యం భర్గోదేవస్య ధీమహి ధియోయోనః ప్రచోదయాత్





# యుగశక్తి గాయత్రి



ఓం వందే భగవతీం దేవీం శ్రీరామంచ జగద్గురుం
పాదపద్మే తయోః శ్రిత్వా ప్రణమామి ముహుర్ముహుః

ప్రఖర ప్రజ్ఞ

సజల శ్రద్ధ

సంకల్పం - సంరక్షణ
వేదమూర్తి, తపోనిష్ఠ, పండిత
**శ్రీరామ శర్మ ఆచార్య**
శక్తి స్వరూపిణి
**మాతా భగవతీ దేవి శర్మ**

ప్రధాన సంపాదకులు
డాక్టర్ ప్రణవ్ పండ్యా
సంపాదక మండలి
డాక్టర్ మారెళ్ళ శ్రీరామకృష్ణ
పొన్నూరు హైమవతీశాస్త్రి
ముక్కామల రత్నాకర్
డి.వి.ఆర్.మూర్తి
సాధన నరసింహాచార్య

సంపుటి 17 - సంచిక 07
**డిశంబర్ 2012**
**విడిప్రతి రూ॥ 12.00**
**సం॥ చందా రూ॥ 120**
**3 సం॥ చందా రూ॥ 350**
**10 సం॥ చందా రూ॥ 1116**

పత్రిక చందా మనీ ఆర్డర్ ద్వారా కాని, డ్రాఫ్టు ద్వారా కాని పంపవలసిన చిరునామా
**"శ్రీ వేదమాత గాయత్రీ ట్రస్టు"**
**గాయత్రీ చేతనా కేంద్రము**
హెచ్.పి. రోడ్, మూసాపేట,
అశ్విని హౌస్ దగ్గర,
హైదరాబాదు - 500 018.

## లక్ష్యసిద్ధి

ఎంచుకున్న లక్ష్యం కొరకు ప్రతిక్షణం ఉపయోగించుకోవాలి, దానిని సాధించుకునే ప్రయత్నంలోనే దృఢంగా ఉండాలి! అలసిపోయినప్పుడు కొద్ది విశ్రాంతి తీసుకోవటంలో తప్పు లేదు కాని నిర్ణయించుకొన్న దారిని మార్చుకోకుండా నిరంతరం సాగిపోతూనే ఉండాలి.

ఎన్ని భయాలు, ఎన్ని మోహపూరితమైన భావనలు, ఎన్ని అవరోధాలు ఎదురైనా ఎన్నుకున్న మార్గం నుండి ప్రక్కకు పోని సాహసం చూపవలసి ఉంటుంది. వన్య ప్రదేశాలలో జంతువులు గుంపులుగా తిరుగుతుంటాయి. వాటి కాలిగిట్టలతో రహదారులు తయారవుతాయి. ఇవి రాజమార్గాలవలె ఉండి వీటి మీద తిన్నగా నడచిపోవాలనిపిస్తుంది! ఏ బాటసారైనా ఆ దారి వెంట నడుస్తుంటే వానికి గమ్యం అంతుచిక్కక, అనేక కష్టాలతో, అలసిపోయి, నిరాశ పొందుటే తప్ప మరే లాభం అతనికి లభించదు.

అసంపూర్ణ స్థితి నుండి పూర్ణత్వం వైపుకు వెళ్ళేందుకు నిర్ధారించుకొని, ఆ దారి వెంట నిరంతరం, క్రమపద్ధతిలో నడుస్తుంటే అభీష్ట లక్ష్యసిద్ధిని ప్రాప్తించుకొనవచ్చు. దారి తప్పి వ్యర్థంగా తిరిగితే మాత్రం అలసట, బడలిక మాత్రమే మిగులుతాయి. పూర్ణత్వం యొక్క లక్ష్యం చేరటానికి ఒక్కటే దారి, అత్యంత నిష్ఠతో, క్రమశిక్షణతో ఆ దారి మీద నడవవలసి ఉంటుంది. అడవి జంతువులు నడచి నిర్మించిన దారిలోగాక, సునిశ్చితమైన సంకల్పంతో నిర్మించుకొన్న రాజమార్గం మీద ముందుకు పూర్ణ విశ్వాసంతో సాగవలసి ఉంటుంది. లక్ష్యం చేరుటకు ఒకే ఒక ఉపాయముంది. అది లక్ష్యం దిశగా, అవరోధాలన్నింటిని దాటుకుంటూ, తన ప్రయాణాన్ని అఖండంగా, క్రమశిక్షణతో ముందుకుసాగిన నాడు నిర్ధారిత స్థానం చేరుకోవచ్చు.

పత్రిక అందనివారు మరియు పత్రికకు సూచనలు, సలహాలు ఇవ్వదలచినవారు ఈ క్రింది నంబర్లను సంప్రదించగలరు.
ఫోన్ : 040-23700722, 9949111175, 9440769798

**ఏ సమస్య అయినా మన మనస్సులోనే ఉంటుంది. బయట ఎక్కడో లేదు**

# విషయ సూచిక


1. **సంపాదకీయం :**
లక్ష్య సిద్ధి 1
2. **విషయసూచిక-సద్గురు వచనామృతం :**
అంతరాత్మ పిలుపు 2
3. **వేదమంత్రం :** బ్రాహ్మణ ధర్మం 3
4. **గాయత్రీ విద్య - 27 :** తన్మాత్ర సాధన-1 4
5. **గాయత్రీ చిత్రావళి - 6 :** శాంభవీ దివ్యశక్తి 6
6. **బాలల భవితకు బంగారుబాట - 32 :**
ధనాన్ని సద్వినియోగం చేయాలి 7
7. **ధారావాహిక ప్రజ్ఞోపనిషద్ - ఆరవ అధ్యాయం (మొదటి ప్రకరణం):** సత్సాహస-సంఘర్షణ ప్రకరణం 8
8. **పరమపూజ్య గురుదేవుల సుదీర్ఘయాత్ర - 6 :**
సత్యం పరం ధీమహి 9
9. **మస్తిష్కమే కల్పవృక్షం - 3 :**
విస్మయం కొలిపే మస్తిష్కం-1 14
10. **సూర్యసాధనా సంవత్సర ప్రత్యేకం :**
అనాది కాలం నుండి సూర్యోపాసన 16
11. **పాలకూర నుండి విద్యుచ్ఛక్తి** 18
12. **స్వప్న జగత్తు :** కలల ప్రపంచ రహస్యం 20
13. **ఎందువల్ల త్వరగా చనిపోతారు?** 23
14. **ఆదిశక్తి యొక్క లీలా కథలు - 30 :**
సాధనలో రాబోయే అవరోధాలను గుర్తించండి 25
15. **యుగనిర్మాణ యోజన - సత్సంకల్పములు :**
మహాకాలుని గీత 28
16. **వ్యక్తి వికాసం :**
సహృదయంతో మహాత్ములు కాగలరు 30
17. **సంగీతంతో చికిత్స** 32
18. **సత్యాన్వేషణ :** కనిపించేదంతా సత్యమేనా? 33
19. **పూజ్య గురుదేవుల అమృతవాణి :**
దేవతల రహస్యం-1 35
20. **నా వారితో నా మాట :** ఉపాసన కొందరికి ఎందుకు సఫలమవుతుంది? కొందరికి ఎందుకు కాదు? 39
21. **ఆరోగ్యమే మహాభాగ్యం-25 :** హోమియో వైద్య సేవ 41
22. **సుమతీ సూక్తం - 3** 43
23. **యుగ సృజన సాధన శిబిరము - గాయత్రీధామ్, సేంధ్వా, మధ్యప్రదేశ్** 45


# సద్గురు వచనామృతం



## అంతరాత్మ పిలుపు

భగవంతునికి పొగడ్తలు నచ్చవు. ఆయనకు ఎవరి స్తుతి, ఎవరి నింద పట్టదు. ఆయన ఎవరి పట్లా ప్రసన్నుడు కాడు, అప్రసన్నుడు కాడు. పూజ, ఉపాసన అనేవి ఒక విధమైన ఆధ్యాత్మిక వ్యాయామాలు. వీటి ద్వారా మన ఆత్మబలం పెరుగుతుంది. సత్వగుణం పెరుగుతుంది. భగవంతుడు సర్వవ్యాపి అని నమ్మేవాడు పాపం చేయడానికి భయపడతాడు. పోలీసు అధికారి కళ్ళెదుట నిలిస్తే చోర ప్రవృత్తి కలిగిన మనిషి సైతం సాధుపురుషుడివలె వ్యవహరిస్తాడు. అందరికంటె పెద్ద పోలీసు అధికారి అయిన భగవంతుడు తన లోపల, బయట నలువైపులా వ్యాపించి ఉండడాన్ని చూసే వ్యక్తి పాపం చేయలేడు. ప్రతి ప్రాణిలో భగవంతుణ్ణి చూసే వ్యక్తి అందరితో చక్కగా వ్యవహరిస్తాడు.

ఈ భగవత్ దృష్టిని పొందుటయే భగవంతుని ఆరాధనలోని ముఖ్య ఉద్దేశ్యం. ధ్యానం, ప్రార్థన, పూజ, కీర్తన, జపం మొదలైనవి మనోభూమిలో నాటుకున్న చెడు సంస్కారాలను తొలగించి సుసంస్కారాలను స్థాపించే మనో వైజ్ఞానిక ప్రక్రియలు.

ఆ అంతరాత్మ పిలుపు వింటే, దాని సంకేతాల ప్రకారం నడిస్తే అతి చెడ్డ వ్యక్తి కూడా కొద్ది సమయంలోనే మహాత్ముడు కాగలుగుతాడు. భగవద్గీతలో భగవంతుడు ఇలా అన్నాడు - "అన్నీ విడిచి నా శరణు కోరు; నీ యోగ క్షేమములు నేను చూస్తాను" నా శరణు అనగా అంతరాత్మ శరణు అని అర్థం.

*- అఖండజ్యోతి, ఫిబ్రవరి, 1951*
*అనువాదం: సత్యనారాయణ గుప్తా*

## పండుగలు

**డిశంబర్ 2012**

| | |
|---|---|
| 23-12-2012 | గీతా జయంతి<br>ముక్కోటి ఏకాదశి |
| 25-12-2012 | క్రిస్మస్ |
| 27-12-2012 | దత్తాత్రేయ జయంతి |

**జనవరి 2013**

| | |
|---|---|
| 14-01-2013 | సంక్రాంతి |
| 26-01-2013 | రిపబ్లిక్ దినోత్సవం |

**మానవ సంబంధాలలో లౌక్యం ప్రధాన పాత్ర పోషిస్తుంది**

వేద మంత్రం

# బ్రాహ్మణ ధర్మం

**త్వయా మన్యో సరథమారు జన్మో హర్షమాణా**
**హృషితాసో మరుత్వన్ ।**
**తిగ్మేషవ ఆయుధా సంశిశానా**
**ఉపప్రయంతు నరో అగ్నిరూపాః ॥**

**- అథర్వవేద (4/31/1)**

**భావార్థం :** మా సైనికులు బలశాలురగుగాక, శత్రువులను ఓడించే యోగ్యత కలుగుగాక, ఎల్లప్పుడూ ప్రసన్నులుగా ఉందురుగాక, వారి అస్త్రములు క్రిందికి దించబడకుండుగాక, దేశరక్షణలో తమ హితాన్ని హోమం చేసేటంత తత్పరులగుదురు గాక.

**సందేశం :** సైనికులు దేశ సమగ్రత, గౌరవాలకు ప్రాణవంతులైన కాపలాదార్లు. బాహ్య శత్రువుల నుండి దేశాన్ని రక్షిస్తూ ఆంతరిక సురక్ష, శాంతి వాతావరణాన్ని నిర్మిస్తారు. సైనికులు అధిక బలశాలురు, ఎటువంటి శత్రువులనైనా దర్పమణచగలిగిన అత్యంత సమర్థత కలిగినవారు కావటం అత్యంత ఆవశ్యకము.

ఇది కేవలం తలచినంత మాత్రాన సంభవమవుతుందా? దేశములో నలుమూలలా అరాచకత్వము వ్యాపించి ఉంటే, దోపిడి-హత్యలు, భ్రష్టాచారాలు, నల్లబజారు (Black Market), అవినీతి, దురాచారాలు తాండవం చేస్తుంటే సైనికులు నిష్ఠాపూర్వకంగా, క్రమశిక్షణతో దేశరక్షణ పనిలో పూర్తి మనస్సుతో నిమగ్నమై ఉండుట సాధ్యమేనా? కాదు. ఇది సంభవం కాదు. సైనికుడు ఒంటరివాడు కాదు. అతని వెనుక అతని కుటుంబం, వ్యవసాయం, వ్యాపారం మొదలైనవన్నీ ఉంటాయి. ఎప్పుడు ఇవన్నీ సురక్షితంగా ఉంటాయని హామీ ఇవ్వబడుతుందో, అతని సుఖదుఃఖాలలో దేశవాసులు అన్ని రకాలుగా పాలుపంచుకున్నప్పుడు మాత్రమే అతడు నిశ్చింతగా దేశరక్షణకు యుద్ధభూమిలో ముందుంటాడు. యుద్ధ కౌశలము, సామాజిక జ్ఞానముతో పాటుగా అతని లోపల ప్రసన్నత తోడై అతని ఆయుధాలకు పదును పెడ్తాయి. అతనిలో స్వాభిమానాన్ని జాగృతం చేస్తాయి. స్వాభిమానం అంటే ఏదైనా మంచి పనికోసం ఇష్టం, ప్రేమతో, నిమగ్నమగుట; విశ్వాసము, శ్రద్ధకలిగి ఉండుట. స్వాభిమానియైన వ్యక్తి ఏదైనా లక్ష్యప్రాప్తికి అనుగుణంగా ఆచరిస్తాడు. స్వాభిమానం ప్రేరేపించగలిగిన శక్తియే సైనికులలో దేశప్రేమను, దేశరక్షా అగ్నిని ప్రజ్వరిల్ల చేయుటలో సమర్థవంతమవుతుంది. వారిలో త్యాగము, బలిదాన భావనలు జాగృతం చేస్తుంది. వారు పూర్తి నిష్ఠతో, మనోబలంతో నిమగ్నులై, శత్రుసేనను ఊచకోత కోయగలరు. వారి తేజస్సు పౌరుషము చూసి శత్రువులు పారిపోతారు.

సమాజమంతటిలో ఈ భావనలను నింపే కర్తవ్యం బ్రాహ్మణులపై ఉన్నది. చాణుక్యుని వంటి పండితుడు, తేజస్వి, దూరదర్శియైన వ్యక్తి మాత్రమే సమాజంలో శాంతి సంరక్షణను పరిరక్షించగలడు. నేటి విషమ పరిస్థితులలో ప్రజల అభిప్రాయాలను మార్చి వారిలో ఇంగితాన్ని వికసింపచేయుట అత్యంతావశ్యకము. అప్పుడు మాత్రమే అస్త్రశస్త్రాలు ధరించిన క్రమశిక్షణాయుత సైనికుల బృందాలలో శౌర్యము, కర్మనిష్ఠ జాగృతమై, దేశాన్ని ఐశ్వర్యవంతం చేస్తుంది.

నేటి విద్యావంతులు స్వార్థం వదలి, నిజమైన బ్రాహ్మణ ధర్మం అనుసరించాలని, సుస్పష్టంగా తెలుసుకోవాలి.

★★★


## 2013 క్యాలెండర్

గాయత్రీ చేతనా కేంద్రము, హైద్రాబాదువారిచే ప్రచురింపబడిన 2013 వార్షిక క్యాలెండర్ 14 పేజీల పంచ రంగులలో అమ్మకమునకు సిద్ధముగా ఉన్నది. పూజ్య గురుదేవులు పండిత శ్రీరామశర్మ ఆచార్య గత 3 జన్మలలో మరియు ఈ జన్మలో మానవాళికందించిన మార్గదర్శనం దీని ప్రత్యేకత. అట్లే అఖండ గురుసత్తా శ్రీ సర్వేశ్వరానందులవారు శ్రీరామశర్మ ఆచార్యులవారికందజేసిన మార్గదర్శనం, కర్తవ్య బోధ-ఆదర్శ దాంపత్యం-సమర్పణ-వివేకం మున్నగునవి సర్వవేళల సర్వావస్థలయందు మీకు కర్తవ్యబోధన మార్గదర్శనం చేస్తుంది. అమ్మకం వెల ప్రతి ఒక్కటికి రూ. 15/-.

మీ కంపెనీ పేరు / మీ ట్రస్టు పేరు / సంస్థ పేరు ముద్రించవలయుననిన కనీసం 500 క్యాలెండర్లకు ఆర్డరు ఇవ్వాలి. ఒక్కొక్కదాని వెల రూ. 18/-. డిసెంబరు 5వ తారీఖు లోపల ఆర్డరు ఇచ్చినవారికి 15-20 తారీఖు లోపల క్యాలెండర్లు పంపబడతాయి.

**వివరాలకు సంప్రదించండి: 9949111175**


**గొంగళి పురుగు సీతాకోక చిలుకగా మారినట్టు మనిషి జీవితంలో పరిణితి రావాలి**



## గాయత్రీ విద్య-27

# తన్మాత్ర సాధన-1

తన్మాత్రల గురించిన వివరణ గత సంచికలో వివరించబడింది. ఈ సంచికలో తన్మాత్ర సాధనల వివరణ ఇవ్వబడుతున్నది.

### శబ్ద సాధన

శబ్ద సాధనకు ఏకాంత స్థానమునకు వెళ్ళాలి. అక్కడ ఎటువంటి కోలాహలం, శబ్దములు ఉండరాదు. రాత్రిపూట నలువైపుల ప్రశాంతంగా ఉన్న సమయం ఈ సాధనకు అనుకూలం. పగలు ఈ సాధన చెయ్యవలెనంటె తలుపులు మూసుకొని బయట నుంచి శబ్దములు వినపడకుండా చూచుకోవాలి.

1. శాంతచిత్తంతో పద్మాసనంలో కూర్చొని కనులు మూసుకోవాలి. ఒక చిన్న గడియారాన్ని చెవి దగ్గర పెట్టుకుని దాని టిక్ టిక్ ధ్వనిని ధ్యానపూర్వకంగా వినాలి. ఇప్పుడు నెమ్మది నెమ్మదిగా గడియారాన్ని చెవికి దూరంగా తీసుకెళ్తూ దాని టిక్ టిక్ శబ్దాన్ని వినే ప్రయత్నం చేయాలి. చెవికి గడియారానికి దూరం పెంచుకుంటూ పోవాలి. నెమ్మది నెమ్మదిగా అభ్యాసం చేస్తే గడియారం చాలా దూరంగా ఉన్నా కూడా టిక్ టిక్ శబ్దం వినిపిస్తూనే ఉంటుంది. ధ్వని పూర్తిగా వినిపించనప్పుడు ఆ గడియారాన్ని చెవి దగ్గరకు తీసుకువచ్చి ఆ టిక్ టిక్ శబ్దాన్ని మరల వినాలి. తరువాత గడియారాన్ని దూరం చేస్తూ సూక్ష్మ కర్మేంద్రియముల ద్వారా ఆ శబ్ద ప్రవాహములు వినే ప్రయత్నం చేయాలి.

2. గంటను ఒకసారి మ్రోగించి ఆ శబ్దమును కొంచెంసేపు వినాలి, ఇంకా సూక్ష్మ కర్మేంద్రియముల ద్వారా ఆ శబ్దమును వినే ప్రయత్నం చేయాలి. ధ్వని ఇంక వినిపించనప్పుడు మరల ఒకసారి గంట మ్రోగించి మరల అదే విధమైన ధ్యానం చేయాలి. ఈ సాధనను యోగ గ్రంథములలో ముష్టియోగంగా వర్ణించబడింది.

3. సెలయేటి ఒడ్డునగాని, నది ఒడ్డున గాని కూర్చుని నీటి గలగల శబ్దాలను శాంత చిత్తంతో కొంతసేపు వినాలి. తరువాత వేళ్ళతో చెవులు మూసుకుని సూక్ష్మ కర్మేంద్రియం ద్వారా ఆ శబ్దాలను వినాలి. శబ్దం వినబడనప్పుడు వేళ్ళను వదలివేసి సెలయేటి గలగలను మరల విని, చెవులు మూసుకుని సూక్ష్మ కర్మేంద్రియాల ద్వారా వినే అభ్యాసం చెయ్యాలి.

ఈ శబ్ద సాధనలలో లగ్నం కావడం వలన మనస్సుకు ఏకాగ్రత లభిస్తుంది. దీనితోపాటే సూక్ష్మ కర్ణేంద్రియం జాగృతమవుతుంది. అందువల్ల దూరంగా కూర్చుని మాట్లాడేవారి మాటలు ఈ సూక్ష్మ కర్ణేంద్రియములలోకి వస్తాయి. (వినవచ్చు). సుదూరమున జరిగే రహస్య సమాచారములు కూడా తెలిసిపోతాయి. దేశ విదేశాలలో జరిగే నృత్య, గీత, వాద్య ధ్వని తరంగములు చెవులలో జొరబడి చిత్తాన్ని ఉల్లాసంతో, ఆనంద భరితం చేస్తాయి. ముందు ముందు ఈ సాధన 'కర్ణ పిశాచిని' రూపంలో సిద్ధిస్తుంది. ఎక్కడ ఏమి జరుగుతోంది? ఎవరి మనస్సులో ఎలాంటి ఆలోచనలు వస్తున్నాయి? ఎవరి వైఖరి, మధ్యమ, పశ్యంతి, పరావాణులు ఏం చేస్తున్నాయి? భవిష్యత్‌లో ఏమి జరగబోతున్నది? మొదలైనవి ఏదో అశరీరవాణి చెవి వద్ద చెప్తున్నట్లుగా ఉంటుంది. ఈ సాఫల్యమునే కర్ణ పిశాచిని సిద్ధి అంటారు.

### రూప సాధన

1. వేదమాత గాయత్రి లేక సరస్వతి, లక్ష్మి, రామ, కృష్ణ మొదలైన ఇష్ట దైవముల యొక్క బాగా నచ్చిన అందమైన చిత్రాన్ని గాని ప్రతిమను గాని తీసుకోవాలి. ఏకాంత స్థానములో చక్కని వెలుతురు ఉన్న ప్రదేశంలో చిత్రాన్ని గాని, ప్రతిమను కాని ఉంచి దాని అంగ ప్రత్యంగములను మనోయోగపూర్వకంగా చూడాలి, ఆ చిత్రం యొక్క సౌందర్యం, విశేషతలను సూక్ష్మంగా చూడాలి. ఒక నిమిషం అలా చూసి కన్నులు మూసుకొని, ఆ చిత్రాన్ని ధ్యానం చెయ్యాలి. చిత్రంలో చూసిన విశేషతలు, సౌందర్యం కల్పనా పూర్వకంగా ధ్యానంలో చూడాలి. ఇప్పుడు కన్నులు తెరచి ఆ అందమైన, సుందరమైన వెలుగొందుతున్న ఆ రూపాన్ని ధ్యానిస్తూ, ధ్యానంతో పాటు ఓం మంత్రాన్ని (ఓంకారం) జపం చెయ్యాలి. ఇలా మాటిమాటికి చెయ్యడం వలన ఆ రూపం మనస్సులో ఉండిపోతుంది. ఆ దివ్యనేత్రముల దర్శనంతో చాలా ఆనందం కలుగుతుంది, మెల్లమెల్లగా ఆ ముఖాకృతి మారుతున్నట్లు తెలుస్తుంది, నవ్వుతుంది, చిరునవ్వులు చిందిస్తుంది, కోపం చూపిస్తుంది, ఒక్కొక్కసారి పట్టించుకోదు, విభిన్న భావ భంగిమలు చూపుతుంది. ఈ ప్రతిమ స్వప్నంలో లేదా జాగృత స్థితిలో కంటి ముందుకు రావచ్చు. దీనిని ప్రత్యక్ష సాక్షాత్కారమని చెప్పవచ్చు. మొదట్లో ఈ సాక్షాత్కారం మసక మసకగా ఉంటుంది. నెమ్మది నెమ్మదిగా ధ్యానం సిద్ధించినప్పుడు

**గమ్యం చేరడానికి చాలా కష్టపడాలి**

ఆ దివ్య రూపం ఎక్కువ స్పష్టంగా గోచరిస్తుంది. మొదట్లో ఆ దివ్య దర్శనం ధ్యాన క్షేత్రంలోనే కలుగుతుంది. తరువాత ప్రత్యక్షంగానూ కలుగుతుంది.

2. ఎవరి రూపాన్ని ఏ భావములతో ప్రబల మనోయోగ పూర్వకంగా ధ్యానం చేసినట్లయితే, ఆ వ్యక్తిమీద ఆ ప్రభావం పడుతుంది. ఎవరి ఆలోచనలను మార్చాలన్నా, ద్వేషాన్ని హరించాలన్నా, మధురమైన సంబంధాన్ని నెలకొల్పాలన్నా, చెడు అలవాట్లను వదిలించాలన్నా; ఆశీర్వాదంతో లాభం, శాపంతో హాని కలిగించాలనే ప్రయోగాలకు ఆధారం ఈ సాధనయే. తాంత్రికులు ప్రత్యేకమైన కర్మకాండలతో, మంత్రముల ద్వారా మనుష్యులను రోగులుగా, పిచ్చివారిగా, లేదా వశం చేసుకోవడం చూచాము.

3. ఛాయాపురుష సిద్ధి కూడా ఈ సాధనలో ఒక అంగమే. శుద్ధ శరీరం, శుద్ధ వస్త్రములతో, భోజనం చెయ్యకుండా ఒక సుమారు ఆరు అడుగులున్న అద్దం (మనిషి పొడవుకు సరియైనదిగా ఉండాలి) ముందు నుంచుని తన ఆకృతిని ధ్యాన పూర్వకంగా చూడాలి. కొంచం సేపు చూచి కన్నులు మూసుకుని దర్పణంలోని (అద్దం) ఆకృతిని ధ్యానం చెయ్యాలి. కొందరు వ్యక్తులు దర్పణం బదులు స్వచ్ఛమైన నీటిలోగాని, లేక నువ్వుల నూనెలోగాని, కరిగిన నేతిలోగాని ఈ ధ్యానం చేస్తారు. దర్పణ సాధన శాంతిదాయకము, నూనె సంహారకము (**संहारक**), నెయ్యి ఉత్పాదకము (**उत्पादक**). సూర్యుడు, చంద్రుడు, మధ్య ఆకాశంలో ఉన్నప్పుడు, వాటి ప్రకాశంలో నుంచుని తన ఛాయ (నీడ) మీద చేసిన ఇటువంటి ధ్యాన సాధనను కళ్యాణకారకముగా భావిస్తారు.

దర్పణము, జలం, నూనె, నెయ్యి మొదలైన వాటిలో ముఖాకృతి స్పష్టంగా కనుపిస్తుంది. కన్నులు మూసుకుని అలాగే ధ్యానం చెయ్యవచ్చు. సూర్యుని, చంద్రుని వైపు వీపుపెట్టి నించోటం వల్ల తమ ఛాయ (నీడ) ఎదురుగా ఉంటుంది. దానిని కళ్ళు తెరచుకుని చక్కగా చూచిన తరువాత కన్నులు మూసుకుని ఛాయా ధ్యానం చేయవచ్చు. కొన్ని రోజులు పద్ధతిగా అభ్యాసం చేస్తే ఆ ఛాయలో తన ఆకృతి కూడా కనిపిస్తుంది.

కొంతకాలం నిరంతరం ఈ ఛాయా సాధన చేసినట్లయితే ఆ ఛాయ (నీడ) శక్తివంతమవుతుంది. దానిలో తన సంకల్పం, ప్రాణం కలవడం వల్ల అది ఒక స్వతంత్ర చేతన గల ప్రాణిగా తయారవుతుంది. దాని అస్థిత్వాన్ని తన "ఛాయా పురుషుడు (జీవించి ఉన్న భూతం)" అని చెప్పవచ్చు. ప్రారంభంలో ఇది ఆకాశంలో ఎగరటం చూడవచ్చు. లేదా దగ్గరలోనే అటు ఇటూ తిరగటం కనుపిస్తుంది. దానిపై తన నియంత్రణ వచ్చినప్పుడు అది ఆజ్ఞానుసారం కనుపిస్తుంది, చెప్పింది చేస్తుంది. సాధకుని ప్రాణం బలహీనంగా ఉంటే ఈ మానస పుత్రుడు (ఛాయా పురుషుడు) కూడా బలహీనంగా ఉంటాడు, తన రూపాన్ని చూపించడం తప్ప ఏ విశేషమైన పని చేయలేడు. ఎవరి ప్రాణం బలంగా ఉన్నదో వాని ఛాయా పురుషుడు రెండో అదృశ్య శరీరంవలె పనిచేస్తుంది. ఒక స్థూల శరీరం, ఒక సూక్ష్మ శరీరం ఈ రెండు శరీరాలను పొంది సాధకుడు అతి మహత్వపూర్ణ లాభములను ప్రాప్తించుకుంటాడు. రూపసాధన ద్వారా మనస్సు కూడా వశంలోకి వస్తుంది, ఏకాగ్రత లభిస్తుంది.

★★★

## శ్రీ గాయత్రీ శతకం

**85.** ***స్పర్శ, గంధంబు, శబ్దంబు, వ్యానమాది***
***తత్త్వముల నిరువది నాల్గు తానుగల్గి***
***ధారణ నొనర్ప కలిగించు ధార్మికతను***
***విశ్వ జనయిత్రి గాయత్రి వేదమాత***

*తా:- గాయత్రీ మహాశక్తి 24 అక్షరాలతో ముడిపడి ఉన్న 24 తత్త్వాలు గలది. అవి పృథ్వి, జలము, అగ్ని, వాయువు, ఆకాశము, గంధము, రసము, రూపము, శబ్దము, స్పర్శ, ఉపస్థ, పాయు, పాద, పాణి, వాణి, ఘ్రాణ, జిహ్వా, చక్షు, త్వచ, ప్రాణ, అపాన, ఉదాన, వ్యాన, సమానము. ఇట్టి మంత్రాన్ని నిత్యం ధారణచేస్తే ధార్మిక శక్తిని కలిగిస్తుంది వేదమాత.*

**86.** ***కృష్ణ, శివ, చంద్ర, యమ, ఇంద్ర, విష్ణు, సూర్య***
***వంటి యిరువది నాల్గు దేవతల గల్గి***
***సహనముగ నుపాసన జేయశాంతినిచ్చు***
***విశ్వ జనయిత్రి గాయత్రి వేదమాత***


*తా:- గాయత్రీ మంత్రంలో 24 అక్షరాలకు అధిదేవతలు గలరు. వారిపేర్లు గణేశ, నృసింహ, విష్ణు, శివ, కృష్ణ, రాధా, లక్ష్మీ, అగ్ని, ఇంద్ర, సరస్వతి, దుర్గ, హనుమాన్, పృథ్వీ, సూర్య, రామ, సీత, చంద్ర, యమ, బ్రహ్మ, వరుణ, నారాయణ, హయగ్రీవ, హంస, తులసి. ఇట్టి మంత్రమును సహనముతో ఉపాసన చేస్తే సాధకునికి శాంతినిస్తుంది గాయత్రీమాత.*

*రచన : సహజ కవి, సాహిత్య రత్న,*
*శతక చతురానన, పద్య కవితాసుధానిధి*
*శ్రీ అయినాల మల్లేశ్వర రావు*

**ఎటువంటి పరిస్థితులలో అయినా విజయం సాధించడమే మానవ లక్ష్యం కావాలి**

గాయత్రీ చిత్రావళి - 6

# శాంభవీ దివ్యశక్తి




శివుని యోగీశ్వరుడని కూడా అంటారు. యోగము యొక్క సమస్త శక్తుల, సిద్ధుల యొక్క ఉద్గమకేంద్రము అతడే. మస్తకముపై ఉన్న చంద్రుడు తత్త్వజ్ఞానమునకు ప్రతినిధి. కంఠముపై సర్పములుండుట, దుష్టులు, పతితులను కూడా ఆలింగనము చేసుకునే సాధుత్వాన్ని తెలియజేస్తుంది. వృషభ వాహనము అంటే బలము, గట్టితనము, స్థిరచిత్తము, శ్రమశీలత, పవిత్రతలకు ప్రతీక. ఈ గుణములన్నింటి కలయికయే శివుడు. ఆయన సంహారకుడు కూడా. దోషములు, దుర్గుణములు, అనాచారములు, అనాలోచనలు, అనుపయుక్తములను తీసివేస్తాడు. అవసరములేని వాటిని నివారించుట, అవసరమైన వాటిని కాపాడుట ఈశ్వరుని శివస్వరూపం ద్వారా జరుగుతుంది. శివుని శక్తిని శాంభవీశక్తి అంటారు.

గాయత్రి యొక్క శాంభవి స్వరూపాన్ని ఆశ్రయించుట వలన శివుని శాంభవీ గుణములు, సాధకునికి లభిస్తాయి. అతడు శివుని వైపు పురోగమిస్తాడు, త్యాగము, వైరాగ్యము, సంయమము, సాధుత్వముతో పాటు యోగం ఆధ్యాత్మిక శక్తులతో సంపన్నుడవుతాడు. శివునికి మూడు నేత్రములు. మూడవ నేత్రము దివ్యచక్షువు వలన ఆత్మ తేజస్సుతో పరిపూర్ణమవుతుంది. శాంభవీశక్తి వలన ఉపాసకునికి ఈ మూడవ నేత్రము తెరుచుకుంటుంది. సంజయుడు తన దివ్యదృష్టితో ఇంటిలో కూర్చొనే మహాభారత వృత్తాంతమంతా చూశాడు, యుద్ధవివరాలన్నీ ధృతరాష్ట్రునికి వినిపించాడు. మూడవ నేత్రం తెరుచుకుంటే సాధకునికి అటువంటి దివ్యదృష్టి కలుగుతుంది. ప్రపంచములోని జ్ఞాత-అజ్ఞాత విషయాలు అన్నీ విదితమవుతాయి. ఎదుటివారిలోని మనోగత వికారాలు సహజంగా తెలిసిపోతాయి. గతకాలపు ఇతిహాసము, భవిష్యత్తులో జరుగబోయేవి తెలియవస్తాయి. పారదర్శక దర్పణం ద్వారా ఏవిధంగా లోపలి వస్తువులు కన్పిస్తాయో, ప్రపంచంలోని అనేక రహస్యాలు అదేవిధంగా ప్రత్యక్షంగా కన్పించనారంభిస్తాయి.

శివుడు మూడవకన్ను తెరచి కామదేవుని దహించాడు. ఈ బ్రహ్మతేజ బలముతో, ఋషులు శపిస్తే మనుష్యులు భస్మం కూడా అయ్యేవారు. సగర చక్రవర్తి నూరుగురు కొడుకులు ఇదేవిధంగా భస్మమయ్యారు. ఈ బ్రహ్మతేజస్సు ఒక ప్రకారమైన విద్యుత్ప్రవాహము. దీని శక్తిపాతముతో ఎవరినైనా లాభాన్వితులుగా కూడా చేయవచ్చు. తంత్రమార్గములు ఉపయోగించి అభిచారము, మరణము మొదలైన హానికారక శాపములను ఫలించేటట్లు చేయవచ్చు. ఈ బ్రహ్మతేజస్సును ప్రాపంచిక ప్రయోజనాలలో ఉపయోగించే పొరపాటు చేయరాదు. ఆత్మకళ్యాణము కొరకు మాత్రమే దీనిని సదుపయోగం చేయాలి.

– అనువాదం : డా॥ తుమ్మూరి

**తాము మారే ప్రయత్నం చేయాలి, ఇతరులు మారాలంటే కుదరదు**

బాలల భవితకు బంగారు బాట-32

# ధనాన్ని సద్వినియోగం చేయాలి



అది ఒక అందాల గ్రామం. ఆధ్యాత్మికతకు పెట్టింది పేరు. ఆ గ్రామంలో శంకరానంద స్వామివారి మఠం ఉంది. స్వామీజీ నిరాడంబర జీవి. భక్తులకు ఆయనపై అమితమైన విశ్వాసం. అంతులేని ఆరాధన. ఎవరి భక్తి కొద్దీ, శక్తి కొద్దీ వారు తమకు తోచిన కానుకలు, ఫలాలు ఆయనకు సమర్పించేవారు. ఆయన తనకు అవసరం ఉన్నంతవరకే ఫలాలు కాని, వస్త్రాలు కాని స్వీకరించేవారు. మిగిలిన వాటిని తన దర్శనం కోసం వచ్చిన వారికి పంచి పెట్టేవారు. ఈ రూపేణ ఆ గ్రామంలోని వారేగాక, ఇరుగు పొరుగు గ్రామాలలోని వారు కూడా లాభాన్ని పొందుతుండే వారు. అందువల్ల ఆయన గురించి అనేక విధాలుగా చెప్పుకుంటుండేవారు. ఆయనను దర్శించుకుంటే కోరిన కోర్కెలు నెరవేరుతాయని, సిరిసంపదలు వృద్ధి చెందుతాయని అందరికి గట్టి నమ్మకం.

అదే గ్రామంలో ధనగుప్తుడు అనే గొప్పవ్యాపారి ఉన్నాడు. తనవైన తెలివితేటలతో అంతులేని ధనాన్ని సంపాదించాడు. అయినా ఇంకా సంపాదించాలని, రాబోయే తరాల వారికి ఏ లోటూ ఉండకూడదని తపన పడిపోతుండేవాడు. ఒకనాడు స్వామీజీ గురించి విన్నాడు. ఆయనను దర్శించుకుంటే సిరి సంపదలు పెరుగుతాయి గదా! అని వెళ్ళాడు. ఒక గంప నిండా పండ్లు, మిఠాయిలు కట్టించుకుని వెళ్ళాడు. చలికాలం కదా అని ఒక మంచి శాలువా, కొంత డబ్బు తీసుకుని వెళ్ళి ఆయన పాదాల దగ్గర పెట్టి నమస్కరించాడు. స్వామీజీ ప్రేమతో ఆశీర్వదించాడు. గంపలో నుండి రెండు పండ్లు తీసుకుని ప్రక్కన పెట్టుకున్నాడు. శాలువా తీసుకుని కప్పుకున్నాడు. మిగిలిన వాటిని ధనగుప్తుడు చూస్తూ ఉండగానే పంచిపెట్టేశాడు.

ధనగుప్తునికి చాలా వింతగా అనిపించింది. "అదేంటి స్వామీ! అన్నీ పంచేశారు? కనీసం డబ్బునైనా దాచుకోలేదు. రేపటి గురించిన ఆలోచనే లేదా? అని ప్రశ్నించాడు. స్వామి చిరునవ్వుతో నా మాట సరే కాని నీవు ఇంత తపన పడి సంపాదిస్తున్నావు కదా! 20 రోజుల్లో నీకు మరణం ఖాయం. పోయేటప్పుడు ఎంత మోసుకుపోతావు? ఆలోచించుకో" అన్నాడు.

వ్యాపారికి నెత్తిమీద పిడుగు పడినట్లు అయింది. ఒక్క పరుగున ఇంటికి చేరుకున్నాడు. హడావుడిగా తన ఖాతా పుస్తకాలన్నీ తెరిచి చూసుకున్నాడు. తను పూర్తి చేయాల్సిన పనులన్నీ 20 రోజుల్లో ఎలా అవుతాయి? అని దిగులుపడ్డాడు. పగలు, రాత్రి నిద్రాహారాలు మాని ఒక్కొక్కటి పూర్తిచేయడం మొదలుపెట్టాడు. రావాల్సిన బాకీలన్నీ వసూలు చేసుకున్నాడు. కొత్తగా కొన్న స్థలాలు, పొలాలు మొదలైనవన్నీ రిజిస్ట్రేషన్లు చేయించుకున్నాడు. భార్యాబిడ్డల పేర్ల మీద వీలునామాలు వ్రాశాడు. ఒక్కొక్క పని పూర్తి అవుతూ ఉంటే అతనిలో నీరసం పెరిగిపోయింది. ప్రపంచం అంతా శూన్యంగా కనిపించసాగింది. "కోట్ల విలువ చేసే ఆస్తిని సంపాదించాను. హాయిగా, ఆనందంగా జీవించవచ్చని కలలు కన్నాను. ఇంత వేగంగా మరణం తరుముకు వస్తుందని ఊహించనే లేదు" అని పరిపరి విధాల ఆలోచించాడు. ఒక్కసారిగా స్వామీజీ మనసులో మెదిలారు. మనసులో ఏదో తళుక్కున మెరిసింది. ఒక్క ఉదుటున ఆశ్రమం చేరుకున్నాడు.

ధనగుప్తుడు ఆశ్రమం చేరుకునే సమయానికి స్వామీజీ భక్తులకు సందేశం ఇస్తున్నారు. **"ద్వేషం వద్దు, అది మనస్సును కుళ్ళిపోయేట్లు చేస్తుంది; దురాశ వద్దు, అది సంస్కారాన్ని నాశనం చేస్తుంది; భేద భావం వద్దు, అది ఆప్తులను దూరం చేస్తుంది; దుర్వ్యసనాలు వద్దు, అవి శరీరాన్ని కృశింపచేస్తాయి; స్వార్థం వద్దు, అది జీవితాన్ని మింగేస్తుంది"** అని బోధిస్తున్నారు. ధనగుప్తుడు పరుగు పరుగున పోయి స్వామీజీ పాదాల మీద పడి వెక్కి వెక్కి ఏడవడం మొదలుపెట్టాడు.

స్వామీజీ ధనగుప్తుని ప్రేమతో లేవదీశాడు. కళ్ళు తుడిచాడు. నీలో ఈ మార్పు రావాలనే నేను ఆ విధంగా చెప్పాను. నీకు ఎలాంటి మరణగండం లేదు. డబ్బు సంపాదించడమే జీవిత లక్ష్యం కాకూడదు. ఆ డబ్బును మంచి పనులకు ఉపయోగించాలి. స్వార్థంలోనే పరమార్థాన్ని చూసుకోవాలి. నీలో ఉన్న అజ్ఞానం పోయింది. నీవింక చావంటే భయపడకూడదు. నీ వారందరికి కావలసిన దానికంటే ఎక్కువే సంపాదించి ఇచ్చావు. ఇక ముందైనా పరుల కోసం జీవించు" అంటూ ఓదార్చి పంపించాడు.

ఆనాటి నుండి ధనగుప్తుడు తన సంపాదనను పరోపకారానికే వినియోగిస్తూ స్వామీజీ శిష్యునిగా జీవించడం మొదలుపెట్టాడు.

విన్నారు కదా బాలలు! కలిగి ఉన్నంతలో ఇతరులకు సాయం చెయ్యడంలోనే తృప్తి ఉంది.

***కం॥ బతికిన నాలుగు రోజుల***
***గతుకుట కొరకేయనుచును కాలము గడుపన్***
***బతుకే భారంబగునని***
***మతిలోదలపంగవలయు మహిలో బాలా!***

– మధుర కవయిత్రి,
పొన్నూరు హైమవతీ శాస్త్రి

వ్యక్తిగత గెలుపు ముఖ్యం, ఇతరులను ఇబ్బంది పెట్టకుండా ఉన్నంతవరకు

ధారావాహిక ప్రజ్ఞోపనిషద్ - ఆరవ అధ్యాయం (మొదటి ప్రకరణం)

# సత్సాహస - సంఘర్షణ ప్రకరణం

**అగ్నివజ్జ్వాలకానైవ ఘృణా వల్మీకకాస్తథా ।**
**తేజసాప్యం చ కుర్వంతి లౌహస్తంభం ధరాశయమ్ ॥ 47**

అగ్ని జ్వాలలు దాహకశక్తితోబాటు వెలుగును ఇచ్చి చీకటిని పోగొడతాయి. సమాజమనే పుట్టలో, అవినీతి సర్పాలను పారద్రోలాలంటే నైతిక విలువలతో కూడిన అగ్ని జ్వాలలు అవసరం. ఆ వేడికి కుటిలనీతి సర్పాలు దహించుకుపోవడమో లేక ఈ సమాజాన్ని విడిచి దూరంగా పారిపోవడమో జరగాలి. అందువల్ల పవిత్రతతో కూడిన అగ్ని శిఖలవలే నీతి, వర్తనం ఉండాలి. లోహపు రీతిలో ఘనంగా కనిపించే స్థంభాలు కూడా అగ్ని జ్వాలలకు ఏ విధంగా కరిగిపోయి, తమ ఉనికిని కోల్పోతాయో, నేటి దుర్నీతి పటాపంచలు కావాలంటే ఆ జ్ఞానాగ్ని ఆవశ్యకం.

**భ్రష్టతా చింతనస్యాథ దుష్టతాచరణస్యచ ।**
**మాన్యతా మోహరూపాస్తా అంధాశ్చాపిపరంపరాః ॥ 48**

ఆలోచనా విధానంలో దిగజారిపోయే తత్త్వం, ఆచరణలో దుష్టశక్తుల ప్రభావం, వ్యామోహంతో కూడిన వ్యవహార శైలి మూర్ఖత్వంతో కూడిన అజ్ఞానం అనేవి పైకి కనిపించని హానికర శక్తులు ఇవి. అంతరంతరాలలో ప్రవేశించి క్రమక్రమంగా క్షీణింప చేస్తాయి. బాహ్యంగా కన్పించని దుష్టశక్తులపట్ల జాగ్రత్త వహించాలి.

**దుష్ప్ర వృత్తస్య ఏతాస్తు జ్ఞాయతాం హే మునీశ్వరాః ।**
**ఆక్రామ కాత్వ నీతిర్యా సేవంతాస్తు భయంకరాః ॥ 49**

ఓ మునులారా! ఈ భయంకరమైన దుష్ప్రవృత్తులు మన బుద్ధిని ఆక్రమించి, మానవ స్వభావాన్నే మార్చివేసి, మానసికంగా కృంగదీస్తాయి. దేహం ఆరోగ్యంగా కనిపించినా, మనస్సు కలుషితమై, తెలియనిరీతిలో నష్టాన్ని కలిగిస్తాయి.

**వినాశ లీలాః కుర్వంతి యే చక్రాంతర ఏవతే ।**
**వ్యక్తిత్వాదశక్యంతే గృహణాతుంచ నియంత్రితమ్ ॥ 50**

ఈ శక్తులు వినాశకర లక్ష్యంతో చక్రాకారంలో భ్రమిస్తూ ఉంటాయి. మాటి మాటికి మన బుద్ధిని పెడత్రోవపట్టించే ప్రయత్నం చేస్తాయి. వ్యక్తిత్వాన్ని కృంగదీసే ఈ శక్తులు అదుపు చేయడానికి, నిరోధించడానికి వీలులేనివై నిరంతరం వేధిస్తూ ఉంటాయి. చపలచిత్తులు, చంచల స్వభావులు వీటికి లోబడితే, ఈ శక్తులు తమ కార్యాన్ని మరింత సులువుగా చేసుకుపోగలవు. అందువల్ల మనం జాగ్రత్తగా వ్యవహరించాలి.

**దుష్ప్రవృత్తాయ ఏతాస్తు స్వభావే మానవస్యహి ।**
**ప్రతిష్ఠానైవ దృశ్యంతే నైవ దృశ్యంతి చాప్యలమ్ ॥ 51**

ఈ దుష్ప్రవృత్తులు మానవ స్వభావంలో ప్రవేశించి, పెడత్రోవ పట్టిస్తూ, నైతిక, ధార్మిక, సేవా ప్రవృత్తులకు దూరంగా, అనైతిక, పాపాత్మక, స్వార్థశక్తులకు సమీపంలో తిరుగాడుతూ, సాధ్యమైనంత హానిని కల్గించే యత్నం చేస్తాయి.

**కఠోర ప్రతిరోధస్య సాముఖ్యం నైవకుర్వతే ।**
**సంఘర్ష శీలతాక్షేత్ర మత్యంతం వ్యాపకం మతమ్ ॥ 52**

కఠోర దీక్షతో, ఈ శక్తులను ప్రతిఘటించే సంకల్పంతో, బుద్ధి ప్రవర్తించకపోతే సమాజం దిగజారిపోతుంది. అందువల్ల మనస్సు, బుద్ధి సంఘర్షణా ప్రవృత్తితో, అత్యంత నియమ నిష్ఠలతో కూడి ఉండడం ఆవశ్యకం. లేని ఎడల బుద్ధి, మనస్సులు ప్రకోపించి యధేచ్ఛగా సమాజాన్ని నాశనం చేస్తాయి. అందువల్ల ప్రతి ఒక్కరు అప్రమత్తులై, ఈ శక్తులను తరిమివేసే ప్రయత్నం చెయ్యాలి.

– సాధన నరసింహాచార్య

## కలసి ఉంటే కలదు సుఖం

*వన ప్రదేశాలలో భయంకరమైన తుఫాను వచ్చినప్పుడు విడివిడిగా ఉన్న వృక్షాలు ఎంత పెద్దవైనా సరే నేలకూలుతాయి. కానీ దగ్గరదగ్గరగా ఉన్న వృక్షాలు తమ సామూహిక శక్తితో తుఫాను ధాటికి తట్టుకొని నిలబడగలుగుతాయి. ఎంత పెద్ద తుఫాను అయినా వాటిని ఏమీ చేయజాలవని ఒకనాడు బుద్ధుడు తన శిష్యులకు తెలియజేశాడు. ఇదే విధంగా పరస్పరం కలిసి ఉంటే కుటుంబసభ్యులకు, ఆత్మీయతతో కలసికట్టుగా జీవించే బంధుజనులకు ఎవ్వరు ఏ కష్టం, నష్టం కలిగించలేరు.*

– ప్రజ్ఞాపురాణం నుండి

**గెలుపుకు పునాది ఓటమి**

## పరమపూజ్య గురుదేవుల సుదీర్ఘయాత్ర-6

# సత్యం పరం ధీమహి



భాగవతం పండిత్‌జీ యొక్క అత్యంత ఇష్టమైన పురాణ గ్రంథము. ఆ మహాపురాణంలోని శ్లోకాల, వ్యాఖ్యల భావార్థాలను అన్ని వేళల చర్చిస్తుండేవారు, చిన్న సమూహాలలో కూడా భాగవత శ్లోకాలు వల్లిస్తూ సమస్యలకు పరిష్కారాలు చూపేవారు. పండిత్‌జీ ఆయన యాత్రలలో ఉన్నప్పటికి ఆయన ఇంటికి ప్రజలు తరచు వస్తూ ఉంటారు. పండిత్‌జీ ఇంట్లో ఉంటే ఇక చెప్పే పనిలేదు. ఎంతోమంది ఆయన చుట్టూ ఉంటారు. ఆ రోజులలో తాయిజీ 3 సంవత్సరాల వయస్సున్న శ్రీరామ్‌ను తండ్రి దగ్గర విడచిపెట్టేది, శ్రీరామ్ తండ్రి వెంటే ఉండేవాడు. శ్రీరామ్ ఆటలాడుచూ వాళ్ళ మాటలు వింటూ శాంతంగా ఉండేవాడు. పెద్దలు చర్చించుకొనే సంస్కృత శ్లోకాలు, ఆధ్యాత్మిక మాటలు శ్రీరామ్‌కు అర్థమయ్యేవి కావు. కాని ఆ సంస్కారాల ప్రభావం మాత్రం బాలునిపై పడుతుండేది. పూర్వ జన్మ సంస్కారాల ప్రభావం తోడురాగా శ్రీరామ్ ఇప్పటి సంస్కారాలను వెనువెంటనే అంది పుచ్చుకొనేవాడు. అట్లే ఆ ఇంటిలోని వాతావరణం ప్రతి ఒక్కరిలోని సంస్కారాలు విప్పారేలా చేస్తుంది.

శ్రీరామ్ తండ్రి, భాగవత ప్రాధాన్యత విశిష్టతల చర్చ ప్రారంభించి, పద్మ పురాణాన్ని, భాగవతంలోని ఏకాదశ స్కందం వల్లించినప్పుడల్లా శ్రీరామ్ తన తండ్రి మోములోనికి తదేకంగా చూచేవాడు. భక్తి మరియు నారదుల మధ్య సంభాషణ ప్రస్తావనకు వచ్చినప్పుడల్లా శ్రీరామ్ ఉదాసీనంగా అయ్యేవాడు అంటూ తాయిజీ తరచూ జ్ఞాపకం చేసికొనేది.

యమునా నది ఒడ్డున ఒంటరిగా భక్తి దుఃఖంతో, మనోవేదనతో కూర్చుని ఉన్నది. ఇద్దరు వయస్సు మీరినవారు ఆమె ప్రక్కన స్పృహలేని స్థితిలో పడి ఉన్నారు. ఆ స్త్రీ ఆ స్పృహ తప్పిన ఇరువురిని తిరిగి స్పృహలోనికి తేవటానికి ప్రయత్నిస్తూ ఇతరుల సహాయం కొరకు ఎదురు చూస్తున్నది, అటుఇటు దృష్టి సారిస్తున్నది. కొందరు స్త్రీలు ఆమెకు ధైర్యం చెప్తున్నారు. ఇంతలో నారద మహర్షి అక్కడకు వెళ్ళాడు. ఎవరు నీవు అని ఆ యువతిని అడుగుతాడు.

ఆ స్త్రీ ఇలా అన్నది. "నా పేరు భక్తి. జ్ఞానం మరియు వైరాగ్యం నా ఇద్దరు కుమారులు. కాలానుగుణంగా వారు ముసలివారై పోయారు. నా ప్రక్కనున్న స్త్రీలు గంగ, యమున" నాకు సేవ చేయుచున్నారు. వారు నాకై ఎంతో శ్రమిస్తున్నా నా దుఃఖాన్ని ఆపలేకపోవుచున్నారు. దుర్మార్గుల కపటం, మోసం మరియు చెడు ప్రవర్తనలు నన్ను బలహీనురాలిని మరియు రోగగ్రస్తురాలిని చేశాయి. బృందావనం చేరుకొన్న పిదప నా స్థితి కొంత మెరుగైనది. కాని నా కుమారులు వయోభారం నుండి బయట పడలేదు. ఇట్లు చెప్తూ భక్తి విలపించసాగింది. అప్పుడు నారదుడు భక్తికి భాగవతాన్ని ఉపదేశిస్తాడు.

భక్తి దుఃఖాన్ని విన్న నాలుగేళ్ళ శ్రీరామ్ కళ్ళు చెమ్మగిల్లాయి. శ్రీరామ్ తండ్రి తన ప్రసంగాన్ని కొనసాగిస్తున్నాడు. భాగవత సందేశాన్ని విన్న తదుపరి భక్తి స్థితి ఉద్ధరింపబడింది. దీనితోపాటు ఆమె కుమారుల స్థితి కూడా మెరుగై తిరిగి యౌవ్వన స్థితిని పొందారు. అన్ని మత గ్రంథాలు, పురాణాల యొక్క సారాంశం భాగవత సందేశమేనని; నేడు మనము అనుసరిస్తున్న సనాతన ధర్మానికి మూలం భాగవతమేనని; జ్ఞానము, విద్య, సాంప్రదాయము, అవతారం, సమర్పణ, క్రియ, మంత్రం, యోగం, సాధన, చరిత్ర, పురాణం వగైరా అన్నీ భాగవతంలోని అంతర్భాగాలే అని చెప్పిన తండ్రి ముఖ కవళికలను గమనించి తృప్తిచెందిన శ్రీరామ్ తిరిగి తన ఆటలలో మునిగి పోయేవాడు.

**'గ' అనగా గాయత్రి :**

శ్రీరామ్ ఇంటిలో నిత్యము జరిగెడి చర్చా గోష్టులే శ్రీరామ్‌కి పాఠాలు. సాంప్రదాయ బద్ధముగా జరిగే విద్యారంభ సంస్కారం శ్రీరామ్‌కు తన 4వ ఏట పూర్తియైన పిదప జరిగింది. పండిత్ జీ తలచుకొంటే తానే తన కుమారునికి వేదాలను, మతగ్రంథాలను బోధించగలడు. కాని ఒక ఉపాధ్యాయుని పర్యవేక్షణలో విద్యని అభ్యసించుట ఉత్తమమని పండిత్‌జీ అభిప్రాయం. ఆ గ్రామంలో పండిత్ రూప్‌రామ్ అనే ఉపాధ్యాయుడు తన ఇంటిలోనే పాఠశాలను నడుపుచుండేవాడు. పండిత్‌జీ తన కుమారుని ఆయనకు అప్పగించాడు. తాయిజీ అక్షరాభ్యాసమును ఇలా వర్ణించారు – పూజానంతరం అధ్యాపకుడు చెక్క పలకను శ్రీరామ్ చేతిలో పెట్టాడు. ఆ రోజులలో పలకలు, బలపాలు లేవు. ఈ

**జీవితం ఒక యుద్ధం - వ్యక్తులతో కాదు, పరిస్థితులతో**

చెక్క పలకకు తెలుపు రంగువేసి ఉన్నది. ప్రాంతాల వారీగా విద్యాబోధనా విధానం మారుతూ ఉండేది. ఆ రోజులలో పండిత్ రూప్‌రామ్ 'గౌరు'ను (ఎర్రని మట్టిని) నీటిలో కరిగించి సిరా తయారు చేసికొని, వెదురు పుల్లను కలంగా చేసుకుని విద్యార్థులకు అక్షరాలు నేర్పేవారు. ముందు పలకకు, ఎర్ర మన్నుకు పూజ జరిగింది. ఆయన బలపాన్ని ఎర్ర మన్ను నీళ్ళలో ముంచి దానిని శ్రీరాం చేతులలో పెట్టారు. అతని చేయి పట్టుకుని మొదటి అక్షరం 'గ' వ్రాయిస్తూ 'గ' అన్నారు. శ్రీరామ్ వెనువెంటనే తన గురువును అనుకరిస్తూ, 'గ' అనగా 'గాయత్రి' అని పలికాడు. దీనితో ఉపాధ్యాయుడు అవాక్కయ్యాడు. ఏలనన, 4 ఏళ్ళ బాలుడు, అక్షరాన్ని గుర్తించి, నిర్వచించి తన స్వంతశైలిలో చెప్పుట, ఉపాధ్యాయుని ఊహకు అందనిదైనది.

'గ' అక్షరానికి గుర్తుగా గణేష్ పదాన్ని చెప్పడం ఆచారం. ఈ పద ప్రయోగం ద్వారా బాలుని మేధా సంపత్తిని వికసింప జేయుట సులభమగునని విశ్వసిస్తూ, గణేశుడు, మేధాశక్తికి అధి దేవత మరియు విద్యార్జనకు శుభ శకునమని తలచాడు ఉపాధ్యాయుడు. శ్రీరామ్ 'గాయత్రి' పదాన్ని తన నోటితో ఎవ్వరు చెప్పకుండానే ఉచ్చరించుట చూచి అచ్చట ఉన్న వారందరు ఆశ్చర్యచకితులైరి. తదుపరి 'గ' అనగా 'గాయత్రి' అని ఎవరు చెప్పారు నీకు అని శ్రీరామ్‌ని గురువు ప్రశ్నించగా, తనకెవ్వరు చెప్పలేదని, తన ఇంటివద్ద దీనిని విన్నానని బదులిచ్చాడు శ్రీరామ్. తన తండ్రి భాగవత కథ ప్రవచనంలో గాయత్రి గురించి చెప్పారు అని అన్నాడు శ్రీరామ్. దీనిని విన్న శ్రీరామ్ తండ్రి రూపకిశోర్, గురువు రూప్‌రామ్‌జీ ఎంతో ఆనందించారు. వారిరువురు బాలుని మురిపెంగా ముద్దాడారు.

ఆ రోజులలో విద్యార్థి దశలో గురువుతోపాటు విద్యార్థి ఉండుట మంచిదని తల్లిదండ్రులు భావించేవారు. ఎంత ఎక్కువ సమయం శిష్యుడు గురువుతో గడిపితే అంత ఎక్కువ నేర్చుకొనగలడు. 15-20 మంది విద్యార్థులు పండిత్ రూప్‌రామ్ పాఠశాలలో ఉండేవారు. వీరిలో కొందరు ప్రక్క గ్రామాల నుండి వచ్చారు. కొందరు విద్యార్థులు వస్తూపోతుండేవారు. ఒక్కోరోజు అక్కడే ఉండేవారు, అక్కడే నిద్రపోయేవారు. రూప్‌రామ్‌జీ శ్రద్ధ ఆసక్తులతో, ప్రేమతో విద్యార్థులను చూచేవారు. చదువులో, తినుటలో, నిద్రలో, కూర్చొనుటలో పిల్లలు ఎంతో క్రమశిక్షణను పాటించేవారు. దీనిని ఎవ్వరు వారిపై బలవంతంగా రుద్దినది కాదు. దీనిని పిల్లలు ప్రేమతో, ఆప్యాయతతో వారి హృదయాలలో స్వీకరించేవారు. తన ఇంటిలో ఉన్న విద్యార్థులను గురువే స్వయంగా వేకువఝామున నిద్రలేపెడివాడు, మామూలుగా పిల్లలు అలసిపోయినా ఉదయాన ఆలస్యముగా నిద్రలేచుట పరిపాటి. మంచముపై ఎక్కువసేపు పరుండుట పిల్లలకు ఆనందంగా ఉంటుంది. ఇటువంటి స్థితిలో, ఉపాధ్యాయుడే స్వయంగా పిల్లలను బుజ్జగించి, నిద్రలేపి వారికి స్నానం వగైరా చేయించి చదువుకోవడానికి కూర్చోబెట్టేవాడు.

**గాయత్రి బ్రాహ్మణులకు కామధేనువు :**

శ్రీరామ్ తన ఇంటిలోనే నిద్రించేవాడు. ఉదయానే 7 గంటలకు స్కూలుకు చేరుకుని సాయంత్రము వరకు స్కూలులోనే చదువుకునేవాడు. ఆ తర్వాత ఇంటికి వచ్చేవాడు ఈ దినచర్య 5-6 సంవత్సరాలు పాటించాడు. ఇది శ్రీరామ్ తండ్రితో కాశీ వెళ్ళేంతవరకు కొనసాగింది. కాశీ హిందూ విశ్వవిద్యాలయం ప్రారంభ సమయాన శ్రీరామ్‌కు ఉపనయనం, శ్రీ మాలవ్యాగారి చేతుల మీదుగా చేయించాలని నిర్ణయించారు. ఈ ఉద్దేశ్యముతో శ్రీరామ్‌కు 8 సం॥ల వయస్సు వచ్చినా ఉపనయనం జరిపించ లేదు. కాశీ చేరుకోగానే మాలవ్యాజీగారి ఇంటిలో శ్రీరామ్‌కు ఉపనయనం అతి సామాన్యంగా జరిపారు. అప్పుడు అతని వయస్సు 11 సంవత్సరాలు. ఉపనయన సంస్కార సమయంలో గాయత్రి సర్వవేదమయం అని, బ్రహ్మ స్వరూపమని మాలవ్యాజీ ఇచ్చిన ఉపదేశం కాశీ నుండి తిరిగి వస్తున్న శ్రీరామ్ చెవిలో ప్రతిధ్వనిస్తూనే ఉన్నది. తన అవగాహనకు అనుగుణంగా శ్రీరామ్, మాలవ్యాజీ ఉపనయన సమయంలో చెప్పిన దానికి వివరణ కోరుచూ తన తండ్రిని ఈ విధంగా ప్రశ్నించాడు - "గాయత్రిని బ్రాహ్మణులకు కామధేనువని ఎందుకు పిలుస్తున్నారు? అసలు బ్రాహ్మణుడంటే ఎవ్వరు? గాయత్రిని ఎవరు ప్రత్యక్ష్యము చేసికొనగలరు? బ్రాహ్మణుడు గాయత్రిని దర్శించగలిగినచో వారికి ఎందుకీ దుర్గతి పట్టింది? గాయత్రిని శపించిందెవరు? ఆ శాపాన్ని ఎవరు తొలగించగలరు?" ఈ ప్రశ్నలన్నింటికి కాశీ నుండి తిరుగు ప్రయాణ సమయంలో తన తండ్రి ద్వారా సమాధానాలను శ్రీరామ్ పొందాడు. తరువాత కాలములో ఈ సమాధానాలను గురుదేవులు (శ్రీరామ్) గ్రంథస్థం చేయుట జరిగింది. ఉపనయనం తర్వాత శ్రీరామ్ గాయత్రీ జపాన్ని నిత్యం ఉదయం మరియు సాయం సంధ్యవేళ చేయనారంభించాడు. సంధ్యా వందనము చేయకపోవుట యజ్ఞోపవీత నియమాలను భంగ పరచడమేనని, తద్వారా వ్యక్తి పతనావస్థకు చేరునదేది శ్రీరామ్ మస్తిష్కంలో బాగా నాటుకొన్నది.

కాశీ నుండి తిరిగి ఇంటికి వచ్చిన తరువాత శ్రీరామ్ ఇంటిలో తన జపానికి మరియు ధ్యానం చేయుటకై ఒక గదిని

**జీవితంలో యుద్ధం లేకపోతే నిరాసక్తత ప్రారంభమవుతుంది**

ఎన్నుకొన్నాడు. సంధ్యావందనము చేయుటకై ఇంటి డాబా మీదకు వెళ్ళేవాడు లేదా ఊరి చివర ఉన్న శివాలయానికి వెళ్ళేవాడు లేదా తమ పొలంలో ఉన్న మర్రిచెట్టు క్రింద కూడా సంధ్యా వందనము చేస్తుండేవాడు. కుమారుడు చేసెడి జప- ధ్యానాలను చూచి తండ్రి మురిసిపోయేవాడు. ఇది చూచి శ్రీరామ్ బ్రాహ్మణత్వాన్ని సార్థకం చేసుకుంటాడని, తన కులాన్నే గాక గాయత్రీ ఉపాసకులందరిని ధన్యులను చేస్తాడని శ్రీరామ్ తండ్రిగారు తరచూ చెప్పుండేవారు. బ్రాహ్మణపదాన్ని ఎప్పుడు వాడినా శ్రీరామ్ తండ్రి ఉద్దేశ్యం బ్రాహ్మణకులంలో పుట్టినవాడని కాదు. యదార్థంగా చెప్పాలంటే దీని అర్థం, ఎవ్వరైతే ఆ బ్రహ్మను అనగా ఆ పరమాత్మను లేక పరబ్రహ్మను పొందుటకై, దర్శించుటకై తపిస్తారో అతనిని బ్రాహ్మణుడంటారు.

శ్రీరామ్ ప్రాతఃకాలానే ఉదయం 5 గంటలకు నిద్రలేచి కాల కృత్యములు పూర్తికావించి, సంధ్యావందనానికి కూర్చొనేవాడు. తూర్పున సూర్యోదయపు అరుణ వర్ణం వ్యాపించే సమయానికి సంధ్యావందనం, గాయత్రీ జపంతో పాటు సవితాదేవత బంగారు వెలుగుపై కూడా ధ్యానం పూర్తి అయ్యేది. **"అనేన సంధ్యోపాసనేన కర్మణ శ్రీ పరమేశ్వరః ప్రియతాం నమమ. ఓం తత్ సత్ బ్రహ్మార్పణమస్తు"** ఈ మంత్రోచ్చారణతో యువ శ్రీరామ్, తన జప మరియు ధ్యాన ఫలాలను భగవదార్పణం గావించి ఇంటికి తిరిగి వెళ్ళేవాడు. 7 గంటలకల్లా తయారై పాఠశాలకు చేరుకొనే వాడు. నిత్య పాఠాలతోపాటు ఉత్తమ నడవడి, ఉత్తమ గుణాలు కూడా ఆతనికి అబ్బేవి. సూర్యాస్తమయానికి ముందుగా సాయం సంధ్యావందనం ప్రారంభించేవాడు. సాయంకాలం ఆకాశంలో నక్షత్రాలు తొంగి చూచే సమయానికి శ్రీరామ్ తన సాయంకాల సంధ్యావందనాన్ని పూర్తిచేసేవాడు. ఇదే రీతిగా 4-5 సంవత్సరాలు జరిగింది. గాయత్రీ జపాన్ని మత గ్రంథాలు ప్రబోధించిన ప్రకారం నియమ నిష్ఠలతో క్రమంతప్పక అత్యంత శ్రద్ధా భక్తులతో ప్రగాఢ విశ్వాసంతో ఎవరైతే చేస్తారో వారు ఆధ్యాత్మిక జగతిలో అత్యున్నత శిఖరాలనధిరోహించెదరని మత గ్రంథాలు చెప్పుచున్నాయి. గాయత్రిని కామధేనువు అన్నారు. ఆధ్యాత్మిక మత గ్రంథాలపై మరియు సాధనపై విశ్వాసముంచినచో, అది సాధకుని ఆధ్యాత్మిక ఉన్నతికి చేర్చగలదు.

**సాధన ఒక ఆట :**

బాలుడు శ్రీరామ్, ప్రతినిత్యం ఉదయం సాయంత్రం చేసే సంధ్యావందనంతో పాటు ధ్యానాన్ని పగలు కూడా చేయుట ప్రారంభించాడు. పాఠశాలలో శ్రీరామ్‌కు ధ్యానం చాలా ఇష్టమైన ఆట. పాఠశాలలో ఖాళీ సమయం లభించినప్పుడు ఇతర పిల్లలు ఆడుకుంటూ ఉంటే తాను మాత్రం జప, ధ్యానాలలో గడిపేవాడు. కొంతమంది సహచరులు శ్రీరామ జపధ్యానాల పట్ల కొంత శ్రద్ధ కనపరచేవారు. ముగ్గురు, నలుగురు పిల్లలు కలసి కొత్త ఆట ప్రారంభించి దానికి సాధన అని పేరు పెట్టారు. ఆటలో కన్నులు మూసుకొని కూర్చొనేవారు. రెండు కను బొమ్మల మధ్య ప్రకాశించే సూర్యుని చూడమనేవారు. కాని ఎంతమంది నిజంగా ఈ ఆటను అర్థం చేసికొన్నారో తెలియదు కానీ వారు ఈ ఆటవలన ఆనందానుభూతిని పొందుట గమనార్హం. తరువాతి ఆటలలో గాయత్రి, హిమాలయాలు, గంగ, యమున, సరస్వతి, ఋషులు మరియు తదితర గొప్పవారి గురించి చర్చించుట జరిగేది. ఆ చర్చలలో తర్కానికి తావు లేదు. 8-10 వాక్యాలు మాట్లాడేవారు, తరువాత చర్చలను ఒక అర్థగంట కొనసాగించి వెళ్ళిపోయేవారు. కొన్ని రోజుల తరువాత శ్రీరామ్ స్నేహితులు ముగ్గురు, నలుగురు పిల్లలతో కలసి సమీపంలో ఉన్న అడవికి వెళ్ళేవాడు. అక్కడ పెద్ద చెట్టు నీడన ఈ చర్చలు కొనసాగేవి.

ఒకరోజు శ్రీరామ్ ఒంటరిగా అడవికి వెళ్ళి మధ్యాహ్నానికి తిరిగి వచ్చాడు. ఇంటిలో పనుండి స్కూలుకు రాలేదనుకున్నాడు ఉపాధ్యాయుడు, అతడు స్కూలులో ఉన్నాడని ఇంటిలోనివారు అనుకున్నారు. కావున ఎవ్వరు శ్రీరామ్‌ను వెతుకుటకు వెళ్ళలేదు. కాని శ్రీరామ్ సాధన ఆట పట్ల అభిరుచిగలిగినవారు శ్రీరామ్‌ను వెదుకనారంభించారు. మధ్యాహ్నం శ్రీరామ్ కన్పించగానే ఎక్కడికి వెళ్ళావని ప్రశ్నించారు. అడవిలో ఒక గుహ కన్పించింది, దానిలో ఎటువంటి ఆటంకాలు లేకుండా ధ్యానం చేసుకొనవచ్చు అని చెప్పాడు శ్రీరామ్. మరుసటి రోజు స్నేహితులతో కలసి ఆ గుహకు శ్రీరామ్ వెళ్ళాడు. అతని స్నేహితులు అతి ప్రయాసతో గుహ ముఖద్వారం దాకా వెళ్ళగలిగారు. కాని ధైర్యం చేసి గుహలోనికి వెళ్ళలేకపోయారు. శ్రీరామ్ ఒక్కడే లోపలికి వెళ్ళాడు. అతని స్నేహితులు సందిగ్ధంలో పడిపోయారు. వారికి గుహ లోపలికి వెళ్ళే ధైర్యం లేదు. వెనుదిరిగి స్కూలుకు వెళ్ళనూలేరు. వాళ్ళ నాయకుడైన శ్రీరామ్ కొరకు గుహ వెలుపల వేచిఉన్నారు.

ఒక గంట తరువాత శ్రీరామ్ గుహ నుండి వెలుపలికి రాగానే, ఇక నుండి అతని ధ్యానం ఆటలో పాల్గొనబోమని చెప్పారు. వారి స్నేహితుల నిర్ణయం శ్రీరామ్‌లో ఎటువంటి మార్పు కలిగించలేదు. స్కూలు పని నుండి విరామం లభించినప్పుడల్లా శ్రీరామ్ గుహలో ధ్యానానికి కూర్చునేవాడు. తరచుగా తరగతులకు హాజరు కాకపోవుట గమనించి, శ్రీరామ్ ఉపాధ్యాయుడు, ఇతర

**యుద్ధంలో క్షణికావేశం పనికిరాదు**

విద్యార్థులను ప్రశ్నించగా, గోపాల్ అనే విద్యార్థి శ్రీరామ్‌ను గురించిన పూర్తి సమాచారాన్ని అందించాడు. శ్రీరామ్ తల్లిదండ్రులకి ఈ విషయాన్ని చెప్పవలసిందిగా గోపాల్‌ను ఆదేశించాడు ఉపాధ్యాయుడు. ఈ విధంగా తాయిజీకి శ్రీరామ్ ధ్యాన సమాచారం తెలిసింది. శ్రీరామ్‌ను పిలిచి, ఆమె మందలించింది. అడవిలో క్రూర జంతువులుంటాయి, అవి నిన్ను చంపేస్తాయి అని చెప్పింది. ఇక మీదట గుహకు వెళ్ళనని మౌనంగానే తల్లికి సమాధానమిచ్చాడు. అతని తల్లి, ప్రేమతో శ్రీరామ్‌ను దగ్గరకు తీసికొని హృదయానికి హత్తుకుంది.

ఆనాటి నుండి శ్రీరామ్ స్కూలుకు ఏనాడు గైర్హాజరు కాలేదు జ్వరం ఏదైనా వస్తే తప్ప. స్కూలుకు నిత్యం సమయానికి ఖచ్చితంగా వెళ్ళేవాడు. వెళ్ళని రోజున, ఫలాన కారణం వలన ఆయన పాఠశాలకు రావడం లేదని కబురు వెళ్ళేది. ఒకరోజు శ్రీరామ్ స్కూలుకు వెళ్ళలేదు, కనీసం కబురు కూడా పంపలేదు శ్రీరామ్ ఆ రోజు స్కూలుకు వచ్చుట లేదని. చెప్పుట మరచారేమోననుకొని ఉపాధ్యాయుడు దీనిని పట్టించుకొనలేదు. ఆ రోజు సాయంత్రం ఉపాధ్యాయునికి కబురందింది శ్రీరామ్ ఇల్లు చేరలేదని, స్కూలుకని బయలుదేరిన విద్యార్థి స్కూలుకు వెళ్ళక ఎక్కడికో వెళ్ళాడు. టీచర్ గారికి అడవిలోని గుహకు వెళ్ళాడేమోనన్న అనుమానం వచ్చింది. దీనికి తాయిజీ చెప్పింది, గుహకు వెళ్ళవద్దని చెప్పాను, వెళ్ళడు అన్నది. గుహలో వెతక వలసిన పనిలేదు, అయినా వెదుకుటకై అడవిలోని గుహ దగ్గరకు కొంతమంది వెళ్ళారు. పౌర్ణమి వెళ్ళి అప్పటికి 8 లేక 9 రోజులు గడిచాయి., మసకగా ఉన్నా చంద్రుని వెన్నెల కాంతిలో బాట బాగుగనే కన్పిస్తూ ఉన్నది. అయిన అవసరమయితే వెలిగించడానికి ఒక కాగడా తీసుకువెళ్ళారు.

**హిమాలయాలే నా నివాసం :**

శ్రీరామ్ తండ్రి పండిత్‌జీ గుహ వెలుపలి నుండి కేకవేశాడు. లోపలినుండి సమాధానం లేదు. ఆయన కేకే ప్రతిధ్వనించింది. కాగడా వెలిగించి గుహలోపల వెదుకుటకు నిర్ణయించారు. 12 మీటర్ల పొడవుగా వంకర టింకరగానున్న గుహను పూర్తిగా గాలించారు. శ్రీరామ్ జాడలేదు. అందరు ఇంటికి విచార వదనంతో తిరిగి వచ్చారు. ఇంటి వద్ద తాయిజీ ఏడుస్తూనే ఉన్నది. శ్రీరామ్‌కై వెదుకుట జరుగుచున్నది. మరుసటి రోజు ఉదయం తాయిజీ మామ శ్రీ రుక్మిణీ ప్రసాద్ తాయిజీని కలుసుకొనుటకై వచ్చాడు. కాని క్రితం రాత్రే ఆవల్ ఖేడా వచ్చిన రుక్మిణీ ప్రసాద్, నేరుగా తాయిజీ ఇంటికి రాలేదు. ఆనాటి సాంప్రదాయాన్ని అనుసరించి, కుమార్తె లేక మేనకోడలి ఇంటిలో మకాం చేయకూడదు. కావున ఆయన ఆ రాత్రంతా ఊరి వెలుపల ఉన్న గుడిలో గడిపాడు.

మేనకోడలి ఇంటికి చేరుకున్న శ్రీరుక్మిణీ ప్రసాద్‌కి ఆ ఇంటిలోని వాతావరణం శ్రీరామ్ జాడతెలియకపోవుట వల్ల దుఃఖపూరితంగా, బాధాతప్తంగా కన్పించింది. అప్పుడు జ్ఞప్తికి తెచ్చుకున్నాడు రుక్మిణీ ప్రసాద్, తను వచ్చేదారిలో 10-12 సంవత్సరాల వయసున్న బాలుని చూచి అచ్చెరువొంది, ఒంటరిగా ఎక్కడికి పోతున్నావని ప్రశ్నించాడు. ఆ బాలుడు తన సహజ ధోరణిలో హిమాలయాలకు వెళ్ళుచున్నానని చెప్పాడు. ఆ సమాధానముతో రుక్మిణీ ప్రసాద్‌కు నవ్వు వచ్చింది. బాలుడు ఘటికుడే అనుకున్నాడు. బాహాటంగా నవ్వాడు రుక్మిణీ ప్రసాద్ బాలుని సమాధానానికి ఏలనన, హిమాలయాలు అచ్చటికి చాలా దూరంలో ఉన్నాయి. అక్కడి ప్రజల దృష్టిలో పర్వతం అంటే గోవర్ధన పర్వతమే, అది కూడా కనీసం నలభై మైళ్ళ దూరంలో ఉన్నది. తనకు ఎదురు వచ్చిన పిల్లవాడు తన మేనకోడలి కొడుకు శ్రీరామ్ అని ఆవల్‌ఖేడా చేరుకున్న పిదప రుక్మిణీ ప్రసాద్ తెలుసుకున్నాడు.

ఇది విన్న వెంటనే పండిత్ జీ శ్రీరామ్‌ను వెతుకుటకై సిద్ధమయ్యాడు. రుక్మిణీప్రసాద్ క్రితంరోజు శ్రీరామ్‌ను తాను కలుసుకొన్నచోటికి వారిని తీసికొని వెళ్ళాడు. అచ్చటి నుండి కనీసం బాలుడు ఆ సమయానికి 3-4 మైళ్ళు ముందుకు ప్రయాణించి ఉంటాడని ఊహించారు. అదే మార్గములో వారు ముందుకు కొన్ని మైళ్ళు ప్రయాణించగా, అచ్చట కొలను ప్రక్కన ఉన్న శివుని మందిరలో జపం చేసుకొంటున్న శ్రీరామ్‌ను వారు చూచారు. శ్రీరామ్‌ను గుర్తించగానే శ్రీరామ్ తండ్రి ఎంతో బరువు దించుకున్నవానిలా ఆనందపడి, బాలుడు తన జపాన్ని ముగించు వరకు అచ్చటనే వేచి ఉన్నాడు. శ్రీరామ్ జపాన్ని పూర్తిగావించుకొని లేవగనే, అతని తండ్రి గట్టిగా శ్రీరామ్‌ను కౌగలించుకొని ఇలా అడిగాడు. "నీ వయస్సు హిమాలయాలకు వెళ్ళే వయస్సా? మాకు చెప్పకుండా ఎందుకు వచ్చావు? నీ తల్లిదండ్రులకు మనస్తాపాన్ని కలిగించుట నీకు ధర్మమా?" ఇలా అనేక ప్రశ్నలు వేస్తూ రూప్‌కిశోర్ శర్మ కంటనీరు పెట్టుకున్నాడు.

తాయిజీ దుఃఖం వర్ణనాతీతంగా ఉంది. ఏడ్చి ఏడ్చి తాయిజీ సొమ్మసిల్లింది. కుమారుని చూడగనే ఆమె బిగ్గరగా ఏడ్చుట ప్రారంభించింది. సమయంలో శ్రీరామ్ జన్మించిన వేళ జరిగిన

**మనం చేసే యుద్ధం యొక్క అంతిమ ఫలితం చిరునవ్వు**

సంఘటనలు, స్మృతులు ఆమెను చుట్టుముట్టాయి. అవి బిడ్డను చూచుటకు సాధువులు మరియు సన్యాసులు వచ్చుట, ఆమెకు వచ్చిన కల, శ్రీరామ్‌ను గురించి చెప్పిన భవిష్యవాణి, నిత్యపూజ పట్ల అతనికి గల శ్రద్ధ మున్నగునవి. శ్రీరామ్‌ను సాధన వైపు పురికొల్పిన వారిని తిట్టిపోసింది. తల్లి కోపాన్ని, మాటలను విన్న శ్రీరామ్ సాధువులను మరియు తన ఇష్ట దైవమైన ద్వారకానాథ్ దేవుని నిందించవద్దని అన్నాడు. ఆమెకు కలిగిన బాధకు తానే కారకుడు కనుక తననే తిట్టుట ధర్మమని తల్లితో చెప్పాడు. తాయిజీ నిందలను ఆపి తనయునితో ఇట్లన్నది – "నా బాధకు నీవే కారణమని నిజంగా తలస్తే నీవు నాకు మాట ఇవ్వు, ప్రతిజ్ఞ చెయ్యి" శ్రీరామ్ ఊపిరిని బిగబట్టి తల్లి చెప్పిన మాటలను వినసాగాడు. "ఎన్నడు నీవు సాధువు లేక సన్యాసివై నన్ను విడచి పోరాదు. నేను బ్రతికి ఉన్నంతకాలం నీవు నా శ్రీరామ్‌వే, అలాగే నేను బ్రతికి ఉన్నంత వరకు నీవు హిమాలయాల్లో ఉండుటకు ఆలోచించరాదు. నేను చనిపోయిన తరువాతే నీవు ఎక్కడికైనా వెళ్ళాలి. ఈ విధంగా తాయిజీ తన ప్రతిమాటను ఎంతో ఆలోచనతో, జాగ్రత్తగా పలికింది. శ్రీరామ్ కూడా ఎంతో శ్రద్ధతో, జాగ్రత్తగా తల్లి మాటలు విన్నాడు. "అలాగే అమ్మా! ఎల్లప్పుడు నీ వద్దనే ఉంటాను ఈ వ్రజ ప్రాంతాన్ని (బృందావనాన్ని) విడచి పెట్టను ఏలనన నీవు ఎంతగా ఈ కృష్ణుని ప్రాంతాన్ని ఇష్టపడతావో నాకు తెలుసు'' అన్నాడు శ్రీరామ్. ఇది విన్నాక ఆమె శాంతించింది. ఆమెకు నమ్మకమున్నది శ్రీరామ్ ఒకసారి మాట ఇస్తే జవదాటడని, దానిని నిలబెట్టుకుంటాడని. ఆ రోజు ఇంటిలో పండుగ జరుపుకున్నారు. తన కుమారుడు తనను విడచిపోడని ఆమె బాగా నమ్మకంతో ఉన్నది. పనిమీద మరొక చోటికి పనికై వెళ్ళుట వేరే విషయం. తన కుమారుడు ఎల్లప్పుడూ తనకు, తన ఇంటికి అందుబాటులో ఉండాలనేదే ఆమె కోరిక. తల్లి కోరిక ప్రకారం ఆమె కోర్కెను తీర్చుటకై శ్రీరామ్ మాట ఇచ్చాడు.

ఈ పై సంఘటన పిదప శ్రీరామ్ విద్యాభ్యాసం మరియు సాధన యదావిధిగా కొనసాగుతున్నాయి. అతని తండ్రి అతనిపై ప్రత్యేక శ్రద్ధ కనబరచసాగాడు. శ్రీరామ్ ప్రాథమిక విద్య 4-6 మాసాలలో పూర్తి కానుంది. గత అనుభవంతో ముందు జాగ్రత్తగా, శ్రీరామ్‌ను ఉన్నత విద్యకై గ్రామం వెలుపలకు పంపకూడదని నిశ్చయించారు. ఆయన కుమారునికి తొలుత లఘు సిద్ధాంత కౌముది బోధించారు. ప్రాథమిక విద్య పూర్తిచేసిన పిదప సంస్కృతాన్ని నేర్చుకొనుటకు శ్రీరామ్‌కు సమయం ఎక్కువ లభించేది. ఈ విధంగా భాగవతం, రామాయణం మరియు మహాభారత గ్రంథాలను అధ్యయనం గావించిన తరువాత శ్రీరామ్ వేగంగా మిగిలిన సంస్కృత గ్రంథాలను చదవడం ప్రారంభించాడు. పండిత్‌జీ తాను బహు కొద్దికాలమే జీవించ గలనని గుర్తించి తన కుమారునికి సనాతన వేద విద్యపైనే ఎక్కువ సమయం వినియోగించి నేర్పించసాగాడు. తదుపరి రెండు సంవత్సరాలు భాగవతాన్ని మాత్రం వారసత్వ విద్యగా తన కుమారునికి బోధించాలనుకొన్నాడు. తన కుమారుడు కూడా తనలా భాగవత కథా కాలక్షేపము చేస్తాడని భావించి ఉండవచ్చు. అంతకు మించి ఏదైనా కారణం ఉంటే దానిని ఊహించు కోవలసిందే.

– *అనువాదం:* ఎ. వేణుగోపాల రెడ్డి


## ప్రేరణ

*సాహసాన్ని ప్రదర్శించడానికి దృఢమైన శరీర సౌష్ఠవం కలిగి ఉండాలనే నియమము ఏదీ లేదు.*

*మిలటరి నుండి పదవీ విరమణ చేసిన లారెన్స్ ఒక వ్యవసాయ కర్మాగారం నిర్మించాలనుకున్నాడు. సంకల్పం గట్టిది కావడంతో భాగస్వాములు దొరికారు. కర్మాగార నిర్మాణం జరిగింది. ఒకరోజున మంచు విపరీతంగా కురుస్తుండటం వలన అతను నడుపుతున్న ట్రక్కు మంచులో ఇరుక్కున్నది. ట్రక్కు దిగి నడవడం మొదలుపెట్టాడు. విపరీతమైన మంచు, చీకటి దానికి తోడు పెద్ద గాలి. ఒక చెట్టు విరిగి ఇతనిపై పడింది. దానితో అతని రెండు కాళ్ళు మంచులో కూరుకు పోయాయి. కదలలేక అలాగే ఉండిపోయాడు. మరునాడు అతనిని చూచినవారు ఆస్పత్రిలో చేర్పించారు. కాని అతని రెండు కాళ్ళు తీసివేయవలసి వచ్చింది. మూడు నెలల తరువాత హాస్పిటల్ నుండి తిరిగి వచ్చిన లారెన్స్ కాళ్ళు కోల్పోయాయనే ఆలోచన లేకుండా యధా ప్రకారం ఉత్సాహంగా ప్రణాళికలు వేయడం ప్రారంభించాడు. చక్రాల కుర్చీ సహాయంతో తిరిగే ఏర్పాటు చేసుకున్నాడు. కాళ్ళు కోల్పోయిన వ్యక్తి ఇటువంటి కర్మాగారాన్ని ఎలా నడుపుతున్నాడో చూద్దామనే కూతూహలంతో ఎంతో దూరం నుండి జనం వచ్చేవారు. అతనిని చూచి గొప్ప ప్రేరణ పొంది వారు కూడా తమ సోమరితనానికి స్వస్తి చెప్పి ప్రయోజకులుగా కృషి ప్రారంభించేవారు.*

– ప్రజ్ఞాపురాణం నుండి

**ఎవరైతే నిరంతరం ఉల్లాసంగా ఉంటాడో అతనే విజేత కాగలడు**



మస్తిష్కమే కల్పవృక్షం - 3

# విస్మయం కొలిపే మస్తిష్కం-1

మానవ శరీరం జీవించి ఉండాలంటే అవసరమైన కార్య కలాపాలు విభిన్న అంగ ప్రత్యంగముల ద్వారా జరుగుతుంటాయి. కాని వీటన్నింటిని నియంత్రించేది మస్తిష్క ప్రణాళికయే. అచేతన మనస్సు (sub conscious mind) ద్వారా శరీరం యొక్క స్వ సంచాలిత ప్రణాళిక జరుగుతుంటుంది. చేతన మనస్సు (conscious mind) ద్వారా అహంకారం యొక్క అంతఃకరణ చతుష్టయం పనిచేస్తుంటాయి. మస్తిష్కపు స్థితిని అనుసరించి వ్యక్తిత్వ నిర్మాణం జరుగుతుంది, ప్రశస్తమైన ప్రగతి పథం నిర్మించ బడుతుంది. ఆలోచించగలిగే సామర్థ్యమే ఈనాటి మనిషి ఔన్నత్యానికి కారణం. విజ్ఞానం, శిల్పం, దర్శనం, ఆధ్యాత్మికత, కళ, శిక్షణ, చికిత్స మొదలైనవి జ్ఞాన సముపార్జన నుంచి ఉబికిన ధారలు, సంపదలు. ఈ కారణంగానే మానవుడు సామాన్యస్థితి నుండి అసమాన్యుడుగా తయారవుతాడు. ఇతర ప్రాణులతో పోలిస్తే మానవుడు ఎంతో సాధనా సంపన్నుడై వికాస పథంలో పయనిస్తున్నాడు. దీనికి కారణం మానవుని మస్తిస్క వికాసం యొక్క చమత్కారమేనని చెప్పాలి.

మానవ చైతన్యంలోని రహస్యమయమైన పొరలను గుర్తించ గలిగి, వాటిని ఉత్తమంగా మలచగలిగితే అతను అత్యంత ఉత్కృష్ట జీవన సాఫల్యం పొందగలిగాడని నిశ్చయంగా చెప్పవచ్చు. స్థూలజగత్తులో చెదురుమదురుగా పడిఉన్న శక్తిని చూచి భౌతిక విజ్ఞానం ఆశ్చర్యపడిపోతున్నది. దానిని హస్తగతం చేసుకోవాలని ఉవ్విళ్ళూరుతున్నది.

సామాన్యునిలో అసమాన్యమైన స్థితి దాగి ఉన్నది. దీనిని తెలుసుకోవాలనే జిజ్ఞాస పెరిగింది. ఉదాహరణకు సూర్యుడిని తీసుకుందాం. ఆయన వేడి, వెలుతురు ఇచ్చేరోజు ఉదయించే అస్తమించే చిన్న అగ్ని పిండం మాత్రమే. కాని లోతుగా పరిశీలిస్తే అంతులేని శక్తి భాండాగారంగా దర్శనమిస్తాడు.

సూర్యుని మధ్యభాగంలో 5,00,00,000 డిగ్రీ సెంటిగ్రేడు ఉష్ణోగ్రత ఉంటుంది. ఈ మహాశక్తి యొక్క 2,00,000 వంతు మాత్రమే ఆయన ప్రకృతి యొక్క వికాసానికి, వినాశనానికి, సంతులనకు ఉపయోగిస్తాడు. తక్కిన శక్తినంతా సురక్షితంగా భద్రపరుస్తాడు. అది పాత్రత గలిగిన వారి కోసమో, లేదా ఏదైనా భగవంతుని ప్రయోజనం కోసమో, అనవసరమైన శక్తిని ధ్వంసం చేయడానికో, నిర్మాణ కార్యక్రమాల కొరకో వినియోగించ బడుతుంది.

మానవుడు ఆర్జించిన సమస్త సాధనములు సూర్యుని శక్తి భాండారంతో పోలిస్తే అతిస్వల్పమైనవి. అది నీటి బొట్టును సముద్రంతో పోల్చుట వంటిది. సూర్యుని శక్తిని ఉపయోగించుకో గలిగితే మానవుడు సర్వశక్తిమంతుడు కాగలడు. మానవుని శరీరం కూడా తక్కువ విలక్షణమైనది కాదు. శరీర శాస్త్రజ్ఞుల ప్రకారం మనిషి శరీరంలోని కోశములలో (cells) ఉన్న గుణసూత్రములలో (chromosomes), సంస్కార సూత్రములు (genes) సమస్త శారీరిక మానసిక లక్షణములు పొందుపరచబడి ఉంటాయి. కాలక్రమంలో అవి మనిషి శరీరంలో పరిపక్వత చెందుతాయి.

ఆశ్చర్యం ఏమిటంటే పిల్లవాని ఆకృతి, ప్రకృతి యొక్క మూస ఈ చిన్న చిన్న కణములలో దాగి ఉన్నాయి. అనేక ప్రమాణాలు ఈ తథ్యానికి పుష్టినిస్తున్నాయి. మస్తిష్కం దివ్యశక్తుల, క్షమతల భాండాగారం. మన కళ్ళతో మన కళ్ళను చూడటం కఠినమైన పని. మన శరీరంలోని రక్త ప్రవాహంలో జరిగే పరిణామాలను తెలుసుకోవడం అతికష్టం. అలాగే మన మస్తిష్కాన్ని తెలుసు కోవడం కూడా కఠినమే. మానసిక చేతనత్వంపై నియంత్రణ ఎలా సాధించాలనేది తెలుసుకోవడం అంత కన్నా కష్టం. ఇది సాధ్యపడితే బాహ్యాజగత్తులో కనిపించే సూర్యుని శక్తులతో దాదాపు సరిసమానమైన శక్తులు మన హస్తగత మవుతాయి.

వైజ్ఞానికుల తెలుసుకున్నదేమిటంటే సుమారు మూడు పౌన్ల బరువు (450×3 గ్రాములు) ఉన్న మెదడులో సుమారు 14,00,05,00,000 జ్ఞాన తంతువులు (neurons) ఉన్నాయి. ప్రభుత్వ కార్యాలయాలలో క్లర్కులు, పై అధికారులు ఎలా పనిచేస్తారో ఈ జ్ఞాన తంతువులు సంపూర్ణ శరీరం అనే సమాజం యొక్క రికార్డులు, లెక్కలు చూస్తాయి. సమస్త అంగ ప్రత్యంగముల సురక్ష, పోషణలు (maintenence) ధ్యానంలో ఉంచుకుంటాయి. మానవ మస్తిష్కాన్ని మించిన విలక్షణమైన యంత్రం, రహస్యమైన ప్రయోగశాల ఈ ప్రపంచంలో ఇంకొకటి లేదు. భగవంతుడు ఎంత జటిలముగా ఈ విశ్వాన్ని సృష్టించాడో, మస్తిష్కాన్ని కూడా అంత జటిలం చేశాడు. విచిత్ర దృశ్యములుకల విరాట్ జగత్తులో జరిగే విభిన్న క్రీడలకు అనుగుణంగా ఈ మానవ మస్తిష్కం తయారు చేయబడింది.

సుపీరియర్, ఇన్ఫీరియర్ సెరెబ్రల్ పెడంకల్స్ (cerebral peduncles) మధ్యలోనే సంపూర్ణ దృశ్య కేంద్రం (optic area), అనుభూతి కేంద్రం (sensory area) ఉన్నది. మస్తిష్కం నుండి అన్ని నరాలకు కేంద్రం (nuclei) ఇక్కడే ఉన్నది. ఇక్కడ అద్భుత ప్రపంచం దాగి ఉన్నది. కాని దీనిని యంత్రముల ద్వారా కాక భావనలతో, ధ్యానంతోనే చూడవచ్చు. చిత్తవృత్తుల నిరోధం, ఏకాగ్రత ఆధ్యాత్మికతల సమన్వయంతో దీనిని తెలుసుకోవచ్చు, వేరే ఉపాయాలు ఏమి లేవు.

రెండు కన్నుల నుండి వెలువడే ఆప్టిక్ నెర్వు (optic nerves)

అన్ని చోట్ల మంచితనం పనికిరాదు

కలసి ఆప్టిక్ ఛియాస్మా (optic chiasm) తయారవుతుంది. అక్కడే పిట్యూటరి అనే ఒక గ్రంథి (pituatary gland) ఉన్నది. ఇక్కడి నుండే క్రోధం, భయం, చింత, ప్రసన్నతలను నియంత్రించే హార్మోనులు తయారవుతాయి. ఇవి మొత్తం శరీరాన్ని నియంత్రిస్తాయి. అందుకే దీనిని మాస్టర్ గ్లాండ్ (master gland) అంటారు. భారతీయులు దీనినే ఆజ్ఞా చక్రమంటారు. దీనికి ఇరువైపుల రెండు బల్బులు (olfactory bulbs) ఉంటాయి. వీటి సూక్ష్మత గురించి వైజ్ఞానికులకు కూడా తెలియదు. కాని ఈ స్థానం యొక్క ఆంతరిక జ్ఞానం లభిస్తే శరీరం యొక్క మస్తిష్కం యొక్క అంతరాళాలలోని రహస్యాలను తెలుసుకోవచ్చని భావిస్తారు.

ప్రసిద్ధ జీవశాస్త్రజ్ఞుడు జేన్స్ ఓల్స్ యొక్క ఒక విద్యార్థి ఎలుక యొక్క మస్తిష్కంలోని ఒక భాగానికి సంకేతిమిస్తే అది తన స్వభావాన్ని మరచి పిల్లల సైకిల్ పెడల్‌ను గిరగిర త్రిప్పసాగింది. దానిలో దానికి చెప్పలేనంత ఆనందం కలిగింది. అది ఒక గంటలో 800 సార్లు ఆ సైకిల్ పెడల్‌ను త్రిప్పింది. ఈ మధ్యలో దాని ఎదురుగా తియ్యని ఆహార పదార్థాలున్న పళ్ళెం పెట్టారు. అది ఆ ఆహారం తినలేదు సరికదా దాని వంక కన్నెత్తయినా చూడలేదు.

ఒకే శరీరంలో విభిన్న వ్యక్తిత్వాలు కలసి ఉంటాయి. మానవ జీవనం ఆత్మవికాసంలో ఒక మెట్టు. మన జ్ఞానధార, మానవ చైతన్యం శాశ్వతమైనవి. వీటిని స్వచ్ఛంగా, పవిత్రంగా, బలంగా, ఆనందమయంగా చేసుకుని ఎల్లప్పుడు జీవనానందమును పొందవచ్చు.

జపం చెయ్యడం, ప్రార్థనలు చెయ్యడం, సేవ చెయ్యడం, సహకారం ఇవ్వడం, సానుభూతి చూపించడం మహత్వపూర్ణ జీవనం జీవించడం మన యోగులు మనకు నేర్పించారు. వారి ఆత్మ చైతన్యం యొక్క అనుభూతులు, పరిశోధనలు, ప్రయోగాలు వీటి వెనుక ఉన్నాయి. మనము ఎలా ఉన్నామో అది అంతా మస్తిష్కం యొక్క రచనయే (నిర్మాణమే). కాలికి దెబ్బ తగులుతుంది. దానివలన మస్తిష్కం రోదిస్తుంది, దుఃఖిస్తుంది. చీకటిగా ఉన్నది. ఆ చీకట్లో ఏదో వస్తువు తగిలితే దానిని గురించి మస్తిష్కం ఆలోచిస్తుంది, విశ్లేషణ చేస్తుంది. దాని నుంచి తప్పుకోవడానికో, దానిని ఎలా తీసివేయాలో ఆలోచిస్తుంది, ఆదేశిస్తుంది. ఇదంతా మస్తిష్కం యొక్క పనే! అందుకునే దానిని గురించి పరిశోధనలు చెయ్యడానికి నిశ్చయించుకున్నారు.

మానవ జీవనంలోని సుఖదుఃఖాలు, ఈర్ష్య-ద్వేషాలు, కామ-క్రోధాలు, తృష్ణ-సంయమము, భయం- నిర్భయం, స్వార్థం-పరమార్థం మొదలైన అన్ని గుణములు మస్తిష్కానికి సంబంధించినవేనని అనే దానికి ఆధారాలు ఇప్పటిదాకా జరిగిన పరిశోధనల వల్ల లభ్యమయ్యాయి. మస్తిష్కములోని శక్తిని ఏదో ఒక దిశలో వికసింపచేసుకుని సాఫల్యం పొందవచ్చు.

ప్రాచీనకాలంలో యోగవిజ్ఞానంతో మస్తిష్కంలోని శక్తులను అభీష్ట దిశలో వికసింపచేసుకునే పద్ధతి తెలుసుకున్నారు, లాభాన్వితులయ్యారు. ఆధునిక విజ్ఞానవేత్తలు కూడా తమదైన పద్ధతిలో ఓనమాలతో ప్రారంభించారు. ఈ దిశలో ప్రయోగాలు జరుపుతున్నారు. ఫ్రాన్స్‌దేశపు శాస్త్రవేత్త ప్రొఫెసర్ డెల్‌గాడో ఒకసారి వెంట్రుక కన్నా సూక్ష్మమైన ఎలక్ట్రోడ్ (electrode) తయారుచేసి దానిని లాలు అనే జంతువు కణతలపై తాకించి చూశాడు. లాలు చాలా పిరికి జంతువు. కాని విద్యుత్ ద్వారా మస్తిష్కంలో ఒక ప్రత్యేకమైన భాగాన్ని ఉత్తేజింపచేస్తూనే దాని భయం అంతా పోయి నిర్భయంగా తయారయింది, ఒక సింహం ఎలా ప్రవర్తిస్తుందో అలా ప్రవర్తించడం మొదలుపెట్టింది. దాని కంటే బలమైన, క్రూరమైన జంతువును దాని ఎదుట నిలబెట్టారు. కాని అది కొంచం కూడా భయపడలేదు సరికదా దానినే బెదిరించటం చేసింది. ఇందువల్ల అర్థమయ్యేదేమిటంటే భయం అనేది జీవితంలో స్వాభావికం కాదు, మస్తిష్కం యొక్క స్థితి మాత్రమే. మనం ఏ గుణమునైనా పుట్టించుకోవచ్చు. దానిని పూర్తిగా పొందవచ్చు.

మానసిక బలహీనులకు బలహీనత అనేది తమ తప్పేనని ఈ ప్రయోగం ద్వారా తెలుసుకోవచ్చు. వస్తుతః దుఃఖం, బలహీనత మనుష్యులకు సంబంధించినది కాదు. తమ మస్తిష్కము యొక్క సాహసమునకు సంబంధించిన, సుఖము ఆనందమునకు సంబంధించిన భాగమును జాగృతం చేయగలిగితే, ఇంక ఆనందమే ఆనందము. ఇంకా ప్రపంచంలో అనేక గుణాల, ఆనందముల కణాలు చిందరవందరగా పడి ఉన్నాయి. వాటిని ఒకచోట చేర్చి అగుణములను, ఆనందమును పెంచుకోవచ్చు. భయం, చెడు అలవాట్లు, నిరాశలు మన లోపల ఉత్తేజితమయితే ప్రాకృతిక నియమానుసారం అన్ని ప్రక్కల నుండి దుఃఖములు పరిగెత్తుకుని వస్తాయి. జీవితంలో మిగిలి ఉన్న కొద్దిపాటి శాంతిని నాశనం చేస్తాయి.

రష్యాకు చెందిన సుప్రసిద్ధ ప్రొఫెసర్ ఎనోరవీర ప్రయోగాలు చేసి ఇలా చెప్పారు – మస్తిష్కంలో స్రవించి రక్తంలో కలిసే రెండు రకాల స్రవాల వల్ల సుఖం లేక దుఃఖం కలుగుతాయి. మనిషి యొక్క ఇచ్ఛ, స్వభావం, అభ్యాసం బట్టి ఆ ధార ప్రవహిస్తుంది. మస్తిష్కం లోతులలో ఒక సూక్ష్మ సంస్థానమున్నది. దీనికి మస్తిష్కాన్ని, వెన్నెముకను కలిపే రెటిక్యులర్ ఫార్మేషన్ (reticular formation) తో సంబంధమున్నది. ఇక్కడి నుండే కొన్ని గ్రంథుల స్రావం జరుగుతుంది. వీటిలో కొన్ని గ్రంథుల నుండి మధురమైన రసం స్రవిస్తుంది. దీనివల్ల ప్రసన్నత, ప్రఫుల్లత, చిరునవ్వు, హాస్యం, కోమలత్వం, మర్యాద, సౌమ్యత మొదలైన గుణాలు వర్థిల్లుతాయి. చాలా హాయిగా ఉంటుంది. ఇంకొక రసంలో చెడు గుణాలు కలసి ఉంటాయి. దానివల్ల మనిషి విచారంగా, దుఃఖముతో, నిరాశతో, టెన్షన్‌తో ఉంటాడు. డా॥ ఎనోరవీన్ ఇలా అన్నారు ఈ గ్రంథుల స్రావం దానంతటవే జరుగవు. ఆలోచనాసరళి వల్ల జరుగుతాయి. **అంటే మన మంచి చెడు ఆలోచనలు, భావనలే సుఖమునకు దుఃఖమునకు జన్మదాతలు.**

*– అనువాదం: శ్రీమతి టి. జ్ఞానప్రసూన*


**సమస్యలు, చిరాకు, ఇబ్బంది, అసంతృప్తి ఇవే మన శత్రువులు**

సూర్యసాధనా సంవత్సర ప్రత్యేకం

# అనాది కాలం నుండి సూర్యోపాసన

**ఓం భూర్ భువః స్వః తత్సవితుర్వరేణ్యం భర్గోదేవస్య ధీమహి ధియో యోనః ప్రచోదయాత్- ఋగ్వేదం 3/62/10.** ఋగ్వేదంలో వర్ణించబడిన 24 అక్షరముల గాయత్రీ మహామంత్రం భరత భూమిలో సూర్యోపాసన యొక్క అతి ప్రాచీనమైన చారిత్రాత్మక సాక్ష్యము. వైదికయుగము ఆరంభమయ్యే వరకు భారతదేశవాసులు సూర్యోపాసనతో సుపరిచితులవటమే కాకుండా, దాని అతి లోతైన అర్థమును కూడా అవగాహన చేసుకున్నారు అన్న సత్యమునకు ఇది సుస్పష్టమైన ప్రమాణము.

ఋగ్వేదంలో గాయత్రీమంత్రమేకాక, సూర్యదేవతతో సంబంధం ఏర్పరిచే మరో ఐదు ఇతర సూక్తములు కూడా లభిస్తాయి. ఇంకా ఇతర దేవతా సూక్తములలో కూడా సూర్యుడిని సంబోధిస్తూ చెప్పబడిన మంత్రముల సంఖ్య 21. ఇంతేకాకుండా ఋగ్వేదంలో సూర్యుడిని- సవిత, పూషా, విష్ణువు, మిత్ర, భగ, వివస్వంతుడు, అర్యమన్, వృషాకపి, కేశిన్ మరియు విశ్వానరుడు మొదలైన విభిన్న రూపాలకు కూడా చెయ్యబడిన స్తోత్రములు భరతభూమిలో సూర్యోపాసన ఋగ్వేదకాలం కంటేకూడా మరింత ప్రాచీనమైనది అని తేటతెల్లం చేస్తున్నాయి. ఎందుకంటే సూర్యోపాసన అనే బీజములు ఒకవేళ భరతభూమి యొక్క అతి పురాతన కాలంలో నాటబడి ఉండకపోతే వైదికయుగం ఆరంభ కాలములో ఆ విత్తనములు అంకురించి, పల్లవించుట సంభవించేదికాదు.



మైక్ అనే చరిత్రకారుడు సింధునదీతీరప్రాంతములో వెల్లివిరిసిన సభ్యత యొక్క పురాతన అవశేషాలలో భారతీయుల ద్వారా పూజలందుకున్న సౌరప్రతీకయైన 'స్వస్తిక్' లభించిన విషయమును ధృవపరిచాడు. ఈ విధమైన మరిన్ని సౌర చిహ్నములు అక్కడ కనిపించిన అవశేషాలలో లభించాయి అని అతను చెప్పాడు. నిజమేమిటంటే భరతభూమిలో సూర్యోపాసన యొక్క చరిత్ర ఎంత ప్రాచీనమైనదో, ఎంత పురాతనమైనదో దాని స్వరూపము కూడా అంతే మనోరంజకమైనది. మొదట్లో సూర్యోపాసన స్వరూపము ప్రతీకాత్మకంగా ఉండేది. ఆ కాలములో 'చక్రం, కమలం' మొదలైనవాటిని సూర్య ప్రతీకలుగా భావించి వాటిని ఆరాధించేవారు. ఈ ప్రతీకలను విధివిధానమును అనుసరించి మూర్తివలె ప్రతిష్ఠించేవారు. తరువాతి కాలంలో సూర్యదేవుడిని మూర్తిగా అనగా మానవాకృతిలో ప్రతిష్ఠించే విధానము అమలులోకి వచ్చింది.

భరతభూమిలో అతి పురాతనకాలంలో ఆరంభించబడిన సూర్యోపాసన అనే నదీ ప్రవాహము కాలగర్భములో ఆగకుండా నిరంతరము వేగంగా ప్రవహిస్తూనే ఉన్నది. దాని వేగం మందగించ లేదు, పైపెచ్చు సూర్యోపాసన యొక్క సామాజిక, సాంస్కృతిక మరియు ఆధ్యాత్మికతల గొప్పతనము ఇబ్బడి ముబ్బడిగా వృద్ధి చెందుతూనే వచ్చిందనేది చారిత్రాత్మకమైన సత్యము. మహాభారత కాలంలో సూర్యోపాసన చేయుట అనేది మరింతగా ఎక్కువయింది. కుషాణుల కాలంలో ప్రజలలో సూర్యోపాసన ప్రాచుర్యంలో ఉండటమేకాకుండా, స్వయంగా కుషాను చక్రవర్తులు కూడా సూర్యోపాసకులే! చరిత్ర కారుల కథనము ప్రకారము కనిష్కుని (78 క్రీ.శ.) పూర్వజులు శివ మరియు సూర్యుని ఉపాసకులే! వీరి తరువాత క్రీ.శ.3వ శతాబ్దంలో గుప్తవంశ చక్రవర్తుల కాలంలో కూడా సూర్య, విష్ణు మరియు శివోపాసన జరిగినవనే వర్ణనలు మనకు లభిస్తున్నాయి. కుమారగుప్తుడు (414-455 క్రీ.శ.) కాలంలో విష్ణు, శివ మరియు సూర్యోపాసన విశేష రూపంలో కొనసాగింది.

స్కందగుప్తుని (455-467 క్రీ.శ.) సమయములో అయితే బులందర్ జిల్లాలోని ఇంద్రపురమను పేరు గల క్షేత్రంలో ఇద్దరు క్షత్రియులు కలిసి ఒక సూర్యదేవాలయమును నిర్మించారు. భారతీయ చరిత్రకారుల అభిప్రాయమును అనుసరించి గుప్తచక్రవర్తుల కాలం వరకు సూర్యోపాసన భారతీయుల ఆధ్యాత్మిక విశ్వాసమునకు (శ్రద్ధ) ప్రతీకగా నిలిచింది. వారికాలంలో మాలవాలోని మందసౌరము అను పేరుగల ప్రాంతంలోను, గ్వాలియర్‌లోను, ఇండోర్‌లోను మరియు బఘేల్‌ఖండ్‌లోని ఆర్‌మక్ అను పేరు గల స్థానంలోను

**జీవితాన్ని ఎప్పుడు ఒక ఛాలెంజ్‌గా తీసుకోవాలి**

నిర్మించబడిన నాలుగు అతి శ్రేష్ఠమైన సూర్యదేవాలయముల ప్రస్తావన మనకు లభిస్తుంది. ఇవేకాకుండా ఆ కాలంలో నిర్మించబడిన సూర్యదేవుని కొన్ని మూర్తులు బెంగాలులో కూడా లభ్యమౌతున్నాయి.

భరతభూమిలో ఈ సూర్యోపాసనా క్రమం తరువాత కాలంలో కూడ కొనసాగుతూనే ఉన్నది. 7వ శతాబ్దంలో సూర్యోపాసన చరమదశకు చేరుకున్నది. హర్షవర్ధన చక్రవర్తి తండ్రి మరియు ఆయన పూర్వజులు కేవలము సూర్య ఆరాధకులే కాకుండా వారు ఆదిత్యదేవుని భక్తులు కూడా! మహాకవి బాణుడు తాను వ్రాసిన 'హర్షచరిత్ర' అనే కావ్యంలో హర్షుని తండ్రి గురించి ఇలా వ్రాశారు. 'ఆయన స్వభావసిద్ధంగా సూర్యదేవుని భక్తుడు. ప్రతినిత్యం సూర్యోదయ సమయములో స్నానమాచరించి ఆదిత్యహృదయ స్తోత్రపారాయణ పలుమార్లు చేసేవాడు.' హర్షచరిత్రలోనే కాకుండా మరికొన్ని ప్రమాణాల ఆధారంగా కూడా ఆ కాలంలో భరతభూమిలో సూర్యోపాసన విస్తృతంగా చెయ్యబడేది అనేదానికి బలము చేకూరుతున్నది. హర్షుని కాలంలో ప్రయాగలో మూడురోజుల సదస్సు జరిగినది అనే సత్యమును చారిత్రక విశేషజ్ఞులు ప్రామాణికంగా ధృవీకరిస్తున్నారు. ఈ సభలో మొదటిరోజు బుద్ధుని ప్రతిమ ప్రతిష్ఠించబడినది. తర్వాత క్రమంగా రెండవరోజున, మూడవరోజున సూర్యునికి మరియు శివునకు పూజలు జరిగినాయి.

హర్షుని కాలం వరకే సూర్యోపాసన, సూర్య ఆరాధన పరిమితమవ్వలేదు. ఆ పరంపర తరువాతి కాలంలో కూడా కొనసాగుతూనే ఉన్నది. డా॥ భగవత్ శరణ్ అభిప్రాయము ప్రకారం హర్షుని తదనంతరము కూడా సూర్యోపాసన కొనసాగింది. లలితాదిత్యుడు (714-760) అనే కాశ్మీరరాజు కూడ సూర్యదేవుని అనన్యభక్తుడే! ఆయన 'మార్తాండ మందిరము' అను పేరు గల సూర్యాలయమును నిర్మించాడు. ఆ శిధిలాలను చూస్తే నిర్మాణము జరిగిన సమయములో ఆలయము అతి విశాలంగా ఉండేదని స్పష్టమౌతుంది. ప్రతీహార రాజుల కాలంలో కూడా సూర్యదేవుని పూజ విశేష ప్రాచుర్యంలో ఉండేది. వీరి తరువాత రాజస్థాన్‌ను పాలించిన చౌహాను రాజులు, ఉత్తరప్రదేశ్‌కు చెందిన గహడ్వాల్ రాజులు మరియు మధ్యప్రదేశ్ లోని చందేలు శాసకులు కూడా తమ సూర్యభక్తిని ప్రకటిస్తూ పలు సూర్య ఆలయములను నిర్మించారు. ఒరిస్సాకు చెందిన గంగయుగీన వంశ పాలకుడు, వీరుడు అయిన నరసింహవర్మ అను పేరు గల రాజు విశ్వవిఖ్యాతి చెందిన 'కోణార్క దేవాలయమును' నిర్మాణము కావించాడు. నరసింహుడే కాదు భారతదేశంలో అనేకమంది రాజులు, పాలకులు మరియు పాలితులు కూడా సూర్యారాధకులే అన్నదానికి కోణార్క దేవాలయముతోసహా పైన చెప్పిన అంశములన్నీ సాక్ష్యములుగా నిలుస్తాయి.

భరతభూమి ప్రాచీన ఇతిహాస కాలక్రమములో (ప్రారంభం నుండి 12వ శతాబ్దివరకు) నిరంతరం విస్తృతంగా చెయ్యబడిన సూర్యోపాసన దేశమునకు కేవలము ఆధ్యాత్మిక రూపంలోనేకాక, మీదుమిక్కిలి సాంస్కృతికంగా కూడా భవ్యతను ప్రసాదించినది. వైదిక వాఙ్మయముతోపాటు సూత్రములు, స్మృతులు, రామాయణ, మహాభారత మహాకావ్యములు సూర్యోపాసనకు సాక్ష్యములుగా నిలుస్తున్నాయి. బ్రహ్మాండ పురాణము, విష్ణుపురాణము, మత్స్యపురాణము మొదలగు అనేకానేక మహాపురాణములు మరియు భవిష్యపురాణము, సాంబ పురాణము మున్నగు పలు ఉపపురాణములు ఈ చారిత్రాత్మక సత్యమునకు రచనారూపంలో సాక్ష్యాలుగా కనిపిస్తున్నాయి. మహాపురాణాలు, ఉపపురాణములే కాక, మహాకవి కాళిదాసు, బాణభట్టు, భవభూతి, మయూరుడు, భట్టు నారాయణుడు, శ్రీహర్షుడు మొదలైన కవులు సూర్యస్తుతి చేసి తమ కావ్యసాధనను సఫలము కావించుకున్నారు.

సూర్యదేవత, సూర్య ఉపాసన యొక్క స్వరూపము మీద శౌనకుడు, యాస్కుడు, సాయణుడు మొదలైన ప్రాచీన ఆచార్యులు మరియు బర్లైన్, హిలే, ఆలెన్‌బర్గ్, కీథ్‌లు అంతేకాకుండా స్వామీ దయానంద, శ్రీఅరవిందులు, పండిత సాత్వలేకర్, పరమపూజ్య గురుదేవులు మున్నగు దేశవిదేశీ పండితులు, సాధకులు, యోగులు సాహితీపరంగాను, ఆధ్యాత్మిక దృష్టితోను పరిశోధనలు చేశారు. ఈ దిశగా పలు ఆలోచనలను సాగించారు. శ్రీవాత్సవ్ వంటి అనేకమంది ప్రఖ్యాత చరిత్రకారులు అతి ప్రాచీన కాలం నుండి భారతీయులు కావించిన సూర్యోపాసన గురించి చారిత్రాత్మక, పురాతత్త్వ దృష్టితో పరిశోధనలు సాగించారు. అయినప్పటికి ఇప్పుడు కూడా ఈ విషయమునకు సంబంధించిన అనేక కోణాలు, పార్శ్వములు అసంపూర్ణంగా ఉన్నాయి. వీటిమీద విస్తృతమైన, విపులమైన పరిశోధనలు తప్పనిసరిగా చేపట్టవలసిన అవసరమున్నది. అప్పుడే ప్రాచీన భారతీయ చరిత్ర, సంస్కృతులకు ప్రేరణల నిచ్చే ప్రకాశపుంజమైన సూర్యభగవానుని ఉపాసన యొక్క సర్వాంగ సుందర రూపము విశ్వదృష్టి సమక్షములో కాంతులీనగలదు. గాయత్రీమహామంత్ర ఉపాసనా దేవతయైన సవితాదేవత స్వరూపము, దాని గొప్పతనము గురించి విస్తృతమైన పరిశోధన చేసే యోజనాబద్ధమైన ప్రణాళిక దేవసంస్కృతి విశ్వ విద్యాలయములో రూపొందించబడినది. దాని ఫలితంగా భారతీయ సమగ్ర సంస్కృతి దేవసంస్కృతికి ప్రేరకుడు, ప్రకాశ పుంజము అయిన సూర్యభగవానుని అలౌకిక తేజస్సుతో వెలుగులీనగలదు.

*- అఖండజ్యోతి, నవంబర్ 2002*

*అనువాదం: శ్రీమతి లక్ష్మీరాజగోపాలు*

**సమస్య తరువాత సమస్య వస్తూనే ఉంటుంది**

# పాలకూర నుండి విద్యుచ్ఛక్తి

వృక్షములు సంవేదనాశీలతను కలిగి ఉంటాయి. ఇది ముందే నిరూపించబడినది. అయితే వీటిని విదుచ్ఛక్తి తయారీలో ప్రయోగించవచ్చునా? ఇవి ప్రత్యామ్నాయ శక్తి భాండాగారములా? అన్న ఈ విషయాలమీద ప్రయోగాలు జరిగాయి. ఈ ప్రయోగ ఫలితం ఉత్సాహమును ఇనుమడింపజేస్తున్నది. ఈ ఉత్సాహజనిత ఫలితం వైజ్ఞానికులకు ఒక స్వప్నం సాకారమగుట వంటిది. వృక్షముల యొక్క ఆయుర్వేద ఉపయోగములు, ఆర్థికంగా ఊతమునిచ్చుట మున్నగు పలులాభములు సర్వవిదితమే. అయితే విద్యుత్ ఉత్పాదనలో వీటి భౌతిక ప్రక్రియ అసాధారణమైనది, అద్భుతమైనది. ఈ అవకాశాన్ని సాకారం చేస్తూ శాస్త్రవేత్తలు మానవ కళ్యాణమునకు మరో మార్గమును తెరిచారు. అయినప్పటికి ఈ ప్రయోగం ఇంకా ప్రారంభ దశలోనే ఉంది.

అమెరికా శాస్త్రవేత్తలు ఆకుపచ్చని మొక్కలనుండి విద్యుత్తుని తయారుచేసే ఈ ప్రయోగములో మొక్కల యొక్క ఫోటోసింథసిస్ (కిరణజన్య సంయోగక్రియ) అనగా కాంతిని సమీకరించే ప్రక్రియను ఉపయోగించుకున్నారు. వెలుగును సమీకరించుట అంటే కాంతి నుండి అవసరమైన శక్తిని గ్రహించుట. వృక్షములు ఈ ప్రక్రియను జరుపుటలో అత్యంత సమర్థతను కలిగి ఉంటాయి. వెలుగు నుండి ఏవిధంగా తనకు అనుగుణ్యమైన శక్తిని గ్రహించాలి అనే జ్ఞానం మనిషికి లేదు. మనిషి ఈ విషయములో అత్యంత అసహాయుడు మరియు అసమర్థుడు. ఈ కారణంగానే మనిషి ఆహారమునకు వృక్షముల మీద ఆధారపడతాడు. కానీ కాంతి సమీకరణ ప్రక్రియను తెలుసుకోవాలి అనే తీవ్రమైన కోరిక మనిషికి ఉన్నది. ఈ అన్వేషణలో మనిషి ఈ వృక్షముల యొక్క ఈ ప్రాకృతిక సంబంధమైన సాంకేతిక పరిజ్ఞానమునకు చెందిన కొన్ని విషయములను తెలుసుకున్నాడు.

వృక్షములు సూర్యకిరణములను తమలోని ఆకుపచ్చరంగులో గల క్లోరోఫిల్, కార్బన్–డై–ఆక్సైడ్‌ని, నీటిని అత్యంత కౌశలంతో సమ్మిళితం చేసి కార్బోహైడ్రేడ్‌ను (పిండి పదార్థము) తయారు చేసుకుంటాయి. ఈ ప్రక్రియలోనే వృక్షములు ప్రాణవాయువైన ఆక్సిజన్‌ను విడుదల చేస్తాయి. ఆక్సిజన్ ఎనోరోబిక్ బ్యాక్టీరియాకు తప్ప మిగిలిన జీవ-జంతువుల జీవితమునకు మూలాధారం. నూతన పరిశోధనలలో వెలుగును సంగ్రహించగా వచ్చిన ప్రోటీనులను ఉపయోగించి కాంతి యొక్క శక్తి విద్యుత్తుగా మార్చబడినది. దీనిని విజయవంతం గావించిన ఖ్యాతి 'మెఛునట్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ' (ఎమ్.ఐ.టీ)కి చెందిన డా॥ మాకవాల్డో మరియు ఆయన సహచర వైజ్ఞానికులకు మరియు ఇంజనీర్ల బృందమునకు చెందుతుంది.

ఈ బృందం శక్తి సమీకరణకు కావల్సిన ప్రోటీన్లను పాలకూర యొక్క ఆకుల నుండి, ఒక జీవాణువైన 'రోడో బెంక్టర్ స్ఫిరోఈడీజ్' నుండి వెలికితీశారు. ఈ ప్రోటీనును గాజుతో తయారు చేయబడిన ఉపరితం మీద ఒక ప్రత్యేక పద్ధతిలో సమీకరించారు. ప్రాకృతికంగా ప్రోటీన్లు తేమతోకూడిన వాతావరణంలోనే సక్రియం అవుతాయి. అందువలన ఈ ప్రోటీనుకు ప్రాకృతిక రూపము నిచ్చుటకు పెద్దపెద్ద సమస్యలనే ఎదుర్కొనవలసి వచ్చింది, ఈ విధానంలో పాలకూర మరియు జీవాణువుల యొక్క సుమారు 200 కోట్ల ప్రోటీన్ అణువులు ప్రయోగించబడ్డాయి. ఈ ప్రోటీనులు అణువుల క్రియాత్మకతను ముందుకు తీసుకు వెళ్ళటానికి పెప్టైడ్స్ (peptides) ఉపయోగ పడతాయి.



శాస్త్రవేత్తలు పైన చెప్పిన పలుచని పొరలతో కూడిన పదార్థం యొక్క ఒక పలుచని పొరను 'ఇండియన్ టిన్ ఆక్సైడ్' తోపాటు గాజు ఉపరితలం మీద సమీకరించారు. ఈ ప్రక్రియ వలన ఈ పారదర్శక పదార్థం ఎలక్ట్రోడ్‌గా మార్పు చెందుతుంది. దీని తరువాత పరిశోధకులు ఇందులో ఒక కార్బన్ సెమీకండక్టర్ యొక్క సున్నితమైన పొరను కూడా జోడించారు. వీటన్నింటిపైన ఒక వెండి ఎలక్ట్రోడ్‌ను అనుసంధానించారు. దీని తదుపరి వీటన్నింటిమీద ఒక ప్రత్యేకమైన కాంతిని ప్రసరింపజేసినప్పుడు కాంతిని సంగ్రహించుకున్న ప్రోటీన్లు వాటిలోని ఫోటానును

**ప్రతి అనుభవం ఒక కష్టం వలనే వస్తుంది**

విడుదలచేశాయి. తద్వారా ఉత్తేజితమైన ఎలక్ట్రానులు సెమీకండక్టర్ యొక్క సున్నితమైన పొరనుండి వెండి ఎలక్ట్రానులను చేరుకున్నాయి. విద్యుచ్ఛక్తి ధార వెలువడింది. తత్ఫలితంగా శాస్త్రవేత్తల చిరకాలవాంఛ సాకారమయ్యింది. ప్రిన్స్ విశ్వ విద్యాలయమునకు చెందిన డా॥ స్టీఫెన్ ఫారెస్ట్ ఇలా అన్నారు– 'ప్రకృతి సూర్యశక్తిని ఏకత్రితం చేసుకుని దాని ద్వారా కాంతిని సంగ్రహించుటలో లక్షల సంవత్సరాలు గడిచినవి. అందువల్ల ఈ క్లిష్టమైన విధానమును అర్థం చేసుకొనుట, తెలుసుకొనుట, దీని సాంకేతిక పరిజ్ఞానమును వికసింపజేయుట కూడా ఒక సమయ, శ్రమసాధ్యమైన కార్యమే. ఈ పరిజ్ఞాన సదుపయోగంతో భవిష్యత్తులో మానవజాతికి ఒక వరం సిద్ధించవచ్చు'.

కాంతి సంగ్రహణ వలన ప్రతి సంవత్సరం పృథ్వీమీద పచ్చని మొక్కలు 150 కోట్ల టన్నుల కార్బనును, 25 కోట్ల టన్నుల హైడ్రోజన్‌తో సమ్మిశ్రితం గావిస్తున్నాయి. ఈ రసాయనికచర్యలో 400 కోట్ల టన్నుల ఆక్సిజన్‌ను విడుదల చేస్తున్నాయి. ఈ విస్తృత మరియు విశాలమైన రసాయనిక ప్రక్రియ యొక్క 90% భాగం అతిసూక్ష్మమైన నాచు వంటి మొక్కల ద్వారా సముద్రం లోతులలో జరుగుతుంది. దీనిలోని 10% భాగం మాత్రమే భూమి పైతలం మీద ఉన్న మొక్కలద్వారా లభిస్తున్నది. లభించిన పదార్థములలో అధికభాగము దాని అవసరాలకు వాడుకుంటుంది. దీనిలో అత్యంత సూక్ష్మమైన భాగంతో అన్య జీవజంతువులు తమ జీవనయాత్రను నిర్వహించుకుంటున్నాయి. ఆకుపచ్చని మొక్కల క్లోరోఫిల్ నుండి ఫోటాన్ అవశోషణ తర్వాత ప్రేరితమైన ఎలక్ట్రానుల శక్తి కొన్ని వోల్టుల వరకు పెరుగుతుంది. ఆక్సీకరణ జరుగు ఈ కాలఅవధి ఒక సెకెండులోని 100 కోట్ల వంతు కంటే కూడా తక్కువ ఉంటుంది. మన ఆలోచనల కంటే కూడా అత్యంత వేగంగా ఉంటుంది ఈ సమయం.

మొక్కలకు పలు సామర్థ్యములున్నవి. శాస్త్రవేత్తలు వీటిని సద్వినియోగపరచి సోలార్‌సెల్‌ను నిర్మించారు. దీనికిగాను పాలకూరను వినియోగించారు. ఎందుకంటే దీని ఆకులలో క్లోరోఫిల్ అధికంగా ఉంటుంది. శాస్త్రవేత్తలు కాంతి సంగ్రహణ ద్వారా ఉత్పన్నమైన 'ప్రోటీన్ కాంప్లెక్స్'నకు 'ఫోటోసిస్టమ్–1' అని పేరుపెట్టారు. ఇది అత్యంత సూక్ష్మంగా ఉంటుంది. దీని సూక్ష్మతను ఒక లక్ష ఫొటోసిస్టమ్‌లను ఒక ముల్లు యొక్క అంచుల మీద కదలిక ఆధారంగా అంచనా వేయవచ్చును. ఇదే ఇప్పటివరకు తెలిసిన ఎలక్ట్రానిక్ సర్క్యూట్‌లలో అన్నింటికంటే సూక్ష్మమైన సర్క్యూట్.

మానవ శరీరంలో సుమారు 80,000 ప్రోటీన్లు ఉంటాయి. ఇవన్నీ వేరు వేరు అవయవాల కోశికలలో వేరు వేరు పనులు చేస్తాయి. ఈ ప్రోటీనులు తమ స్వరూపమును కోల్పోయినప్పుడు వాటిని పెప్టైడ్స్ అని పిలుస్తారు. ఈ పెప్టైడ్స్ పలుచని పొరవలె తయారై ప్రోటీనులను రక్షిస్తాయి. ఈ కారణంగానే విత్తనం తన సక్రియతను కాపాడుకుంటూ ఉంటుంది. నువ్వుల విత్తనాలు తమ లోపలి నూనెను తేమలేని వాతావరణంలో రక్షించుకుంటాయి. ఈ ప్రక్రియలో ఉత్పన్నమైన విద్యుత్తు సుమారు 12% ఉంటుంది. శాస్త్రవేత్తలు ఈ సామర్థ్యమును 20% వరకు పెంచాలని యోచిస్తున్నారు. భవిష్యత్తులో ల్యాప్‌ట్యాప్‌లు, సెల్‌ఫోన్‌లు ఈ సూక్ష్మమైన బ్యాటరీశక్తితోనే పనిచేసే అవకాశమున్నది. ఈ పరిశోధన మనకు మరియు మొక్కలకు మధ్యగల అనుబంధాన్ని మరింత పటిష్ఠం చేయగలదు.

వృక్షములు, మొక్కలు ప్రకృతి యొక్క అభిన్న సహచరులు. వాతావరణం, దాని పరిధి నిర్మాణంలో వీటి పాత్ర చెప్పుకోతగినది. ఇవి మానవజాతి మేలుకొరకు పలు రూపాలలో తమ సహకారమును అందిస్తున్నాయి. ఇవి ఇప్పుడు విద్యుత్తును ఉత్పత్తి చేసి నూతనరూపంలో మానవజాతి సేవకు ఆతురత చూపిస్తున్నాయి. కనుక వృక్షముల, మొక్కల యొక్క సముచితమైన సంరక్షణ వికాసమునకు కటిబద్ధులం కావల్సిన బాధ్యత మనందరిమీదా ఉన్నది. ఎందుకంటే వీటి వికాసంలోనే మన ప్రగతి, ఉన్నతుల యొక్క మార్గం భవ్యంగా సాగుతుంది. మనం తిరిగి మొక్కలు, వృక్షములను మన మిత్రులుగా భావించి వీటితో భావనాత్మకమైన సంబంధమును స్థాపించుకొనవలసి ఉన్నది. ఈ స్నేహబంధసూత్రంలోనే సంపూర్ణమానవజాతి వికాసం, పృథ్వి యొక్క ఉజ్జ్వల భవిష్యత్తు ఆధారపడి ఉన్నాయి.

*– అఖండజ్యోతి, మే 2005*

*అనువాదం: శ్రీమతి లక్ష్మీరాజగోపాలు*

## దురాశ

*ఒక వ్యక్తి వద్దనున్న కోడి ప్రతిరోజు ఒక బంగారు గుడ్డు పెట్టేది. ఆ గ్రుడ్డును అమ్మి అతడు ఆనందంగా జీవించేవాడు. ఒకనాడు అతడు దురాశతో దాని పొట్టను చీల్చి లోపలున్న గ్రుడ్లన్నిటిని తీసికొని ఒకేసారి కోటీశ్వరుడు కావాలని ప్రయత్నిస్తాడు. కానీ ఆ ప్రయత్నం విఫలమై రోజు పెట్టే గ్రుడ్డు కూడా కరువై దుఃఖించవలసిన పరిస్థితి ఏర్పడింది.* ***దురాశ ఎప్పుడూ దుఃఖానికి హేతువు.***

*– ప్రజ్ఞాపురాణం నుండి*

**కష్టాలను శత్రువులుగా భావించకూడదు**

స్వప్న జగత్తు

# కలల ప్రపంచ రహస్యం

కలల ప్రపంచములో జీవితంలోని అన్నివైపుల నుండి విచిత్రమైన, అద్భుతమైన దృశ్యాలు కనపడుతుంటాయి. మన కోరికలననుసరించి రంగురంగుల రేఖాచిత్రాలను చూపించే కలల ప్రపంచము ఎంతో విచిత్రమైనది. పండితులు దీనిని తమదైన శైలిలో నిర్వచించారు. దీనిని మనస్తత్వ శాస్త్రజ్ఞులు 'అస్తవ్యస్తమైన' అచేతనత్వము యొక్క మానసిక 'లీల' గా భావిస్తుంటారు. కొందరు దీనిని మనోవైజ్ఞానిక సమస్యగా భావిస్తే మరికొందరు 'మనస్సులోని అణచిపెట్టబడిన ఆలోచనల పరిణామం' గా ప్రతిపాదించారు. ఆధ్యాత్మికవేత్తలు భగవంతుని సందేశము కలల రూపంలో ప్రతిబింబిస్తుంది' అని నమ్ముతారు. ఇక శాస్త్రవేత్తలు కలలను జీవరసాయనిక క్రియలకు సంబంధించినదిగా దర్శిస్తుంటారు.

సాధారణంగా కలలను జాగ్రదావస్థ యొక్క స్మృతిగా భావించవచ్చు. ఈ స్థితిలో ఇంద్రియాలకు బాహ్యజగత్తుతో సంబంధము తెగిపోతుంది. పతంజలి యోగ సూత్రాలను అనుసరించి స్వప్నము అనేది ఒక వృత్తి. ఇందులో చేతన మనస్సు నిద్రిస్తుంది. అచేతన మనస్సు క్రియాశీలతను పొందుతుంది. ఈవిధంగా చూస్తే కల కూడా ఒక మానసిక రచనయే! జాగ్రదావస్థలో అనుభవించిన విషయములే జ్ఞాపకం ఉంటాయి. కానీ స్వప్నంలో ఇవి కల్పితమవుతాయి. అందుచేత వీటి స్మృతి కల్పించబడిన విషయాల యొక్క స్మృతి అవుతుంది. దీనినే 'స్మృతి యొక్క స్మృతి' అంటారు. గుర్తుపెట్టుకొనగలిగిన జ్ఞానమనేది ఇక్కడ ఉండదు. అందుచేతనే కలను ఊహించబడిన గుర్తుంచుకోదగిన జ్ఞాపకంగా చెప్తుంటారు.

బృహదారణ్యకోపనిషత్తును అనుసరించి కలలలో జ్ఞానేంద్రియముల యొక్క పనులు ఆగిపోతాయి. అయితే సూక్ష్మ ఇంద్రియాల ద్వారా సూక్ష్మ విషయాలు అనుభవమవుతుంటాయి. అంతేకాదు ఈ సుఖదుఃఖాల అనుభవంతో సుఖము లేదా దుఃఖము గురించిన జ్ఞానం కూడా కలుగుతుంది. ఈ స్థితి ఆత్మకు సంబంధించిన స్థితి కాదు. ఇది సూక్ష్మశరీరమునకు సంబంధించిన క్రియాకలాపం అని చెప్పవచ్చు. ఆత్మ ద్రష్టవలె వీనిని చూస్తూ ఉంటుంది. మానవుడు బాగా అలసిపోయి నిద్రించినప్పుడు ఈ దృశ్య ప్రపంచంతో అతని సంబంధము తెగిపోతుంది. ఆ తరువాత అతడు విలక్షణమైన, ఆశ్చర్యకరమైన కలల ప్రపంచములోనికి అడుగిడతాడు. ఇందులో స్థూల శరీరము యొక్క పాత్ర ఏమీ ఉండదు. కలల ప్రపంచంలో సూచనలు, ప్రత్యయాలే ఉంటాయి అని మనోవైజ్ఞానికులు భావిస్తారు. ఈ స్థితిలో దేశ, కాలపరిస్థితులు కూడా జాగ్రదావస్థలో కన్నా భిన్నంగా ఉంటాయి. ఇవి స్వప్నావస్థలో అతి వేగంగా మారిపోతుంటాయి. చాలా స్వల్ప వ్యవధిలోనే పెద్ద పెద్ద సంఘటనలు జరుగుతాయి. కలలు కంటున్నప్పుడు మనుష్యులు, విషయాలు వాటికి సంబంధించిన అంశాలు ఎంతో వేగంగా మారిపోతూ ఉంటాయి. అందుచేత కల కంటున్నప్పుడు సూక్ష్మ శరీరమే పాల్గొంటుంది అని చెప్పవచ్చు.

బృహదారణ్యకోపనిషత్తు స్వప్నాన్ని మిధ్యగా నిర్వచించినది. లేని వస్తువును కూడా మనస్సు దానికి నచ్చిన రీతిలో అక్కడున్నట్లుగా భావిస్తుంది. బ్రహ్మ సూత్రాలలో కలలను మాయగా అభివర్ణించటం జరిగింది. 'సంస్కారమాత్రం చేత బుద్ధి పలు రకాలైన విషయముల యొక్క ఆకారములను ధరించటం వల్ల కలిగే ఫలితమే స్వప్నము' అని సాంఖ్య, అద్వైత వేదాంతులు నిర్వచించారు. ఎక్కువ మంది వేదాంతులు స్వప్నాన్ని మిధ్యగానే అభిప్రాయపడుతుంటారు. ఐతే వేదాంతులు దీనిని భ్రమ, అసత్యం' అని మాత్రం చెప్పటం లేదు. శ్రీ ఆదిశంకరాచార్యులు కూడా స్వప్నంలో ఏనుగు నెక్కడం, గుఱ్ఱము నెక్కటం వంటివి అశుభంగా భావించేవారు. ఛాందగ్యోపనిషత్తు కూడా స్వప్నాలను శుభ, అశుభ కర్మల తాలుకు చిహ్నాలుగా అంగీకరించినది.

యోగవాశిష్టంలో స్వప్నాలను గురించి చక్కని వివరణ కూడా లభిస్తుంది. 'సుషుప్తావస్థలో ప్రాణముల వల్ల క్షుబ్ధమైన మనస్సు, చిత్తము యొక్క ఆకారమును ధరిస్తుంది. అప్పుడు స్వప్నాలు కలుగుతాయి' అని యోగవాశిష్ఠములో ప్రతిపాదించబడినది. చిన్న విత్తనం లోపల మహావృక్షం యొక్క ఆకారం దాగి ఉన్న విధంగా జీవుడు కూడా తన లోపల ఈ యావత్ ప్రపంచము యొక్క విరాట్ స్వరూపమును విస్తృతమైన రూపంలో అనుభవం చెందుతుంటాడు. ఈ స్థితిలో జీవుడు తన కోరికలకనుగుణమైన కలలను దర్శిస్తుంటాడు. వాయుతత్త్వము ప్రధానంగా కలిగిన

**అనుభవం వల్ల మనిషి రాటుదేలుతాడు**

వ్యక్తి ఆకాశంలో ఎగురుతున్నట్లు కలగంటే, జలతత్త్వము ప్రధానంగా కలిగిన వ్యక్తి నీటికి సంబంధించిన కలలను, పిత్త ప్రధానంగా కల వ్యక్తి అగ్నికి సంబంధించిన కలలను కంటుంటాడు. బాహ్యమైన ఇంద్రియములతో పనిలేకుండా లోపల జరిగే ప్రతిక్రియల ఫలితంగా కలిగే జ్ఞానమే స్వప్నము' అని కూడా యోగవాశిష్ఠంలో వివరించబడినది.

పురాణాలలో కూడా స్వప్నాలకు సంబంధించిన వ్యాఖ్యానం మనకు లభిస్తుంది. వాటిని అనుసరించి 'భగవంతుని ఇచ్ఛతో జీవునకు తన మనోగత సంస్కారములను చూడగలిగే సందర్భము కలుగుతుంది, అదియే స్వప్నము' అని చెప్పటం జరిగింది. సుషుప్తావస్థలో అంటే మనం గాఢనిద్రలో ఉన్నప్పుడు శరీర తత్త్వములన్నీ వినీలమవుతాయిని, అలా వినీలమయిన తత్త్వాలకు సంబంధించిన అనుభూతులే కలలు అని తంత్ర శాస్త్రం అభిప్రాయ పడుతున్నది. గాఢ నిద్రాస్థితిలో కలలు రావు అని ఆయుర్వేద గ్రంథాలు చెబుతున్నాయి. ఈ స్థితిలో జ్ఞాపకం అనేది ఉండదు.

కలలు విషయకల్పనల (కోరికలకు సంబంధించిన ఊహలు) మీద ఆధారపడి ఏర్పడుతుంటాయని పండితుల అభిప్రాయం. సాధారణంగా జ్ఞాపకశక్తి ఈ కల్పనల జ్ఞానాన్ని గ్రహించలేదు. కలలు ఎక్కువగా చిత్తానికి సంబంధించి ఉంటాయి. చిత్తమునకు మూడు గుణాలు ఉంటాయి. అందుచేతనే కలలు కూడా సాత్విక, రాజసిక, తామసికమనే విధాలుగా ఉంటాయి. సాత్విక స్వప్నాలు సర్వోత్కృష్టమైనవి. ఇవి సత్వతత్వ ప్రధానమైనవి. సత్వగుణ ప్రధానులైన వ్యక్తులకే ఈ సాత్విక స్వప్నాలు వస్తుంటాయి. ఈ స్వప్నస్థితిలో జరగబోయే సంఘటనలు భగవత్ సందేశంవలె లభిస్తుంటాయి. రాజసిక స్వప్నాలు రజోగుణ ప్రధానమైనవి. తామసిక కలలలో విషయం క్షణికంగా మాత్రమే ఉంటుంది కాబట్టి నిద్ర నుండి మేల్కొన్న తరువాత స్వప్నంలో చూసిన విషయములు సామాన్యంగా గుర్తుండవు. స్వప్నంలోని విషయములు వాస్తవంగాను, అవాస్తవంగాను కూడా కనిపించవచ్చు.

పాశ్చాత్యదేశపు మనోవైజ్ఞానికులు తమదైన రీతిలో స్వప్నాలను సిద్ధాంతీకరించారు. 'మెలకువగా ఉన్నప్పుడు మనం మన మనస్సులోనే ఏయే కోర్కెలను, వాంఛలను కార్యరూపంలోకి తేవటానికి సంకోచిస్తూ భయపడుతుంటామో, అవే రాత్రివేళ ఏకాంతస్థితిలో కలల రూపంలో మనకు దృష్టిగోచరమవుతాయి' అని ప్రఖ్యాత మనస్తత్త్వ శాస్త్రవేత్త ఫ్రాయిడ్ కలల గురించి నిర్వచించారు. మనం నిద్ర నుండి మేల్కొనగానే స్వప్నం మరపులోకి జారిపోతుంది. ఎందుకంటే మెలకువగా ఉన్నప్పుడు మనకున్న భయమే వాటిని నిద్రలో కూడా వెనుకకు నెట్టివేస్తుంటుంది. స్వప్నమనేది ఒక మనోవిశ్లేషణకు సంబంధించిన అంశము, దీనికి ఒక వైజ్ఞానిక చరిత్ర ఉన్నది అని స్వయంగా ఫ్రాయిడ్ అంగీకరించారు. డా॥ జుంగ్ అను వైద్యుడు తాను వ్రాసిన 'సైకాలజీ ఆఫ్ ద అన్‌కాన్షస్' అనే పరిశోధనా గ్రంథంలో ఫ్రాయిడ్ యొక్క ఆలోచనలను తర్క పూర్ణమైన రూపంలో ఖండించారు. మానవుని మనస్సులోని ఆలోచనలన్నీ కామవాసనలతోనే సంబంధం కలిగి ఉంటాయని ఫ్రాయిడ్ అభిప్రాయము. ఐతే జుంగ్ దీనిని వ్యతిరేకిస్తూ మానవునికి కామప్రేరణ కన్నా, అతని వాస్తవికమైన ఇచ్ఛ (కోరిక)యే ఎక్కువగా ఉంటుంది అని నిరూపించాడు. అందులో సామాజిక, ధార్మిక, నిర్మాణాత్మకమైన ప్రవృత్తులు కూడా మిళితమై ఉంటాయి.

తీరని కోరికలు లేదా సంతృప్తి చెందని వాసనలు కలల్లో కనిపిస్తాయని ఫ్రాయిడ్ అభిప్రాయము. కల వర్తమాన పరిస్థితులకు వ్యంగ్యచిత్రం వంటిది అని, అది ఏదో ఒక ఉదాహరణ ద్వారా ఒక ఖచ్చితమైన సత్యాన్ని తెలియజేస్తుందని జుంగ్ భావన. ఇదే వారిద్దరి అభిప్రాయములోని తేడా. స్వప్నాలను తీరని కోరికల వరకు మాత్రమే పరిమితం చేశాడు ఫ్రాయిడ్. కానీ జుంగ్ వాటిని వర్తమాన పరిస్థితులతో జోడించి అందులో ఉన్న సందేహాన్ని వ్యాపకంగాను, విస్తృతమైనదిగాను వివరించారు. కలల ద్వారా గొప్ప గొప్ప వేదాంత సత్యాలు, సంకల్పాలు, భావి పరిస్థితి, గొప్ప గొప్ప ఆకాంక్షలు, ఇతరుల మనస్సులోని ఆలోచనలు మొదలైనవన్నీ తెలుసుకొనవచ్చు అని జుంగ్ అభిప్రాయపడ్డారు. ఇలా చూస్తే జుంగ్ ఆలోచనలు భారతీయుల ఆలోచనలకు బాగా దగ్గరగా ఉన్నాయి.

లోతైన అచేతన స్థితిలో ఉన్న మనస్సు యొక్క ప్రతీకారాత్మక క్రియల పేరే స్వప్నం అని చెప్పుకోవచ్చు. **ప్రతి ఒక్క వ్యక్తి తన కోర్కెలను భావనలను తనలోనే ఇముడ్చుకుంటాడు. ఇతరులకు తన మనస్సులోని విషయాలు తెలియకూడదని అనుకుంటాడు. అందుచేత అతని కలలు కూడా ఎప్పుడూ తెలుసుకోలేని విధంగా సూచనాత్మకంగానే ఉంటాయి.** మనుష్యుల ఆలోచనలు, ఊహలు, కోర్కెలు అన్నీ వేర్వేరుగా ఉంటాయి. అందుచేత కలలు కూడా మనిషిని బట్టి వివిధ రకాలుగా ఉంటాయి.

అంతరంగపు లోతుల లోపల కళాత్మక భావన స్వప్నంలో మేల్కొంటుంది. అందుచేత స్వప్నమనేది అంతరంగం స్వయంగా

**ఇతరుల అనుభవాల నుండి కూడా నేర్చుకోవచ్చు**

తయారుచేసుకున్న కవిత లాంటిది అని ప్రసిద్ధ దార్శనికుడు కాంట్ నిర్వచించాడు. దాంతే అనే ప్రసిద్ధ కవి తాను చూసిన స్వప్నాలన్నింటిని కవితలుగా వ్రాస్తూ ఉండేవారట. సాల్ట్ థెరపీకి పితామహుడైన కిట్జ్ పర్ల్స్ మన సామర్థ్యం ఎంత? మనం ఏమి చేస్తున్నాము? అనే విషయమై కలలు మనకు స్పష్టమైన సంకేతాలను అందిస్తాయి అని అంటారు. 'కలలు మస్తిష్కంలో ఉన్న తథ్యాల యొక్క సచేతన కేంద్రం యొక్క స్థానమును పరివర్తన చేస్తాయి' అని న్యూ ఎండ్ మరు మరియు కార్ల్ కేంస్టనెగ్ అనే పండితులు వర్ణించారు. కొంతమంది పండితులు దీనిని ప్రమాణంగా స్వీకరించారు. ఎందుకంటే జాగ్రదావస్థలో మస్తిష్కం యొక్క సంకలన కేంద్రం స్థిరంగా ఉంటుంది. స్వప్నాలలో అయితే ఈ కేంద్ర స్థానం మారుతూ ఉంటుంది. ఈ మార్పు ఎంత ఎక్కువగా ఉంటే కలలు కూడా అన్ని విధాలుగా మారుతూ ఉంటాయి.

రెండవ శతాబ్దంలో రోమ్‌కి చెందిన ఆర్తినికోరస్ 'ఆనా ఇఆరోటికా' అనే పుస్తకంలో మూడు వేల స్వప్నాలను గురించిన విశ్లేషణ చేశారు. ఆయన కలలను సామాన్యమైనవి, ప్రతీకారాత్మకమైనవి అని రెండువిధాలుగా విభజించారు. స్వప్నాలలోని అర్థం తల్లక్రిందులుగా ఉంటుందని కూడా ఆయన భావించారు. ఏది ఏమైనా కలల భాష చాలా సూచనాత్మకంగాను, రహస్యమయంగాను ఉంటుంది అని ఆయన అభిప్రాయము.

కలలు కనడం మానవుల ఆరోగ్యానికి మంచిది. ఈ విషయమై ఆధునిక స్వప్న విశ్లేషకురాలు అంజలి హజారికా అను వైద్యురాలు ఇలా అన్నది. 'మానవునికి కలలు అనేవే రాకపోతే అతడు ఆందోళన చెందినప్పుడు పిచ్చివాడయ్యే ప్రమాదం కూడా ఉంటుంది'. ఒక్కొక్కసారి కలలు మనకు మార్గదర్శనాన్ని కూడా చేస్తుంటాయి. ఈ నేపథ్యంలో మధుటండన్ అనే స్వప్న విశ్లేషకులు కలలు సలహాలనిచ్చేవిగా, నిర్దేశించేవిగా, విమర్శించేవిగా ఉంటాయి అని అభిప్రాయపడుతున్నారు. కలలు సమస్యలను ఎత్తిచూపిస్తాయి అని జితేంద్రనాగపాల్‌గారి భావన.

ఈ విధంగా చూస్తే కలలను గురించిన మనోవైజ్ఞానిక వ్యాఖ్యానం ఫ్రాయిడ్ నుండే ప్రారంభమైనది అని మనం అర్థం చేసుకోవచ్చు. ఆ వ్యాఖ్యానం సంపూర్ణంగా సమర్థవంతమైనదిగా లేకపోయినప్పటికి అది మనకు ఒక వరంగా మటుకు భావించ వచ్చు. ఎందుకంటే అచేతన మనస్సును గురించిన అవగాహన అనేది ఇక్కడి నుండే ప్రారంభమైనది. అచేతన మనస్సు అనే అంశం లేకుండా స్వప్నాలను గురించి వైజ్ఞానికంగా సరియైన వ్యాఖ్యానం చెప్పటం సాధ్యం కాదు. పాశ్చాత్య మనోవైజ్ఞానికులకు మనస్సు యొక్క సూక్ష్మమైన లోతులను గురించి అవగాహన లేదు. అందుచేతనే వారి ప్రయోగాలన్ని సంపూర్ణత్వాన్ని సాధించలేక పోయినవి. అయినప్పటికి వారు పరిశోధించిన దాని సహాయంతో మనం కలలను గురించి ఇంకొంచెం ముందుకెళ్ళి తప్పకుండా పరిశోధనలు చెయ్యగలము. మన ప్రాచీనకాలపు ఋషులు అంతర్ దృష్టితో మనస్సును ఛేదించారు, కలలను గురించి సముచితమైన వ్యాఖ్యానాలను చేశారు. కానీ వైదిక ఋషుల చేత అనుభూతి చెందిన సిద్ధాంతాలను, పాశ్చాత్యదేశపు మనో వైజ్ఞానికుల ప్రయోగాల ద్వారా మరింత విస్తృతంగా పరిశీలించి పరిశోధించ వలసిన అవసరం ఈనాడు ఎంతైనా ఉన్నది.

*– అఖండజ్యోతి, ఆగస్టు 2001*

*అనువాదం: శ్రీమతి కృష్ణకుమారి*

## హజరత్ నిజాముద్దీన్

*ఢిల్లీలో హజరత్ నిజాముద్దీన్ అనే ఒక మహాత్ముండేవాడు. ఈయన సదా భగవంతుని గీతాలను ఆలపిస్తూ అనేక మందితో పాడిస్తూ, దైవస్మరణలో నిమగ్నమై ఉండేవాడు. ఢిల్లీ పాదుషా ఈ భజనలు, పాటలు వంటి వెర్రి మొర్రి వేషాలను ఆపివేయమని ఆజ్ఞాపిస్తాడు. కానీ మహాత్ముడు అంగీకరించకపోవటంతో పాదుషా వెంటనే అతనిని దండించక బాధించాలని నిర్ణయించుకొంటాడు. మహాత్ముడు కూలీలతో, భక్తులకోసం త్రవ్వించే చెరువును మధ్యలో ఆపివేయించి ఆ కూలీలలను తన కోటలో పని చేయమని ఆదేశిస్తాడు. పగలంతా పాదుషా కోటలో పనిచేసిన కూలీలు రాత్రిపూట నూనె దీపాల వెలుగులో మహాత్ముని పనిచేయ సాగారు. పాదుషా వారికి నూనె అమ్మవద్దని వర్తకులను ఆదేశించగా మహాత్ముడు నీళ్ళుపోసి దీపాలు వెలిగించి, పనిచేయనారంభించాడు. చెరువు త్రవ్వటం పూర్తి అయ్యేవరకు మహాత్ముడు వెలిగించిన దీపాలు ఆరిపోక అఖండంగా వెలుగుతూనే ఉన్నాయి. అప్పటి నుండి ఢిల్లీలోని ఆ చెరువుని, ఆ ప్రాంతాన్ని చిరాగ్ నిజాముద్దీన్ అని పిలవసాగారు. ధర్మ మార్గంలో పయనించేవారిని ఎవరు ఏమి చేయలేరు. సాక్షాత్తు పరమాత్ముని శక్తే వారిని వెన్నంటుతూ ఉండి సర్వకాల సర్వావస్థలయందు వారికి సహకరిస్తుంది. ధర్మాన్ని ఉపేక్షించేవారు నిర్లక్ష్యం చేసేవారు మాత్రం ఏదో ఒకనాడు ఘోరంగా ఓడిపోక తప్పదు.*

– ప్రజ్ఞాపురాణం నుండి

**మనిషన్నాక కష్టం సుఖం రెండూ ఉంటాయి**

# ఎందువల్ల త్వరగా చనిపోతారు?

మానవుడు పుట్టినప్పటి నుండే మృత్యువుతో పోరాడుతూనే ఉంటాడు. పెద్దలు మృత్యువు తలపైన నాట్యం చేస్తూ ఉంటుందని అంటారు. మనం జీవించే ఉండటానికి ఈ శత్రువుతో రకరకాలుగా పోరు సలపవలసి ఉంటుంది. మనం ఆరోగ్యంగా ఉండటానికి ఎన్నో ప్రయత్నాలు చేయటమే గాక ఇంకా వైద్యశాస్త్రం, మనోవిజ్ఞాన శాస్త్రం వంటి ఎన్నింటినో కనిపెట్టి, మృత్యువు నుండి రక్షించుకొనటానికి ప్రయత్నిస్తుంటాము. ఏ రోజు మానవుడు ఆ శత్రువు మీద ఈ ఆయుధాలను ప్రయోగించుట పొరపాటున మరచిననాడు అపజయం పాలవుతాడు. ఈ పరాజయాన్నే మృత్యువు అంటారు.

రెండవ ప్రపంచ యుద్ధం జరిగే రోజులలో జర్మన్ దేశపు గూఢాచారులు ఇతర దేశపు రహస్యలను తెలుసుకొనుటకు ఫిఫ్త్ కాలం ఉపయోగించేవారని సర్వత్రా పెద్దచర్చ జరుగుతుండేది. వీరు గుప్తరూపంలో ఉండి, సామాన్య మనుషులతో కలిసిపోయి తమ నాయకునికి పని పూర్తిచేస్తూ ఉండేవారని అనుకొనేవారు. వీరు తమని ఎవరు గుర్తించనంతగా మారు వేషాలతో తిరుగుతూ గుట్టుచప్పుడు కాకుండా అన్ని రహస్యాలను క్షుణ్ణంగా తెలుసుకొని తమ నాయకుడైన జనరల్ హిట్లర్‌కి అందిస్తూ ఉండేవారని చెప్పుకునేవారు. హిట్లర్‌లాగనే మృత్యువు కూడా వికటరూపం ధరించిన గూఢాచారిగా మన శరీరంలో దాగి ఉండి తమ యజమాని పని పూర్తి చేస్తూ ఉంటుంది. దీని పేరు ఫిఫ్త్ కాలం కాక, చెడు అలవాట్లనే పేరుతో పిలవవలసి ఉంటుంది. ఇవి గప్‌చుప్‌గా మన స్వభావంలో దూరి మెల్లిగా మన మొత్తం ఆరోగ్య సంపదను చేజిక్కించుకొని మనలను తమ సేవకులుగా మార్చివేస్తాయి. మన ఇంటిలోనే ఒక విరోధి తిష్టవేసి ఉన్నప్పుడు, ఇక శత్రువుతో జరుపుతున్న యుద్ధంలో విజయం ఎలా ప్రాప్తిస్తుంది? మనం అశక్తులమై పరాజయం పాలై చనిపోతాము.

మృత్యువు యొక్క గూఢచారులలో కొన్ని (అలవాట్లు) చాలా చిన్నగా గుడ్లగూబలాగా ఛాతిని వంచుకొని మాటువేసి కూర్చొని ఉంటాయి. తలవంచుకుని నడుస్తాయి. ఈ అలవాట్లు చూడటానికి మహత్వపూర్ణమని అనిపించవు కాని, ఊపిరితిత్తుల మీద అనవసరమైన ఒత్తిడి పెంచి, మృత్యుదేవతకు ఆహ్వానం పలుకుతాయి. కొంతమంది వ్యక్తులకు గర్వంవలన కొన్ని కొన్ని విచిత్రమైన అలవాట్లుంటాయి. అలాంటి పొగరుబోతులు దారిలో నడిచేటప్పుడు పాదాలతో భూమి మీద బలంగా తన్నుతున్నట్లు, పిండి చేస్తున్నట్లు భావిస్తూ ఉంటారు. పెన్నుతోగాని, పెన్సిల్‌తోగాని వ్రాసేటప్పుడు ఎంత గట్టిగా పట్టుకుంటారంటే నాగలిని పట్టుకొన్నట్టు పట్టుకుంటారు. కుర్చీ మీద కూర్చున్నారంటే, దానికి అతుక్కుపోయినట్లుగా కూర్చుంటారు. వారు ధరించిన దుస్తులు ఎప్పుడూ పైకిలాగి బిగుతుగా ఉండి నిద్రించే సమయంలో కూడా వదులుగా ఉంచుకోరు. అసలు ఇలాంటి పనులు చేస్తున్నామనే ధ్యాసే వారికి ఉండదు. పనులన్నీ గర్వంతో పొగరుతో చేయడం వలన ఎంతో అలసిపోతూ ఉంటారు. ఎందువల్ల అనగా మామూలుగా పనిచేయటానికి ఉపయోగించే శక్తి కన్నా 10 రెట్ల శక్తిని వారు ఈ విధంగా నష్టపరచుకొన్నందున తొందరగా అలసట పొందుతారు. ఇంకొంత మందికి రకరకాలుగా పరుగులు తీయటం, తొందరపాటుతనం, ఎగరటం, దూకటంలాంటి అలవాట్లు ఉంటాయి. వారి యువరక్తం అనవసరమైన, ఉపయోగపడని పనులతో వ్యర్థమవుతుంది. ఇంకొంతమంది అతిగా మాట్లాడుట, అనవసర ప్రసంగాలు చేయుట, పెద్దగా గప్పాలు కొడుతూ, అతిగా తినటం, అవసరం లేకపోయినా చేతులు ఊపడం వలన శరీరంలో ఉష్ణం ఎక్కువైపోయి రక్తాన్ని ఎండిపోయేటట్లు చేస్తుంది. దీనితో చాలా శక్తి వృథా అయి మనిషి నీరసించిపోతూ ఉంటాడు. అలాగాక తమ ప్రవర్తనలను మంచిగా మార్చుకొని దైనందిన కార్యక్రమాలను క్రమశిక్షణతో జరుపుకొంటూ, నిదానంగా నడవటం, కూర్చొనటం, లేవటం వంటి మంచి అలవాట్లను అభ్యాసంతో చేయగలిగితే, దీర్ఘకాలం జీవించుటకు అవకాశం ఉంటుంది.

ప్రఖ్యాత డాక్టర్ అవనేంద్ర కథనం ప్రకారం చాలామంది ఎక్కువ ఆహారాన్ని పొట్టలో గబగబ తింటారని, కుక్కుకుంటారని అలా తిన్న ఆహారం 1/4వ వంతు మాత్రమే జీర్ణమవుతుందని, మిగిలిన భాగం అరగక కడుపులోనే ఉండి పోతుందని, దానితో వ్యాధులొస్తాయని చెప్తున్నారు. కడుపులోని ఆహారాన్ని జీర్ణింప చేయటానికి జీర్ణరసాలు శారీరక ఆవశ్యకతను సారమైనంతవరకే స్రవిస్తాయి. కాలేయం, జఠర రసగ్రంథులు ఇంకా ఎక్కువగా స్రవించే పని చేయజాలవు. అందువల్లనే అపక్వ ఆహారం పొట్టలో ఉండిపోతుంది. దానితో జీవన సమతూకంలో మార్పు వస్తుంది. నిజమైన ఆకలి కడుపు ఖాళీ అయిన తరువాత పుడుతుంది. మలంతో పొట్ట భారంగా ఉన్నప్పుడు కూడా ఆకలి వేసిందంటే, కారణం ప్రేగులలో ఉన్న అతి అగ్నివల్లనే అనుకోవాలి. అది కూడా నిజమైన ఆకలిలాగానే అనిపిస్తుంది కానీ, అది సరికాదు.

ఊపిరితిత్తులు రక్తాన్ని శుభ్రపరుస్తాయి. ప్రాణవాయువు

**మంచి తనం వేరు చాతకాని తనం వేరు**

వీటిలోనికి ప్రవేశించినప్పుడు, దాదాపు 16వందల ఘనపు టడుగుల వైశాల్యంతో కూడిన 'మైల'ను శుభ్రపరచబడి, కార్బన్‌డై ఆక్సైడ్‌గా మారి బయటకు వస్తుంది. శరీరంలో తయారయ్యే విషాలలో 3/4 వంతు ఊపిరితిత్తుల ద్వారా బయటకు పోతాయి. ఇంతగా మేలుచేసే 'యంత్రాన్ని' మనుషులు పొగ త్రాగి పాడుచేసుకుంటున్నారు. పొగాకు పొగవల్ల ఊపిరితిత్తులలో మైలపేరుకొనిపోయి రక్తంలోని విష వాయువులు బయటకు పోవు, స్వచ్ఛమైన ప్రాణవాయువులోనికి పూర్తిగా రావటానికి అవరోధమై పోయినందున ఆరోగ్యం చెడిపోతుంది. పొగపీల్చే వ్యసనం కలవారు తమ రక్తాన్ని విషమయం చేసుకొని తమ ఆయువును నష్టపరచుకొంటున్నారు. టీ, కాఫీ, మద్యం, నల్లమందు, గంజాయి వంటి నిషా పదార్థాలు సేవించుటలో వాటి ప్రభావం నాడీమండలం మీద అత్యంత ప్రమాదకరమైన ప్రభావం చూపుతాయి. క్షణిక ఉత్తేజం వలన మనుషులు తమ జీవన రసాన్ని పాడుచేసుకొంటున్నారు.

నిద్రలేమి కూడా మృత్యుదేవతకొక గుప్తచారే! నిద్రించే సమయంలో గుండె మీద చెయ్యిగాని లేక ఏదైనా బరువైన వస్తువు గాని ఉంటే, గుండె మీద భారం పడి శ్వాస తీసుకోవడంలో ఒత్తిడి ఏర్పడి నరాల మీద ప్రభావం చూపుతుంది. దానితో సగం జాగ్రదావస్థలో ఏదో 'భూతం' ఛాతీమీద కూర్చున్నట్లు భయం కలుగుతుంది. **రాత్రి భోజనం ఎక్కువగా తిన్న తరువాత వెంటనే నిద్రకు ఉపక్రమిస్తే శ్వాసగతికి అవరోధం ఏర్పడి జీర్ణక్రియ అధిక శ్రమకులోనయిపోయి తిన్న ఆహారం సరిగ్గా జీర్ణం కాదు.** 'విశ్రాంతి-శ్రమ' రెండు క్రియలు ఒకేసారి జరుగుట సంభవం కాదు. కడుపులో వేగంగా జీర్ణక్రియ జరిగే సమయంలో నాడులు, కండరాలకు విశ్రాంతి ఎలా లభిస్తుంది? అందువల్ల గాఢ నిద్రరాదు. అలా నిద్రరానందున పూర్తి విశ్రాంతి లభించక అలసట దూరమవదు. అందుచేత రాత్రి సమయాలలో తేలికగా ఆహారం తీసుకొంటే శరీరం తేలికగా ఉండి మంచి నిద్రతో అలసటంతా పోయి, ఆనందం లభిస్తుంది.

చెడు ఆలోచనలు చేయుట, చెడు పనులు, చెడు మాటలు, చెడు ప్రవర్తనల మీద మన దృష్టి ఉంటే మృత్యువును ఆహ్వానించినట్లు అనుకోవాలి. ఈర్ష-ద్వేషాలు చెడు భావాలు శరీరంలో ఒక రకమైన 'దాహాన్ని' పుట్టించుటే కాక, స్వార్థం, కపట చింతనలు రక్తాన్ని విషతుల్యంగా చేస్తాయి. 'కామం- క్రోధం రక్తం మీద అధిక ఒత్తిడిని కలిగిస్తాయి. ఇలాంటి దుర్గుణాలను ఎవరైనా పోగేసుకుంటే అలాంటివారు తమ నాశనాన్ని కోరి తెచ్చుకోవటం అవుతుంది. అలాంటివారు పూర్తి జీవన కాలం జీవించక త్వరగా చనిపోతారు.

*– అఖండజ్యోతి, మే, 1941*
*అనువాదం: జి. చెన్నకేశవరావు*

## కాగ్వా యొక్క విశాల పరివారం

*జపాన్‌కు చెందిన కాగ్వా అనే ఒక బాలుడు విద్యాధ్యయనం తరువాత పీడిత మానవ సేవను తన లక్ష్యంగా పెట్టుకొన్నాడు. వెనుకబడిన, వ్యసనపరులైన, వ్యాధిగ్రస్తులైన ప్రజలు నివసించే ప్రాంతాలకు వెళ్ళి రోజంతా వారికి సేవచేస్తూ గడిపేవాడు. తన కడుపు నింపుకోవటానికి కావలసిన డబ్బుకోసం కేవలం 2 గంటలు మాత్రమే పనిచేసుకొనేవాడు. ఈయన సేవా కార్యక్రమాలు గురించిన వార్తలు దూరదూరాల వరకు వ్యాపించాయి. ఒక విద్యాధికురాలైన అమ్మాయి కాగ్వా గురించి విని ఆయనను అభిమానించి కలసి పనిచేయటానికి ముందుకు వచ్చింది. ఆ విధంగా ఇద్దరూ కలసి సమాజసేవ చేయటం కోసమే వివాహ బంధనంలో బంధించబడ్డారు కానీ వ్యక్తిగమైన కోర్కెలు, సౌఖ్యాల కోసం కాదు.*

*ఇలా ఇద్దరూ కలవటం వలన అనుకొన్నదానికి అనేక రెట్లు ఎక్కువగా సేవాకార్యక్రమాలు నిర్వహించగల్గేవారు. ఈ ఆదర్శవంతమైన జంటను చూచి అనేకమంది ఉదారులు, పరమార్థ పరాయణులు ముందుకు వచ్చి వారికి సహాయ సహకారాలను అందించసాగారు. ఈ విధంగా వారి కార్యక్షేత్రం ఎంతగానో విస్తరించింది. వీరి చిత్తశుద్ధి, నిస్వార్థ సేవలపట్ల ప్రభావితులై ప్రభుత్వం కూడ వెనుకబడిన జపాన్ ప్రజల ఉద్ధరణ కార్యక్రమాన్ని వీరికే అప్పగించింది. జపాన్ ప్రజలు కాగ్వాను అపరగాంధీగా భావించి గౌరవించేవారు.*

*వివాహమంటే అర్థం మంగళసూత్రధారణ కాదు. మంచి మిత్రులవలె పరస్పరం కలసి పయనిస్తూ ఉన్నత ఆదర్శాల కోసం, రెండు జీవితాలను ఒకటిగా చేయాలి. వాస్తవం చెప్పాలంటే ఇలాంటి వ్యక్తుల సమూహమే అసలైన కుటుంబం. కాగ్వా నూటికి నూరుపాళ్ళు ఇలాంటి వివాహాన్ని, ఇటువంటి కుటుంబాన్ని స్వీకరించి తనను తాను విశ్వమానవునిగా నిరూపించుకున్నాడు.*

*– ప్రజ్ఞాపురాణం నుండి*

**మన మంచితనం మనని కాపాడుతుందనుకుని కూర్చొంటే పుట్టగతులుండవు**



## ఆదిశక్తి యొక్క లీలాకథలు - 30

# సాధనలో రాబోయే అవరోధాలను గుర్తించండి

ఆదిశక్తి లీలాకథలో ఆధ్యాత్మిక విద్య యొక్క నిగూఢమైన, లోతైన రహస్యములు చాలా సహజముగా ప్రకటీకరించబడి దర్శనమిస్తాయి. బోధపడని అంతులేని సత్యాలను అనేక యుగాలకు చెందిన శ్రేష్ఠతములైన దార్శనికులు, మహామహులైన ఆచార్యులు కాలానికి నిలువగలిగే తమ గ్రంథాలలో బహు కష్టముతో అసంపూర్ణముగా, సగంసగమే చెప్పగలిగారు. లీలా పురుషోత్తములైన యోగిజనుల ఆరాధ్యుడు, ఈశ్వరుడు అయిన శ్రీకృష్ణభగవానుడు తమ భగవద్గీత బోధలో ఆ రహస్యాలను ఇలా వ్యాఖ్యానించారు. కొంతమంది మహాపురుషులు దుర్లభమైన ఈ ఆత్మతత్వమును ఆశ్చర్యంగా చూస్తారు, ఇంకొంతమంది దీని తత్వమును ఆశ్చర్యముతో వర్ణిస్తారు. మరికొంతమంది దీనిని గురించి వినికూడా ఏమీ తెలుసుకోలేరు. (గీత 1/19) అటువంటి దుర్లభ, జటిల సత్యము, తత్వము ఆదిశక్తి లీలాకథలో బహు సరసంగా, రోమాంచితముగా మరియు సహజధోరణిలో వర్ణించ బడినది. మాత భగవతి లీలా ప్రసంగాల ద్వారా బహు సుగమముగా, బాగా అర్థమయ్యే రీతిలో ఈ రహస్యముల ప్రకటీకరణ జరిగింది.

అసలు అలా ఎందుకు జరుగకూడదు? తల్లిని మించిన గురువు లేరు, ఆమెను మించిన ఆచార్యులు లేరు. జన్మధాత్రి అయిన జనని కేవలము ఈ జన్మను ఇవ్వటమేకాదు, జీవించే కళను కూడా నేర్పుతుంది. జీవితములోని చిన్న చిన్న విషయాలు మొదలుకొని అతి పెద్ద రహస్యాల శిక్షణను అతి తేలికగా ఇవ్వటం మాతకు చాలా సులభమైన విషయము! ఆమె ఒక్కతియే తమ బిడ్డల అంతశ్చేతనలో సుసంస్కారాల రూపములో జీవనవిద్యా రహస్యముల బీజారోపణను గావిస్తుంది. మహామహుడైన ఆచార్యుడు సైతము క్రియాత్మక ఆలోచనల తలము మీద మాత్రమే జీవితపు లౌకిక మరియు ఆధ్యాత్మిక రహస్యాల శిక్షణ ఇవ్వగలుగుతాడు. అయితే తల్లి తన బిడ్డకు ఇవి బోధించినప్పుడు ఆమె బోధన క్రియాత్మక ఆలోచన స్థాయిలోనే కాక సంస్కారముల తలము మీద కూడా సాగుతుంది. ఇందుచేతనే తల్లి ఆదిగురువు, ఆది ఆచార్యుడు అని కొనియాడబడినది. యుగ యుగాలుగా ఈ సత్యము అనుభవములోకి వస్తూనే ఉన్నది. భవిష్యత్తులోని అనేక యుగాలలో కూడా ఇది అనుభూతిలోకి వస్తూనే ఉంటుంది.

మా మనస్సు, మా అనుభవాలను ఈ పంక్తుల ద్వారా గొప్ప భరోసాతో, అనంతమైన విశ్వాసముతో ప్రియమైన పాఠకులతో పంచుకోవాలనుకుంటోంది. తమ ఆధ్యాత్మిక జిజ్ఞాసలకు సముచితమైన సమాధానము పొందలేనివారు, ఆధ్యాత్మిక ప్రగతికొరకు ఉచిత మరియు ఆవశ్యకమైన మార్గదర్శనం కావలసినవారు లేదా 'మా అంతశ్చేతన మరియు భావచేతనలు దారితప్పి గందరగోళములో చిక్కుకున్నాయని, ఇరుక్కున్నాయని మేము భావిస్తున్నాము' అని అనుకునేవారు, వీరందరు ఎక్కడికో వెళ్ళనక్కర్లేదు. మాత ఆదిశక్తి శరణుజొచ్చితే చాలు! మహాత్ములు, ఫకీరులను వెదుకకండి! మఠాలను, ఆధ్యాత్మిక సంస్థలను వెతుకుతూ తిరుగాడకండి! మన జన్మదాత్రి అయిన తల్లికి కూడా జన్మ నిచ్చిన దివ్యమాతను కేవలము మన శరీరానికే కాదు, మన ఆత్మకు కూడా మాతయైన ఆ పరదేవతను ఆర్తితో పిలవండి చాలు! అంతేగాక గాయత్రీమంత్ర సంపుటీకరణతో శ్రీదుర్గాసప్తశతీ పారాయణ అనుష్ఠానమును ఆరంభించండి. తక్కువలో తక్కువ 1108 పారాయణలు పూర్తి చెయ్యండి. నిత్యం ఒక పారాయణ పూర్తయినా చాలు, రమారమి మూడు సంవత్సరములలో ఈ 1108 పారాయణల అనుష్ఠానము పూర్తవుతుంది. తత్ఫలితముగా లభించే ఉపలబ్ధులు, చేకూరే లాభాలు నిశ్చయముగా చమత్కార వంతమైనవి, ఆశ్చర్యకరమైనవిగా దర్శనమిస్తాయి.

ఈ పారాయణ సాధన పూర్తవుతూ అవుతూ ఉండగానే స్వప్నముల మాధ్యమంగా ఆధ్యాత్మిక జిజ్ఞాసలకు సమాధానము లభిస్తూ ఉంటుందనేది అనుభవము వల్ల చెప్తున్నాము. అంతేకాదు, స్వయముగా అంతర్‌ప్రజ్ఞ ఎంత ప్రఖరమౌతుందంటే మీ ప్రశ్నలకు తగిన సమాధానములన్నీ స్వయముగా మీ మనస్సులోనే లభిస్తాయి. ఈ పారాయణాత్మక అనుష్ఠానక్రమంలో చాలాసార్లు సూక్ష్మలోకాలకు చెందిన దివ్యశక్తిగల ఋషులతో సహజముగానే సంపర్కమేర్పడుతుంది. వారంతా సాధకుని సాధనలో కృపా పూర్వకముగా అయాచిత సహాయమును అందిస్తారు. బాహ్య పరిస్థితులలో కూడా అందమైన, సుఖవంతమైన సుయోగములు ఒనగూడుతాయి. సత్యనిష్ఠులు-తపోనిష్ఠులు-ఈశ్వరనిష్ఠులు మరియు ఆధ్యాత్మిక తపో అనుభవ సంపన్నులైన సత్పురుషుల కలయిక భాగ్యము అతి సహజరీతిలో ఏర్పడుతుంది. దీనికొరకు బయట ఎక్కడో తిరుగవలసిన పనిలేదు. దయామయియైన మాత స్వయముగా వారిని తన సంతానము దగ్గరకు పంపుతుంది,

**ఎవరి సమస్య వారికి పెద్దది**

అంతేకాకుండా అనుష్ఠాన పరులైన వ్యక్తుల అంతర్భావనలలో సత్యనిష్ఠత తొంగిచూస్తే స్వయముగా భగవతి జగన్మాతయే ప్రత్యక్ష దర్శనమిచ్చి సాధకుని సాధనకు అడ్డుపడే అవరోధాలనన్నింటిని దూరం చేస్తుంది. ఇక్కడ చెప్పబడుతున్నదానిని కేవలము కల్పనగా ప్రోక్తమని భావించవలదు. కొద్దిపాటి ప్రయత్నము చేసి స్వీయానుభవముగా మలచుకోగల ఒక దివ్యానుభూతిగా భావించండి!

గురువులందరి అనుభూతులతో కూర్చబడిన ఈ పరంపరా సంచికలో ఆదిశక్తి లీలాకథ గతభాగములో ప్రథమ చరిత్రకు చెందిన ప్రథమ అధ్యాయములోని ఆరవ మంత్ర అంతర్ రహస్యము వెలుగులోకి తీసుకురాబడినది. అక్కడ ఈవిధముగా చెప్పబడినది. 'అత్యంత బలిష్ఠులను కూడా దండించగలిగే సురథ మహారాజుకు-ఆ మ్లేచ్ఛరాజులకు మధ్య పోరుసాగింది. మ్లేచ్ఛరాజులు అల్పసంఖ్యాకులైనప్పటికి, సురథుడు వారి చేతిలో ఓటమి చవిచూశాడు. అతి బలోపేతులను సైతము శిక్షించగలిగే సమర్థత గల సురథుడు ఈవిధముగా అపజయము పాలగుట ఆశ్చర్యము కలిగించే అంశమే అయినప్పటికిని ఆశ్చర్యము కానేకాదు. ఎందుకంటే సాధకుడు ఎంత తపస్వి, ఎంత ధర్మనిష్ఠుడు అయినప్పటికి కూడా భగవతి ఆశ్రయము లేకుండా అతని సామర్థ్యము ఎల్లప్పుడు అసంపూర్ణముగాను, సగం సగంగాను, సందిగ్ధముగాను ఉంటుంది. అహంకార-మమకారాలకు సహచరులు, స్నేహితులు తక్కువగానే ఉన్నప్పటికిని వారు తపో సాధన యొక్క ప్రబల శక్తులను వినాశము గావించివేస్తారు. సురథ మహారాజు కూడా అహంకార-మమకారాల కాటుకు గురైనవాడే!

ఈ కథాసూత్రములో ఆదిశక్తి లీలాకథ తరువాతి మహా మంత్రములో గుదిగ్రుచ్చబడిన విశేషమిలా ఉంది.

**తతః స్వపురమాయాతో నిజదేశాధిపోఽభవత్ ।**
**ఆక్రాన్తః స మహాభాగస్తైస్తదా ప్రబలారిభిః ॥(1/1/17)**

**అర్థము:** అప్పుడు అతను (సురథమహారాజు) తన రాజధానికి తిరిగి వచ్చి తన దేశానికి రాజుగా మెలగుచున్నాడు. ఆ సమయములో అక్కడకూడా ఆ మహాభాగుడు అనగా సురథుడు ఆ ప్రబల శత్రువుల ద్వారా పీడించబడినాడు.

ఆదిశక్తి లీలాకథ ఈ మహిమగల మంత్రము కేవలము గొలుసుకట్టు కథమాత్రమే కాక, అంతకుమించిన ఆధ్యాత్మిక సత్యశృంఖల కూడా గత మంత్రముతో కలుపబడి ఉంది. సురథ మహారాజు కోలావిధ్వంసరాజుల చేతిలో పరాజితుడైనప్పటినుండి అతని రాజ్యసరిహద్దులు తగ్గిపోసాగాయి. శత్రువులు బలవంతులు కాసాగారు. సురథుడు దుర్బలతను పొందసాగాడు. ఇక అక్కడినుండి అతని రాజ్యవిస్తరణ ఆగిపోయింది. అతను తన రాజధానివరకే పరిమితమైపోవలసి వచ్చింది. అయితే ఇంత జరిగినా శత్రువులు శాంతించలేదు, శమించబడలేదు. శత్రువులు సురథుడిని అక్కడ కూడా చుట్టుముట్టారు.

ఈ కథామంత్ర అంతర్భావనలో ఎన్నెన్నో రహస్యముదులు చిక్కగా అల్లబడి ఉన్నాయి. ఆదిశక్తి లీలాకథలో జీవాత్మకు ప్రతీకయైన సురథమహారాజు యొక్క రాజ్యపు రాజధాని ఆత్మకు ఆవాస ప్రదేశమే అయ్యుండవచ్చుగాక! అయితే మనస్సు శరీరాల వరకు రాజ్యవిస్తరణ సాగుతుంది. ఆత్మ మోహపాశాలతో బంధించినప్పుడు అహంకారము యొక్క దంభముతో వివేకమును కోల్పోతుంది. అప్పుడు ప్రప్రథమముగా ఆహార పానీయాలలోను, వ్యవహారములోను దాని కుసంస్కారములు లేక వికృతులు కనపడుతాయి. అప్పుడు మనిషి జీవనశైలి తప్పటగులు వేస్తుంది, జీవితపు రూపకల్పన చెడిపోతుంది. తత్కారణముగా శారీరిక రోగాల రూపములో దాని ఫలితము గోచరిస్తుంది. మనస్సు శరీరాల మధ్య ఏర్పడిన అసంతులనముతోపాటే మనోవికారాలలో పొడసూపిన అభివృద్ధి వలన ఆలోచనలు, భావనల సంరచన కూడా అస్తవ్యస్తము, చెల్లాచెదురవుతుంది. మనస్సు కూడా శోక సంతాపాలతో చుట్టుముట్టబడుతుంది. మనోవికారాలు, మనోవ్యథగా మారిపోతాయి.

రోగశరీరము మరియు మనోవ్యాధి ఆవాసములో జీవించే జీవాత్మకు తన మనస్సు శరీరాల మీద ఏవిధమైన పట్టూ ఉండదు. తత్పరిణామముగా తన ఆత్మరాజ్యములోనే ముడుచుకుపోయి మనవలసి వస్తుంది. అటువంటి పరిస్థితులలో అతని ఆత్మ యొక్క శత్రువులు మరింత బలోపేతమై పెచ్చరిల్లుతారు. స్వీయ పరిస్థితిని తృణమాత్రముగానైనా పర్యవేక్షించినప్పుడు వ్యాధి గల శరీరము, రోగముగల మనస్సు ఉన్న వ్యక్తి యొక్క సంకల్ప బలము, మనోబలము క్షీణించిపోతుంటాయని తెలుసుకుంటాము. అతను రోగములు, వికారాలకు ఎదురుగా నిలబడి పోరాడే బదులు వాటి ఎదుట వివశత్వమునకు లోనౌతాడు. పైగా అతను రోగాలు మరింత పెచ్చరిల్లే పనులనే చేస్తూ ఉంటాడు. సంకల్పము, సదాచారము, సంయమములకు బదులుగా అనారోగ్య హేతువైన, అసంయమనములే అతనికి తోడవుతాయి. తెలిసో తెలియకో అతను తన శత్రువులను మరింత బలవంతులుగా చేస్తాడు. అప్పుడు ఈ ప్రబల శత్రువులు అతనిని అతని రాజ్యపు రాజధానిలో సైతము ఆక్రమణ చెయ్యటానికి ప్రయత్నిస్తారు. మహారాజు సురథుని విషయములో కూడా ఇదే జరిగింది.

ఈ ఆధ్యాత్మిక, దార్శనిక రహస్యముతోపాటు ఈ శ్లోకమంత్రము

**నువ్వు బలహీనుడవయితే నీ కష్టాన్ని దోచుకునేవాడు నీ ప్రక్కనే ఉంటాడు**

యొక్క మాంత్రిక సత్యము కూడా ఉన్నది. దీనికి తనదైన స్వీయ సాధనా విధానము ఉన్నది. అది క్రిందన ఇవ్వబడుతున్నది.

## సాధనా విధానము

**వినియోగము: ఓం అస్య శ్రీ "తతః స్వపురమాయాతో" ఇతి సప్తశతీ సప్తమ మన్త్రస్య శ్రీబ్రహ్మేఋషిః, శ్రీమహాసరస్వతీ దేవతా, హ్రీం బీజం, ఛత్రేశ్వరీశక్తిః, తారామహావిద్యా, రజోగుణః, త్వక్ జ్ఞానేన్ద్రియం, ఉద్వేగరసం, పదకర్మేన్ద్రియం, మధ్యమస్వరం, జలతత్త్వం, ప్రవృత్తి కళా, ఏం ఉత్కీలనం, గాలినీముద్రా, మమ జ్ఞాన భక్తి వైరాగ్య క్షేమస్థైర్యాయురారోగ్యాభివృద్ధ్యర్థం శ్రీఆదిశక్తి మాతా గాయత్రీ రూపేణ యోగమాయా భగవతీ శ్రీ మహాదుర్గా ప్రసాద సిద్ధ్యర్థం చ నమో-యుత ప్రణవ-వాగ్బీజ-స్వబీజ లోమ-విలోమ పుటితోక్త సప్తమ మన్త్రజపే వినియోగః ॥**

## న్యాసః

| | కరన్యాసము | షడంగన్యాసము |
|---|---|---|
| ఓం ఏం హ్రీం | అంగుష్ఠాభ్యాం నమః | హృదయాయనమః |
| నమోనమః | తర్జనీభ్యాం నమః | శిరసేస్వాహా |

**తతః స్వపురమాయాతో మధ్యమాభ్యాం నమః శిఖాయై వషట్**

**నిజదేశాధిపోఽ భవత్ అనామికాభ్యాం నమః కవచాయహుమ్**

**ఆక్రాన్తః స మహాభాగః కనిష్ఠికాభ్యాం నమః నేత్రత్రయాయ వౌషట్**

**తైస్తదా ప్రబలారిభిః కరతలకరపృష్ఠాభ్యాం నమః అస్త్రాయఫట్**

## ధ్యానం

**ఘణ్టా-శూలహలాని శఙ్ఖ-ముసలే చక్రం ధనుః సాయకమ్ ।**
**హస్తాబ్జైర్దధతీం ఘనాన్త-విలసచ్ఛీతాంశు-తుల్య-ప్రభామ్ ॥**
**గౌరీదేశ-సముద్భవాం త్రి-జగతామాధార-భూతాం మహా ।**
**పూర్వామత్ర సరస్వతీమనుభజే శుమ్భాది-దైత్యార్దినీమ్ ॥**

## మంత్రం

**ఓం ఏం హ్రీం నమః**
**తతః స్వపురమాయాతో నిజదేశాధిపోఽ భవత్।**
**ఆక్రాన్తః స మహాభాగస్తైస్తదా ప్రబలారిభిః ॥**
**నమో హ్రీం ఏం ఓం ॥ ॥ 7 ॥**

**1000 జపాత్ సిద్ధిః దశాంశ తిలఘృత హోమః ।**
**గాయత్రీ మహామంత్రజప-10,000**
**గాయత్రీ విధానేన దశాంశ హోమః ।**

గాయత్రీమహామంత్రజపం 10,000 చెయ్యాలి. గాయత్రి విధానమును అనుసరించి నువ్వులు, నెయ్యి కలిపి అందులో పదవవంతు హోమము.

10 మాలల గాయత్రి, 1 మాల సప్తశతీమంత్రము. ఈవిధంగా పదిదినములు అనుష్ఠించి, ఆ తరువాత ప్రతిఒక్క దానికి దశాంశముతో ప్రత్యేక హవనము చేయాలి.

**ఆధ్యాత్మిక ఫలశృతి:** ఆధ్యాత్మిక సాధనలో ఎదురయ్యే అవరోధములు నిరంతరము ఎలా ప్రబలమౌతాయి అనే రహస్యముల జ్ఞానం కలుగుతుంది.

**లౌకిక ఫలశృతి:** శత్రువులు బలోపేతులు అవ్వటానికి వెనుక గల కారణము తెలుస్తుంది.

గాయత్రీ మహామంత్ర సాధనతోపాటు చెయ్యబడే ఈ సప్తశతీ మంత్ర సాధనా ప్రభావము కొద్దికాలములోనే గోచరించుట ఆరంభమౌతుంది. సమ్యక్ సాధనావిధానము ఒక్కటే ఇక్కడ ఆవశ్యకమైనది, అంతే! దీని ప్రభావము చేత సాధనలో ఒక విలక్షణ అంతర్ప్రజ్ఞ వికసిస్తుంది. తద్వారా తన సాధనలో ఎదురవ్వబోయే ఉపద్రవాల వృద్ధికి గల భౌతిక, దైవిక మరియు ఆధ్యాత్మిక రహస్యములు ఏమిటి అనేది తెలుస్తుంది. దీనితోపాటు వీటి నివారణకు మరియు నాశనము చేయుటకు గల విధివిధానములు కూడా మనస్సుకు బోధపడటము ప్రారంభమౌతుంది. ప్రాపంచిక జీవితములో శత్రువుల వలన బాధపడే మనుష్యులకు వారి శత్రువుల కుట్రలు, కుతంత్రాలు కూడా విశ్వజనని కృపచేత ప్రకటీకృతమౌతూ ఉంటాయి. మాత వరదహస్తము మన మీద ఉన్నట్లయితే సమాధాన స్వరము కూడా స్వయంగా ప్రతిధ్వనిస్తుంది. సాధకుని సాధనామయ జీవనము మరియు భగవతీ కృప ఈ రెంటి కలయికయే శబ్దములను మంత్రశక్తి సామర్థ్యము గలవానిగా పరివర్తితము గావిస్తాయి.

*– అఖండజ్యోతి, జూన్ 2009*
*అనువాదం: శ్రీమతి లక్ష్మీరాజగోపాలు*


**యుగశక్తి గాయత్రి**
**మాస పత్రిక చదవండి !**
**చదివించండి !!**


మన బలహీనతలే మన శత్రువులు

## యుగనిర్మాణ యోజన - సత్సంకల్పములు

# మహాకాలుని గీత

నిష్ఠతో, తత్పరతతో గాయత్రీ పరివారం యుగనిర్మాణం కోసం ముందుకు సాగుతోంది. అందుకు బీజం ఒక సత్సంకల్పం. సంకల్పం ఆధారంగానే మన ఆలోచనలు, ప్రణాళికలు, కార్యక్రమాలు కొనసాగుతాయి. కాబట్టి దీనినే మన ధృవీకరణ పత్రంగా చెప్పుకోవచ్చు. **అందరు తమ నిత్య ఉపాసనలో భాగంగా ప్రతిరోజూ ఉదయం ఈ సత్సంకల్పాలను చదువుకోవాలి. సామూహిక కార్యక్రమాలలో ఒకరు చదివితే మిగిలినవారు వాటిని తిరిగి చెప్పాలి.**

సంకల్పానికి అపారమైన శక్తి ఉంటుంది. పరమాత్మ యొక్క సంకల్పానికి ప్రతిఫలమే ఈ విశాల బ్రహ్మాండం. 'ఏకోహం బహుస్యామ', 'ఒకటైె ఉన్న నేను అనేకమగు గాక' అన్న పరమాత్ముని సంకల్పానికి ఫలస్వరూపంగా త్రిగుణాలు, పంచ తత్త్వాలు ఏర్పడి, సంపూర్ణ ప్రపంచం రూపుదిద్దుకుంది. మానవుని సంకల్పం వల్లనే కలగాపులగం వంటి ఈ ప్రపంచానికి సువ్యవస్థిత రూపం ఏర్పడింది. ఇటువంటి కోరికే కలగకపోతే, అవసరమే అనిపించకపోతే మనిషి కూడా మిగిలిన ప్రాణి సముదాయం లాగానే మృత్యు పర్యంతం సాదా జీవితం గడుపుతూ ఉండేవాడు.

కోరికను బుద్ధి సవరించాక అది దృఢనిశ్చయంగా మారుతుంది. అప్పుడు ఆ కోరిక సంకల్పం అవుతుంది. ఏదైనా సంకల్పం మీద మనసుని కేంద్రీకరిస్తే అది నెరవేరడం చాలా సులభం. మనసుకు అపారమైన సామర్థ్యం ఉన్నది. మనోబలంతో, భావనాపూర్వకంగా కేంద్రీకృతమైన కోరికకు కావలసిన వనరులు సునాయాసంగా వాటంతటవే సమకూరుతాయి. చెడు సంకల్పాలు నెరవేరడానికి కావలసిన సాధనలు సమకూరగా లేనిది సత్సంకల్పాలు మాత్రం ఎందుకు నెరవేరవు? ఋషుల సంకల్పం వల్లనే ఈ విశాలమైన మానవజాతికి ధర్మము, సంస్కృతి అండగా, నీడగా నిలిచాయి. ప్రపంచమంతటితో సంకల్పమే ప్రచండమైన శక్తి. వైజ్ఞానిక పరిశోధనల ద్వారా లెక్కలేనన్ని ప్రాకృతిక శక్తులను జయించి, వాటిని వశపరచుకున్న కీర్తి మానవ సంకల్పానికే దక్కుతుంది. విద్య, వైద్య, శిల్పకళ, సాహిత్య, సంగీత, పరిశ్రమలు మొదలైన క్షేత్రాలలో ఈనాడు కనబడుతున్న ప్రగతికి మానవ సంకల్పమే మూలం, దీనినే ప్రత్యక్ష కల్పవృక్షం అని కూడా అనవచ్చు. దృఢ నిశ్చయంతో ఒక కోరిక నెరవేరటానికి ఆ ప్రత్యేక దిశలో కృషి చేయాలని సంకల్పిస్తే, అది జరిగే తీరుతుంది. ఇందులో ఎటువంటి సందేహం లేదు.

ఈనాడు నెలకొన్న అశాంతి, అవ్యవస్థలకు / అపవ్యవస్థలకు కారణం మనిషి చైతన్యంలో ఉన్నటువంటి దుర్గుణాలే అని ఆలోచనాపరుల అభిప్రాయం. ఇలాంటి స్థితిలో మార్పు అత్యవసరమని తెలుస్తోంది. కాని కేవలం ఆకాంక్ష ఉంటే సరిపోదు; ఒక ఖచ్చితమైన మార్గాన్ని నిర్ధారించుకోవాలి, ఆపై సంఘటితంగా అడుగులు వేస్తూ ముందుకు సాగాలి. అలా కాకపోతే మన కోరిక ఒక కల్పనగానే మిగిలిపోతుంది. ఈ మార్గానికి ఒక సునిశ్చితమైన అడుగు – **యుగనిర్మాణ సత్సంకల్పాలు.** ఈ సత్సంకల్పాలలోని భావనలు ధర్మం మరియు శాస్త్రాల ఆదర్శ పరంపరకు అనుగుణ్యంగా, సరళమైన భాషలో, సంక్షిప్త శబ్దాలుగా క్రోడీకరించబడ్డాయి. ఈ సత్సంకల్పాల భావాలను సరైన రీతిలో అర్థం చేసుకుని, నిరంతరం వాటిని మననము, చింతనము చేస్తూ, మన జీవితాన్ని వాటికి అనుగుణ్యంగా మలుచుకోవాలి. **ఈ సంకల్ప పత్రం పక్కవారికి ఉపదేశించడానికి కాక, పూర్తిగా ఆత్మ నిర్మాణానికై ఉద్దేశించబడింది.** ఇతరులకు ఏదైనా చేయమని చెప్పాలంటే దాన్ని స్వయంగా ఆచరించి చూపించడమే అన్నిటికన్నా మంచి పద్ధతి. స్వీయ నిర్మాణం (self development) యుగ నిర్మాణానికే ఒక గొప్ప అడుగుగా పరిణమించగలదు. బొట్టూ బొట్టూ కలిసే సముద్రంగా మారుతుంది. మంచి మనుష్యులు కలిస్తేనే మంచి సమాజం తయారవుతుంది. వ్యక్తి నిర్మాణం యొక్క వ్యాపక స్వరూపమే యుగ నిర్మాణంగా పరిణమిస్తుంది.

### యుగనిర్మాణ సత్సంకల్పాలు

1. మేము ఈశ్వరుని సర్వవ్యాపకునిగాను, న్యాయనిర్ణేతగా భావించి ఆయన ఆజ్ఞలను మా జీవితంలో తీర్చిదిద్దు కుంటాము.
2. శరీరాన్ని దైవమందిరంగా భావించి, ఆత్మ సంయమనం, నియమపాలన ద్వారా ఆరోగ్యాన్ని రక్షించుకుంటాము.
3. మనస్సును దురాలోచనలు, దుర్వ్యసనాల నుండి రక్షించు కొనుటకై స్వాధ్యాయ సత్సంగాలను ఏర్పాటు చేసుకుంటాము.

**కష్టాలలో ఉన్నవారికి కావలసినది దృఢ నిశ్చయం**

4. ఇంద్రియ సంయమం, అర్థ సంయమం, సమయ సంయమం మరియు ఆలోచనా సంయమాలను నిరంతరం అభ్యసిస్తుంటాము.
5. మమ్మ మేము సమాజం యొక్క అభిన్న అంగాలుగా గుర్తుంచుకొని, అందరి హితములోను మా హితాన్ని చూసుకుంటాము.
6. మర్యాదలను పాటిస్తాము. చేయకూడని పనులు చేయము. పౌరబాధ్యతలను నిర్వర్తిస్తాము.
7. వివేకము, నిజాయితి, బాధ్యత, పరాక్రమం జీవితంలో అవిచ్ఛిన్నమైన ఒక అంగంగా గుర్తిస్తాము.
8. నలుదిక్కులా మధురమైన, స్వచ్ఛమైన, నిరాడంబరమైన, సౌజన్యపూరిత వాతావరణాన్ని నిర్మిస్తాము.
9. అవినీతితో పొందిన సాఫల్యంకంటే, నీతితో పొందిన ఓటమినే శిరసావహిస్తాము.
10. వ్యక్తి విలువకు గీటురాయి వ్యక్తి సాఫల్యము, యోగ్యత, అంతస్థులు గాక అతని సద్భావనలు, సత్కర్మలని గుర్తిస్తాము.
11. ఇతరులు మా యెడల ఏవిధంగా ప్రవర్తించాలని కోరుకుంటామో, మేము ఇతరుల యెడ ఆవిధంగానే ప్రవర్తిస్తాము.
12. స్త్రీ పురుషులం పరస్పరం పవిత్ర దృష్టిని కలిగి ఉంటాము.
13. ప్రపంచంలో సత్ప్రవృత్తుల పుణ్య ప్రచారానికై మా సమయం, పలుకుబడి, జ్ఞానం, పురుషార్థం, సంపత్తిలో కొంతభాగాన్ని నియమిత ప్రకారం వినియోగిస్తాము.
14. సాంప్రదాయాల కంటే వివేకానికి ప్రాముఖ్యతనిస్తాము.
15. సజ్జనులను సంఘటితపరచుటలో, అవినీతియెడల కాఠిన్యత కలిగి ఉండుటలో, నవసృజనాత్మక కార్యకలాపాలలో పూర్తి ఆసక్తిని కలిగి ఉంటాము.
16. దేశ ఐకమత్యము, సమానతల యెడల శ్రద్ధ చూపుతాము. జాతి, లింగ, భాష, ప్రాంత, సాంప్రదాయాల కారణంగా, పరస్పరం ఎలాంటి భేదభావాన్ని కలిగి ఉండము.
17. మానవుడు తన భాగ్యానికి తానే నిర్మాత. ఈ విశ్వాసం ఆధారంగా మేము ఉత్కృష్టులమవుతాము, ఇతరులను శ్రేష్ఠులుగా చేస్తాము, ఇలా చేస్తే యుగం తప్పక మారుతుంది.
18. మేము మారుతాం-యుగం మారుతుంది. మేము చక్కబడతాం-యుగం చక్కబడుతుంది. ఈ తథ్యముపై మాకు సంపూర్ణ విశ్వాసము ఉన్నది.

**ఈ యుగనిర్మాణ సత్సంకల్పములను ప్రతిరోజు ఉపాసనకు ముందు చదవాలి. నిదానంగా అర్థం చేసుకుంటూ, వీటిపై ఆలోచిస్తూ సంకల్పములు చేసుకోవాలి.** మనిషిలో దైవత్వాన్ని ఉదయింపజేసే, పృథ్విని స్వర్గంగా మార్చగలిగే ఈ సంకల్పముల వివరణ రాబోయే సంచికలలో. *(సశేషం)*

– అనువాదం: *శ్రీమతి జయలక్ష్మి*

## గృహమే కదా స్వర్గసీమ

*ఒక గృహస్థు సర్వోత్తమ సౌందర్యాన్వేషణలో నిమగ్నమై ఒక తపస్వి వద్దకువెళ్ళి తన జిజ్ఞాసను వ్యక్తం చేశాడు. తపస్వి అన్నింటికంటే సౌందర్యమైనది 'శ్రద్ధ' యని, ఆ శ్రద్ధే మట్టిని అందమైన మూర్తిగా తీర్చిదిద్దగలదని తెలియజేశాడు. గృహస్థు ఈ సమాధానంతో తృప్తిచెందక మరో మహాత్ముని వద్దకు వెళ్ళాడు. విషయాన్ని విన్న ఆయన అన్నింటికంటే సౌందర్య మైనది "ప్రేమ" యని, ఆ ప్రేమవల్లనే కర్రి (నల్లని) కృష్ణుడు సౌందర్యరాశులైన గోపికలకు ఆరాధ్యదైవం కాగలిగాడని బదులు పలికాడు. ఈ జవాబు కూడా గృహస్థుకు నచ్చక అన్వేషిస్తూ ముందుకు నడువసాగాడు. యుద్ధభూమి నుండి తిరిగి వస్తున్న ఒక సైనికుడు కనిపించి ఈయన ప్రశ్నకు కాస్త ఆలోచించి "శాంతి" అన్నిటికంటే సౌందర్యమైనదని బదులు పలికాడు.*

*ఎవరికి తోచిన మాటలు వారు చెపుతూ ఉంటారని భావించి గృహస్థు నిరాశతో ఇంటికి తిరిగి వచ్చాడు. రెండు మూడు రోజులుగా ఆయన కోసం దిగులుతో ఎదురు చూస్తున్న కుటుంబసభ్యులు ప్రేమతో ఆయనను వాటేసుకున్నారు. అందరికంటే చిన్నపాప అందమైన కళ్ళ నుండి ఆత్మీయతతో కూడిన అశ్రువులు పొంగిపొరలి ప్రవహించాయి. అందరూ శ్రద్ధతో పరిచర్యలు చేశారు. అందరికీ అసాధారణమైన శాంతి లభించినట్లు అనుభూతి కలిగింది. తాను ప్రశ్నించిన మహాత్ముల నుండి లభించిన సమాధానాల సమన్వయం తన ఇంట్లోనే ప్రత్యక్షంగా దర్శించాడు ఆ గృహస్థు.*

*సర్వోత్తమ సౌందర్య నిలయమైన కళాఖండం గృహమే. అచ్చట చూడలేని సౌందర్యమును వ్యక్తి మరెక్కడా దర్శింపలేడు. అందమైన పిల్లలు, తన సంపాదనతో ఎంత వెల చెల్లించినా బజారులో లభించని అనుభూతులు, అడుగడుగునా లభించే సపర్యలు, సౌకర్యాలు మానవునికి ఇంట్లో తప్ప మరెక్కడా లభింపజాలవు. గృహమే కదా స్వర్గసీమ.*

– ప్రజ్ఞాపురాణం నుండి

**మనిషిగా బ్రతకటానికి చాలా కష్టపడాలి**

వ్యక్తి వికాసం

# సహృదయంతో మహాత్ములు కాగలరు

ఈశ్వరచంద్ర విద్యాసాగర్ తన స్నేహితుడితో కలసి పశ్చిమ బెంగాల్‌లోని కాలనా అనే గ్రామానికి వెళుతున్నాడు. అతనికి దారిలో ఒక కార్మికుడిలా కనిపిస్తున్న వ్యక్తి నేలమీద పడిపోయి ఉండడం కనిపించింది. అతని పెద్ద మూట భుజం మీద నుంచి జారిపోయి ఒక ప్రక్కన పడి ఉంది. అతని బట్టల నుండి దుర్వాసన వస్తోంది. చాలామంది, క్రిందపడిపోయిన ఆ కార్మికుడిని చూసి కూడా మొహం తిప్పుకొని వెళ్ళిపోతున్నారు. కొంతమందైతే అతన్ని చూసి చీదరించుకొని కాండ్రించి ఉమ్మేస్తున్నారు.

అతడు చాలా దయనీయ స్థితిలో ఉన్నాడు. ఒంటిమీద స్పృహ కూడా ఉన్నట్లు లేదు. చాలా రోజుల నుండి అన్నం తినకపోవడం వల్ల పైకి లేచే స్థితిలో కూడా లేడు. దీనావస్థలో ఉన్న ఆ కార్మికుడి దగ్గరకు విద్యాసాగర్ వెళ్ళి చెయ్యి పట్టుకొని పైకి లేపి, తినటానికి, త్రాగటానికి ఏర్పాటు చేసాడు. అన్నంతిని, నీళ్ళు తాగిన తరువాత ఆ కార్మికుడికి కొంత ఓపిక వచ్చింది. విద్యాసాగర్ అతన్ని వీపుమీద ఎత్తుకొన్నాడు. విద్యాసాగర్ స్నేహితుడు అతని మూటను పట్టుకొన్నాడు. ఇద్దరు కలిసి ఆ కార్మికుడిని తీసుకొని కాలనా గ్రామానికి చేరుకొన్నారు. ఆ గ్రామంలో ఉన్న ఆసుపత్రికి తీసుకువెళ్ళి అతనికి చికిత్స చేయించారు. తనంతట తను లేచి తిరిగేంత వరకు అతని బాగోగులు విద్యాసాగరే చూసాడు.

**సహృదయత మానవత్వానికి ప్రధాన లక్షణం,** మహోన్నత వ్యక్తిత్వానికి మొదటి నిదర్శనం. అందరిలోను, ఆ పరమాత్మ కొలువుదీరి ఉంటాడు అన్న సిద్ధాంతాన్ని ప్రమాణాలలో, తర్కంతో వివరించలేకపోయినప్పటికి తన ఆచరణ, వ్యవహారాల ద్వారా దాన్ని నిరూపిస్తాడు. అతను మనిషి అంతరంగంలో కొలువైన ఆ పరమాత్మ రూపాన్ని తెలుసుకోవడమే కాకుండా, ఆయన ఆదర్శాలను తన జీవితంలో ఆచరించి అందరికి ఆదర్శ ప్రాయుడవుతాడు.

తమ ఉదారత, సహృదయతల కారణంగా పేరు ప్రఖ్యాతులు సంపాయించిన మహాపురుషులు ఎంతోమంది ఉన్నారు. అటువంటి వారి ప్రస్తావన వచ్చినప్పుడు మహాకవి నిరాలా వెంటనే గుర్తుకువస్తారు. పండిత సూర్యకాంత్ త్రిపాఠి నిరాలా హిందీ సాహిత్య రంగానికి మూలస్తంభం వంటివారు. ఆయనలోని సహృదయత, ఉదారత, కరుణల కారణంగా ప్రజలు నిరాలాగారిని దేవుడితో పోలుస్తూ ఉండేవారు. తన దగ్గర ఉన్న ధనం, వస్తువులన్నింటిని నిస్సహాయులకు, దీనులకు పంచిపెట్టి తను దారిద్ర్యంలో మగ్గుతూ ఉండేవారు. అంతేకాదు, తన కోసం ఎప్పుడైనా ఎవరైనా, ఏదైనా వస్తువువో లేదా పండో ఇస్తే దానిని కూడా తన కోసం అట్టే పెట్టుకోకుండా, కావలసిన వాళ్ళకి పంచిపెట్టేస్తూ ఉండేవారు.

ఒకసారి ఏమి జరిగిందంటే - అది జ్యేష్ఠమాసం. మిట్ట మధ్యాహ్నం ఎండ తీవ్రంగా ఉన్నది. ఆ సమయంలో నిరాలా గారు ఏదో పనుండి బయటకు వచ్చారు. అతి బలహీనంగా, ఎముకల ప్రోగులా ఉన్న ఒక వృద్ధుడు ఎండు కట్టెలమోపు నెత్తిమీద పెట్టుకొని, ఎండలో వెళ్ళడం నిరాలా చూశాడు. వాతావరణం చాలా తీవ్రంగా ఉంది. నడినెత్తున మండుతున్న ఎండ కారణంగా నేల కాలిపోతుంది. అటువంటి ఎండలో నిలబడటమే కష్టం. అట్లాంటిది నడవటం అసాధ్యం. అదీ చిరిగి, పాతపడిపోయిన బట్టలతో కాళ్ళల్లో చెప్పులు కూడా లేకుండా ఆ వృద్ధుడు నడుస్తూ ఉంటే, అతని శరీరం ఇంకా ముందుకు కదలను అని మొరాయిస్తోంది. ఆ స్థితిలో, ఆ వృద్ధుడిని చూసి, దేనికోసం బయటకు వచ్చారో ఆ పని మర్చిపోయి, నిరాలా వెంటనే అతని దగ్గరకు వెళ్ళారు. అతన్ని ఆపి కొంచెం సేపు మాట్లాడి, నెత్తిమీద ఉన్న కట్టెల మోపును దించి తన ఇంటిలోకి తీసుకు వెళ్ళారు. కొద్దిరోజుల క్రితం, నిరాలా గారి మిత్రులు ఆయన కోసం ఒక జత బట్టలు, చెప్పులు కొన్నారు. వాటిని ఆ వృద్ధుడికి ఇచ్చి ఇవి వేసుకో అని అన్నారు.

క్రొత్త బట్టలు, చెప్పులు నిరాలా తనకు ఇవ్వటం చూసి ఆ వృద్ధుడు నోట మాట రాక అవాక్కయ్యాడు. ఏం చెయ్యాలో, ఏం చెయ్యకూడదో తెలియక సందిగ్ధంలో పడ్డాడు. నేనెవరినో, ఎక్కడి నుంచి వచ్చానో ఈయనకు తెలియదు. అపరిచితుడైన నాకు ఇవన్నీ ఎందుకు ఇస్తున్నాడు? సాహసం చేసి, తెగించి ఆ వృద్ధుడు నిరాలాతో, నా గురించి ఏమీ తెలియకుండా నాకు ఇవన్నీ... ఆ వృద్ధుడి మాట పూర్తవకుండానే నిరాలా మధ్యలో అతన్ని ఆపి, బాబా! నీ గురించి నాకు బాగా తెలుసు. నాకున్న కోట్లాది మంది సోదరులలో నువ్వు కూడా ఒకడివి. ఇలా మాట్లాడుతూ తానే స్వయంగా ఆ వృద్ధుడికి చెప్పులు తొడగటం మొదలుపెట్టాడు.

అగ్నికి తనకు తాను ఆహుతి చేసుకొన్న సమిధవలె సహృదయులు, ఉదార స్వభావం కలిగిన వ్యక్తుల అంతఃకరణం కష్టాలలో ఉన్నవారిని, అభావగ్రస్తులను చూసి ద్రవించిపోతుంది. వారికి తమవారు, పరాయివారు అన్న భేదం ఉండదు. తన పట్ల

**జీవితంలో జరిగే చిన్న, పెద్ద విషయాలకు సమాన ప్రాధాన్యత ఇవ్వాలి**

శత్రుత్వం కలిగి ఉన్న వ్యక్తులకు, కష్టం కలిగినప్పుడు కూడా వారికి తమ వంతు సహాయం చెయ్యడానికి ఎంతో తత్పరతతో ముందుకు వస్తారు.

ఆంగ్ల సాహిత్య నవలా రంగంలో హెనరీ జేమ్స్‌కి ఉన్న స్థానం ఇంకే రచయితకు దక్కలేదు. ఇవాల్టికి కూడా ఆయన రచనలని ప్రజలు ఎంతో ఇష్టంగా చదువుతారు. ఆ నవలలు వారి జీవితాన్ని ప్రభావితం చేసాయి. తను బ్రతికినంత కాలం, తన రచనల కారణంగా జేమ్స్ ఎంతో పేరు ప్రఖ్యాతులు సంపాయించాడు. జేమ్స్ కీర్తి ప్రతిష్టలను చూసి ఈర్ష్యా ద్వేషాలతో రగిలిపోయే వాళ్ళ సంఖ్య ఆ కాలంలో కూడా తక్కువేమీ కాదు. చివరకు, జేమ్స్ పొరుగింటాయన కూడా జేమ్స్‌ని ఒంటి కన్నుతో చూస్తూ ఉండేవాడు. ఏదో ఒక వంకతో జేమ్స్‌తో తగాదా పెట్టుకుంటూ ఉండేవాడు. జేమ్స్ బదులు చెప్పకుండా మౌనంగా ఉండేసరికి లేనిపోని విషయాలు తవ్వి తీసి నానాయాతనలు పెడుతుండేవాడు. ఒకరోజు ఆ ప్రక్కింటాయన భార్యకు చాలా జబ్బుచేసింది. బాధ భరించలేక ఆమె విలవిల్లాడుతూ గట్టిగా అరవడం మొదలు పెట్టింది. ఏం చెయ్యాలో పాలుపోక ప్రక్కింటాయన సతమతమవు తున్నాడు. ఇంతలో జేమ్స్ తన గుమ్మంలో అడుగుపెట్టడం చూసి ఆయన ఆశ్చర్యపోయాడు.

"జేమ్స్ నువ్వు, ఇక్కడ?"

"ఏం నేను మీ ఇంటికి రాకూడదా" అని జేమ్స్ అతనితో అన్నాడు. "ఇదిగో మీ భార్యకోసం డాక్టరుకి కబురుపెట్టాను. బహుశా వస్తూ ఉంటాడు".

"నా కష్టకాలంలో నువ్వు వచ్చి ఇలా ఆదుకొంటావని నేను ఊహించలేదు. ఎప్పుడూ నేను నిన్ను నా శత్రువులాగానే చూసాను. అందుకని నిన్ను సహాయం అడగటం వ్యర్థమని భావించాను" అని ప్రక్కింటాయన జేమ్స్‌తో అన్నాడు. **సహృదయత, కరుణ మన గురించి చెడుగా ఆలోచించే వాళ్ళను కూడా మన వాళ్ళను చేస్తుంది.** అందరి సంతోషం కోసం మనం చేసే వేల ప్రయత్నాలు ఎన్నోసార్లు విఫలమవుతూ ఉంటాయి. కాని కరుణతో ఈ పని చిటికెలో పూర్తవుతుంది. ప్రతిప్రాణిలోను ఆ పరమాత్మ స్వరూపాన్ని దర్శించి, వాటి కష్టసుఖాలను అర్థం చేసుకునే మనస్సు గల వ్యక్తి, తన సొంత ప్రయోజనం కోసం ఏ ప్రాణికైనా కష్టం కలిగించటానికి ససేమిరా ఒప్పుకోడు.

ఈ విషయాన్ని నిరూపించే ఒక సంఘటన 1940లో జరిగింది. ఆ రోజుల్లో మహాత్మాగాంధీ ఆశ్రమంలో (సేవాగ్రామంలో) శాస్త్రి అనే విద్వాంసుడు ఉండేవాడు. అతను కుష్ఠురోగంతో బాధపడుతూ ఉండేవాడు. బాపు స్వయంగా అతనికి చికిత్స చేస్తూ ఉండేవాడు. అతని ఒంటికి మాలిష్ చేసి, గాయాలను కడిగి, వాటికి మందురాస్తూ ఉండేవాడు.

ఒకరోజు బాపు, శాస్త్రిగారికి మాలిష్ చేస్తూ ఉన్నాడు. ఆ సమయంలో పండిట్ సుందర్‌లాల్ అనే కార్యకర్త కూడా బాపు ప్రక్కనే ఉన్నాడు. అతను గాంధీతో, బాపు కుష్ఠురోగానికి ఒక అద్భుతమైన మందు ఉన్నది. బ్రతికి ఉన్న కాలసర్పాన్ని పట్టుకొని, దాన్ని కుండలో వేసి, మూతపెట్టి, పిడకల మీద పెట్టి ఆ పాము పూర్తిగా మసయ్యేంతవరకు కాల్చాలి. ఆ భస్మాన్ని తేనెతో కలిపి రోగికి కనుక తినిపిస్తే కుష్ఠు వ్యాధి కొద్ది రోజుల్లోనే నయము అవుతుంది.

ఈ మందు గురించి మహాత్మాగాంధీ తన అభిప్రాయం చెప్పే లోపలే శాస్త్రిగారు "సుందర్‌లాల్ ఆ అమాయకమైన పాము ఏం పాపం చేసింది? ఏ వంకతో దాన్ని కాల్చి నా రోగం నయం చేసుకోను? దాని కంటే నేను చనిపోవడమే న్యాయం. పూర్వ జన్మలో నేను చేసిన పాపం కారణంగా, ఈ జన్మలో ఈ రోగం బారిన పడ్డానేమో, ఎవరికి తెలుసు?"

హింస, ఎదుటివారికి హాని తలపెట్టడం సహృదయులకు అసంభవమైన పని. ఎదుటివారు నష్టాలకు గురి కాకుండా చూడటానికి తను స్వయంగా నష్టపోవడానికి కూడా సన్నద్ధవు లవుతారు. హెనరీ థోరియో ఒక చక్కటి ఆలోచనపరుడిగా అమెరికాలో ఖ్యాతిగాంచాడు. విశ్వవిఖ్యాతిగాంచిన హెనరీ థోరియో అనేక వ్యాసాలు రాసారు. ఈయన వ్రాసిన ఒక వ్యాసం మహాత్మాగాంధీ సహాయ నిరాకరణోద్యమానికి ప్రేరణ అయ్యింది.

సహృదయత, త్యాగం, ఉదారత, కరుణల ఆధారంగానే ప్రజల హృదయాలలో వారు సుస్థిర స్థానాన్ని సంపాయించారని, మహాత్ముల జీవితాలలోని ఈ సంఘటనలు నిరూపిస్తున్నాయి.

*– అఖండజ్యోతి, మార్చి 1981*
*అనువాదం: శ్రీమతి ఉషాసుందరి*

## దొంగతనం చేయకుండా ఉండటం ఎలా?


*ఒక దొంగ నానక్ వద్దకు వచ్చి తనకు దొంగతనం చేయవలెనని దుర్బుద్ధి నుండి విముక్తి కలిగే ఉపాయం తెలుపమని ప్రార్థించాడు. నానక్ – 'నీవు చేసిన పాపపు పనులు పది మంది ముందు చేసినది చేసినట్లు చెప్పు" అని చెప్పాడు. అలా చేయలేక ఆ దొంగ సిగ్గుపడి దొంగతనం చేయడం మానుకున్నాడు.* *– ప్రజ్ఞాపురాణం నుండి*

**ఇతరులకు హాని చెయ్యరాదు**

# సంగీతంతో చికిత్స

వైదిక ఋక్కులను స్వరబద్ధముగాను, తాళబద్ధముగాను ఉచ్చారణ గావించాలని లేదా గానము చెయ్యాలని నిర్దేశింపబడింది. సామగానము రూపములో వాటి విధి వ్యవస్థ కూడా నిర్ధారించబడి ఉన్నది. ఖురాన్‌లోని పదములను కూడా నిర్ధారిత స్వరప్రవాహ రూపములో చదవాలనే నియమమున్నది. వీటి శబ్దకూర్పు-స్వర సంధానమునకు ఉన్నంత గొప్పతనము, ఆ పదములలో దాగి ఉన్న అర్థమునకు లేదు. ఈ విధంగానే వేద పారాయణ ద్వారా వ్యక్తి మరియు వాతావరణములో ఉచ్చస్తరీయ పరివర్తన కలగాలనే విషయము వివరించబడినది.

కాంగ్రేవ్ ఇలా అంటాడు. 'సంగీతము అంతరాళములోని మర్మస్థలము యొక్క ప్రవాహము. అది బండరాళ్ళ కాఠిన్యమును కరిగించి సుకోమలము గావిస్తుంది. దానికి మానవ అంతరాళమును ప్రతిధ్వనింపజేసే, ప్రకృతి ప్రవాహమును ప్రత్యేక దిశలో తరంగితము కావించే విశేష సామర్థ్యమున్నది.'



గాంధీగారు తన అనుభవమును ఇలా వర్ణించారు. 'సంగీతము నాకు శాంతిని ప్రసాదించిది. నేను కఠినమైన పరిస్థితులలో, ప్రసంగాలలో దాని సహాయమును తీసుకొన్నాను. దక్షిణాఫ్రికాలో జరిగిన దాడిలో నేను గాయపడినప్పుడు ఓలా ఇవ్ అనే వ్యక్తి నాకు 'లీడ్ కైండ్లీ లైట్' అనే ఒక మార్మిక భక్తిగీతమును వినిపించాడు. నా బాధ ఉపశమించినది. శబ్దార్థము తీసుకున్నప్పుడు ఆ పాటకున్న అర్థము సామాన్యమైనదే, కానీ ఏ స్వరలహరిలో అది గానము చెయ్యబడినదో అది వినేవారి హృదయమును భావవిహ్వలతకు లోనుగావిస్తుంది.'

గ్రీస్‌కు చెందిన ప్రఖ్యాత చికిత్సకుడు హిపోక్రటీస్ తన చికిత్సాపద్ధతిలో సంగీతమును కూడా సమ్మిళితము కావించాడు. అలాగే ఈ దేశానికి చెందిన ఎక్కులోపియస్ కూడా రోగ-ఉపచారములో సంగీతము ఉపయోగకరమైనదని కనుగొన్నాడు. దీనిని తన చికిత్సా పద్ధతిలో జోడించాడు. ప్రాచీన కాలములో ఈజిప్ట్‌లో సంగీతము ద్వారా ప్రసవవేదనను తగ్గించ వచ్చుననే అభిప్రాయముండెడిది. అది అమలులో కూడా ఉండేది. ఆరోజుల్లో విషమును హరించుటకు, పిచ్చివారిని మంచి మనిషిగా మార్చుటకు విభిన్నరకములైన సంగీత ధ్వనులను ఉపయోగించటము జరిగేది.

డా॥ హుగెల్ తన సుదీర్ఘ పరిశోధనా పరంపరల తర్వాత 'ఆరోగ్యమునకు లాభము చేకూర్చుటలో ఔషధ చికిత్సకన్నా సంగీతము తక్కువది కాదు' అనే నిర్ణయానికొచ్చాడు. ఆరోగ్యమునకు సంగీతమునకు లోతైన సంబంధమున్నది అని చెప్పాడు.

దక్షిణభారతములో ప్రసిద్ధిగాంచిన తిరుపతి క్షేత్రములో ఉన్న శ్రీవేంకటేశ్వర స్వామి దేవాలయమునకు చెందిన గోశాలలో ప్రాతః కాలము టేప్‌రికార్డర్ ద్వారా సుప్రభాతము వినిపించడము జరుగుతున్నది. దానితోపాటే ఇతర వాద్యపరికరముల ధ్వని కూడా తోడవుతుంది. ఈ సంగీతము నాలకించిన గోవులు, ఆ సంగీత ధ్వనులను ఆలకించని ఆవులతో పోలిస్తే ఎక్కువ పాలిచ్చాయి. సంగీతమును నిలిపివేసి చూస్తే పాలుకూడా తగ్గాయి. ఒకసారి అనావృష్టి వలన పచ్చగడ్డి లభించలేదు, ఆవులకు పచ్చగడ్డి గ్రాసము వెయ్యలేదు. పాడియావులు కూడా ఎండుగడ్డి తిని ఆకలి తీర్చుకున్నాయి. ఈ స్థితిలో స్వాభావికముగా పాల ఉత్పత్తి తగ్గాలి, కానీ సంగీతము వినే ఆవులు పచ్చగడ్డి తిన్నప్పుడు ఎన్ని పాలిచ్చేవో ఇప్పుడు కూడా అన్ని పాలు ఇవ్వటమును గమనించారు. సంగీతము నాలకించే ఆవులు ఎక్కువగా కోడెదూడలకు జన్మ నిచ్చాయి. అవి పెద్దయ్యాక బలమైన, చురుకైన ఎద్దులుగా రూపుదాల్చాయి.

ఈనాడు జపాన్‌లోని ఆసుపత్రులలో మనోరోగులకు చేసే చికిత్సలలో సంగీతమునకు ప్రముఖస్థానమివ్వబడుతున్నది. దంత చికిత్స మరియు ప్రసూతిగృహాలలో కూడా ఈ చికిత్సాపద్ధతి సఫలతా పూర్వకముగా ప్రయోగించబడుతున్నది. **మనోరోగుల మీద సంగీతము ఎంత అధిక ప్రభావమును చూపిస్తుందంటే, అది ఇతర వైద్య పద్ధతులతో అసాధ్యము అని చెప్పవచ్చును.** నిద్రలేమి, శిరోవేదన, పిచ్చి, ఉన్మాదములతో ఆవేశపూరితులయ్యే రోగులకు ప్రత్యేక పద్ధతిలో బాణీకూర్చిన సంగీతము ద్వారా తక్షణ ఉపశమనము లభిస్తున్నది.

ఉద్యానవనములలో, పంటపొలములలో ఒక విశేషరీతిలో కూర్చిన సంగీత స్వరబాణీలను లౌడ్‌స్పీకర్ ద్వారా నిరంతరము ప్రసరింపజేస్తూవచ్చారు. పంటమొక్కలు త్వరగా, ఏపుగా పెరిగి చక్కని ఫలసాయము నందించుటను గమనించారు. నిజంగా సంగీతము ఒక సమగ్ర చికిత్సయే! కేవలము మనోరంజనము కాదు సుమా!!

*- అఖండజ్యోతి, ఫిబ్రవరి 1984*
*అనువాదం: శ్రీమతి లక్ష్మీరాజగోపాలు*

**మనను మనం ఎప్పుడు పరిశీలించుకుంటూ ఉండాలి**

సత్యాన్వేషణ

# కనిపించేదంతా సత్యమేనా?

మనకు ఏదైతే అనుభవం అవుతుందో వాస్తవంలో అదే జరుగుతుందని నమ్మకం లేదు. వాస్తవానికి ఒక్కోసారి దానికి విరుద్ధంగా కూడా జరుగుతుంది. ఇంద్రియాలు పూర్తి సమాచారాన్ని అందించలేవు అన్న విషయం సర్వవిదితమే అయినా నిజానికి అవి సత్యదూరమైన సూచనలనిస్తూ, మనల్ని ఓ విధంగా తప్పుదోవ పట్టిస్తాయి. దీనిని మనం గమనించకుండా కనిపించిన దానినే నిజమని నమ్మితే సత్యాన్వేషణలో సఫలం కాలేము. ఉదాహరణకు వెలుగునే తీసుకుందాం. ప్రకాశం అంటే ఏమిటి? విద్యుత్ అయాస్కాంత తరంగాలే వెలుగు. అది ఎంత మందంగా ఉంటుంది, లేదా ఎంత తీవ్రంగా ఉంటుంది అనేది దాని పరిమాణం మీద ఆధారపడి ఉంటుంది. కానీ దాని వేగం మాత్రం సర్వదా ఒకే విధంగా ఉంటుంది. ఆ వెలుగు సూర్యుని వెలుగా, జల విద్యుత్తా, విద్యుత్ బల్బా, లేక కొవ్వొత్తి వెలుగా, ఏదైనా కావొచ్చు. అది 1,86,000 మైళ్ళ వేగంతో పరుగెత్తే పదార్థము.

ఆ వెలుగు కిరణాల్లో సప్త వర్ణాలున్నాయి. వీటి సమ్మిశ్రమంతో లేత గాఢమైన రంగులు ఉత్పత్తి అవుతాయి. అనేకానేక రంగులను సృష్టించవచ్చు. అయితే విచిత్రం ఏమిటంటే సృష్టిలో రంగు అనేదే లేదు. సమస్త పదార్థాలు వర్ణ రహితమే. ఇంకా విశేషం ఏమిటంటే ఈ కిరణాల్లో దాగిన ఏడు రంగుల్లోంచి దేనినైనా ఒక రంగుని స్వీకరించి మరో రంగుని త్రిప్పి వెనుకకు పంపించేయవచ్చు. ఈ కారణం చేతనే విభిన్న వస్తువులు విభిన్న రంగుల్లో మనకు కనిపిస్తాయి.

కిరణాల్లోని ఏ రంగుని పదార్థం తనలో పీల్చుకోలేదో దానిని అది ఆపి, తిరిగి పంపించి వేస్తుంది. ఇలా పంపించే సమయంలో అవి కళ్ళను తగిలి, ఇలా అడ్డు తగిలిన కారణంగా పదార్థం పీల్చుకోని ఆ రంగు వ్యక్తమవుతుంది. వాస్తవికంగా మొక్కలు హరితవర్ణంలో ఉండవు. పైగా మొక్కలన్నీ కూడా వర్ణరహితములే. కానీ గమనిస్తే ఎక్కువ శాతం మొక్కలు, చెట్లు ఆకుపచ్చగా కనిపిస్తాయి. దీనికి కారణం నిశితంగా పరిశీలిస్తే విదితమయ్యేది ఏమంటే – హరిత వర్ణాన్ని తమలో ఇముడ్చుకునే శక్తి వాటికి లేదు. అందుకే ఆ రంగులు దానిలో ప్రవేశించలేక వాటిని వెనక్కి తిరిగి పంపించేస్తాయి. ఇలా వెనుకకు తిరిగి బయలు దేరిన పరావర్తిత కిరణాలు కంటికి తగిలి మొక్కలు ఆకుపచ్చగా ఉన్నాయన్న భ్రాంతిని కలిగిస్తాయి. మనం ఇలాంటి భ్రమలో కూరుకుపోయి, ఇదే శాశ్వతమైన సత్యం అని నమ్మేస్తాము. ఏదైనా చర్చ లాంటిది వచ్చినప్పుడు బల్లగుద్ది చెప్తాము మొక్కలు నిశ్చయంగా ఆకుపచ్చగా ఉంటాయని. దీనికి విరుద్ధంగా ఎవరైనా మాట్లాడారా వారిని అనరాని మాటలు అంటూ, నిష్ఠూరమైన నిందలేస్తాము, హేళనగా చూస్తాము. మన కళ్ళే మనల్ని ఈ విధంగా మోసం చేస్తున్నాయని, ఇది ప్రకృతిలో ఓ మాజిక్ అని తెలుసుకోవాలి.

చెట్లు, చేమలు అనేవి కేవలం ఒక ఉదాహరణగా మాత్రమే చెప్పబడ్డాయి. ప్రతి పదార్థములోని రంగుల విషయంలో ఇదే విధమైన భ్రాంతి వ్యాపించి ఉన్నది. ఏ కళ్ళనయితే ప్రామాణికంగా మనం తీసుకున్నామో, ఏ మస్తిష్కాన్ని వివేచనకు, ఆలోచనకు ప్రతీకగా గుర్తించామో, దాన్నే మనం విశ్వసించి, గ్రుడ్డిగా నమ్మి దాన్నే పట్టుకుని వేళ్ళాడితే, ప్రత్యక్షవాదం అంతా దూది పింజలాగా ఎగిరిపోతుంది. నలుపు రంగు అన్ని రంగుల కంటే గాఢమైనదని, తెలుపు రంగు అసలు రంగే కాదని అనుకుంటారు. కానీ వాస్తవ లోకానికి వెళితే ఆశ్చర్యం ఏమిటంటే దానికి పూర్తిగా భిన్నమైన అభిప్రాయం నలుపు అసలు రంగే కాదు, శుద్ధమైన రంగు తెలుపు. ఏ రంగునీ కనబడనీయకుండా చేసేది నలుపైతే, రంగుల మిశ్రమం వల్ల ఏర్పడి, కనిపించేది శ్వేత రంగు.

మరి అలా అయితే అసలు తెలుపు అంటే ఏమిటి? ఏ పదార్థము సప్త కిరణాల రంగులని పీల్చుకోలేదో, అది మాత్రమే తెల్లగా కన్పిస్తుంది. ఎందుకంటే ఏ కిరణాలు ఆ పదార్థాన్ని ఢీకొని వెనుకకు మరలి వస్తాయో, ఆ సప్తవర్ణాలు కలిసి, మన కళ్ళ ఎదుట ఆ పదార్థము తెలుపు రంగుగా అభివ్యక్తమవుతుంది. ఇది ఎంత విచిత్రం? ఎంత అసంగతమైన విషయం? మన ఇంద్రియాలే మనల్ని ఇంత క్షోభకు గురిచేస్తున్నాయంటే నమ్మ బుద్ధేయదు. కానీ వైజ్ఞానికులు నిష్కర్షగా మన ముందుకు తెచ్చిన సత్యాన్ని స్వీకరించకుండా ఎలా ఉండగలము?

ఏడు వర్ణముల మిశ్రమమే వెలుగు అనుకుంటే, ఈ వెలుగులో రంగు ఎక్కడ నుంచి వస్తున్నది అనే ప్రశ్న ఉదయిస్తుంది. దీనికి

**తప్పు చేసినప్పుడు కావలసినది ఆత్మ న్యూనత కాదు ఆత్మ విమర్శ**

జవాబు కూడా విచిత్రంగానే ఉంటుంది. వెలుతురులోని తరంగాల పొడవులోని వ్యత్యాసాలే మనకు రంగుల రూపంలో కన్పిస్తుంటాయి. వాస్తవానికి ఈ సృష్టిలో రంగు అనే పేరు కలిగిన పదార్థము లేనే లేదు. దాని అస్థిత్వము సర్వదా భ్రమ మాత్రమే. విద్యుత్ అయస్కాంత తరంగాలే వెలుగు, ప్రకాశము. ఈ తరంగాల పొడవు (wave length) వేర్వేరుగా ఉంటుంది, అవి మస్తిష్కములో రకరకాల అనుభూతులకు గురి చేస్తాయి ఈ భిన్న అనుభూతులన్నీ రంగు రూపంలో కనుపిస్తాయి.

ఈ విషయం ఇంతటితో ఆగిపోలేదు. రంగుల ప్రపంచం చాలా పెద్దది, ఎంత పెద్దదంటే దాని ముందు మానవ ప్రపంచం చాలా చిన్నది. ఎరుపు రంగులో ఉండే ప్రకాశ కిరణాలు ఒక అంగుళంలో 33,000 ఉంటాయి. కాషాయ రంగులోనైతే 16,000 దాకా ఉంటాయి. ఇన్‌ఫ్రారెడ్ తరంగాలు ఒక అంగుళంలో కేవలం 80 ఉంటాయి. దానికి విరుద్ధంగా రేడియో తరంగాలైతే దాని యొక్క పొడవు 20 మైళ్ళ నుండి 2000 మైళ్ళ దాకా వ్యాపించి ఉంటాయి. అంటే చాలా పొడవనే చెప్పవచ్చు. ఎక్స్ కిరణాల విషయంలో ఒక అంగుళ పరిధిలో 5 కోట్ల నుండి ఒక అరబ్బు (వంద కోట్లు) వరకు వ్యాపించి ఉంటాయి. గామా కిరణాలు ఒక అంగుళంలో 220 అరబ్బుల వరకు వ్యాప్తి చెంది ఉంటాయి. ఇలా భిన్న భిన్నంగా ఉన్నప్పటికి అన్నింటి యొక్క వేగం మాత్రం ఒకేలా ఉంటుంది అంటే సెకండుకు 1,86,000 మైళ్ళుగానే ఉంటుంది.

ప్రకాశ కిరణాలని యంత్రాలకు బదులుగా మామూలు కళ్ళతో చూడగలిగినప్పుడు సప్త వర్ణాలన్నీ చూడటమే కాకుండా ఈ ఏడు వర్ణాల కలయికతో సుమారు 462 కొత్త రంగులను సృజించవచ్చు. ఇంకా వీటి మిశ్రమాలతో వేల సంఖ్యలో రంగులని తయారు చేయవచ్చు.

మన కళ్ళకు భ్రాంతి కలిగించే వాటిల్లో ఒకటి ప్రాతఃకాలం నాటి అరుణోదయ సమయంలో ఎర్రని కాంతులీనే సూర్యోదయమే ఒక మంచి ఉదాహరణ. నిజానికి సూర్యుడు తెలుపే కానీ ప్రాతః కాల సమయంలో భాస్కరుడు నడినెత్తిన ఆకాశంలో ఉండడు. ఏటవాలుగా కనుపిస్తాడు. అందుచేతనే సూర్యుని కిరణాలు వాయు మండలం నించి భూ కక్ష్యకు చేరడానికి ఎక్కువ సమయం పడుతుంది. అంతేకాక మార్గమధ్యంలో ఆ కిరణాలు దుమ్ము, ధూళి కణాలతో సంపర్కం చెందుతాయి. ఈ ధూళి కణాలు ఎరుపు రంగును గ్రహించలేవు. ఆ ఎరుపురంగు కిరణములే మన దగ్గరకు వస్తాయి. అందుకే ఉదయించే సూర్యుడు ఎర్రగా కనుపిస్తాడు. రంగుల ప్రపంచంలోని మొదటి మెట్టులోనే మనకు విదితమయ్యేదేమంటే మన కళ్ళు మనలను ఎలా మోసం చేస్తాయో, మన మెదడు ఎంత సులభంగా మోసగింపబడుతుందో అని చెప్పడానికి ఈ ఉదాహరణ చాలు కదా. జీవనం యొక్క స్వరూపం, ప్రయోజనము, లక్ష్యము లేని ఒక భ్రాంతి వలలో చిక్కుకొని పోయాడు మనిషి. ఆత్మజ్ఞానము యొక్క సూక్ష్మదృష్టితో మాత్రమే మనం ఎంత అజ్ఞానంలో పడి కొట్టుకుంటున్నామో, మాయలో చిక్కుకుని ఉన్నామో అవగతం కాగలదు. ఏదో విధంగా ఈ మాయలోనించి బయట పడవలసినదే.

– *అఖండజ్యోతి, సెప్టెంబర్ 1980*

*అనువాదం:* ఎమ్.ఎస్.ఎస్. గుప్త

## కుమారజీవుడు

*మనశ్శాంతి కోసం కుమార జీవుడు చిన్నతనంలోనే బౌద్ధ ధర్మాన్ని స్వీకరించి నిరంతరం యోగసాధనలో లీనమై ఉండేవాడు. కానీ, అతనికి ఏ మాత్రం మనశ్శాంతి లభించలేదు. ఒకనాడు కుమరాయనుడనే మహాపండితుడు మిథిలయొక్క దివాన్ పదవిని వదలి ధర్మప్రచారానికై బయలుదేరి వస్తూ, మార్గమధ్యంలో బాలకుడైన కుమారజీవుని కలుసుకొన్నాడు. వ్యక్తి యొక్క మేధస్సు, ప్రతిభ లోక కళ్యాణానికి ఉపయోగపడినప్పుడు మాత్రమే శాంతి లభిస్తుందని అతనికి శిక్షణ ఇచ్చి, తన వెంటబెట్టుకుని ముందుకుసాగాడు. యాత్ర మధ్యలో కాశ్మీరు ప్రాంతంలో కుమరాయనుడు స్వర్గస్థుడైనట్లు వార్త విని అతని భార్య బౌద్ధ భిక్షుకురాలిగా దీక్ష తీసుకొని బాలకుడైన కుమారజీవుని వెంటబెట్టుకుని ధర్మప్రచార బాధ్యతను నిర్వర్తించసాగింది. కుమారజీవుడు పెరిగి పెద్దవాడై విద్య పూర్తికాగానే చైనా వెళ్ళి కొందరు మిత్రుల సహాయంతో బౌద్ధ గ్రంథాలను చైనాభాషలోనికి అనువదించాడు. మహత్వపూర్ణమైన ఈ బాధ్యతను స్వీకరిస్తూనే ఇతడు అనేక ప్రదేశాలను తిరిగి మత ప్రచారం గావించాడు. ఈయన ప్రయత్నాల వలన బౌద్ధధర్మానికి కేంద్రం భారతదేశంకాక చైనాయేనని చెప్పవచ్చుననేటంతగా వ్యాప్తి చెందింది.*

– ప్రజ్ఞాపురాణం నుండి

**తప్పు చేస్తే తప్పును సరిదిద్దుకునే మార్గాలను వెతకాలి**



### పూజ్య గురుదేవుల అమృతవాణి

# దేవతల రహస్యం-1

## ఋషుల జ్ఞానం - దివ్య విజ్ఞానం

సృష్టిలోని శక్తులకు ఏ రూపం ఉండదు. వేడికి ఏ రూపం ఉన్నది? వేడికి ఎలాంటి రూపం ఉండదు! చలికి ఏ రూపం ఉండదు! చల్లదనానికి ఏ రూపం ఉండదు! ప్రేమకు ఏదైనా రూపం ఉంటుందా? ఏ రూపం ఉండదు. కోపానికి రూపం ఉంటుందా! ఉండదు, కాని క్రోధం కారణంగా కళ్ళు ఎర్ర బారతాయి గాని, క్రోధానికి ఏ రూపం ఉండదు. విద్యుత్‌కి ఏ రూపమైనా ఉందా? లేదు నాయనలారా ఎలాంటి రూపం లేదు. విద్యుత్ పంఖాలో చేరినప్పుడు అది తిరుగుతుంది. బల్బులోకొస్తే అది వెలుగుతుంది. కాని విద్యుత్ కంటూ ఏ రూపం లేదు. భౌతికంగా ఉన్న వస్తువులకు మాత్రమే రూపాలుంటాయి. ఏవైతే అంతటా వ్యాపించి ఉన్నాయో, వాటికి రూపాలు ఉండవు!

మిత్రులారా! ఇప్పుడొక ప్రశ్న ఎదురవుతుంది. మరి దేవతలకు రూపాలు ఎలా తయారయ్యాయని? దేవత ఒక వ్యక్తి అయి ఉంటే, మీలాగా లేక మాలాగా మానవుల రూపంలో ఉండాలి. దేవతలు ఒకే స్థానీయులైతే, ఒకే స్థలంలో ఉన్నట్లైతే వారు మనుషులుగా నైనా అయి ఉండాలి లేక అన్యజీవులుగానైనా అయి ఉండాలి. కాని వారు సర్వవ్యాపిగా ఉంటే మాత్రం రూపాలు ఉండవు. మరి హిందూ ధర్మంలో దేవతలకు రూపాలు ఎలా ఇవ్వటం జరిగింది? ఇతర ధర్మాలలో వారివారి దేవతలకు రూపాలు ఎందువల్లలేవు? ముస్లిమ్ ధర్మంలో భగవంతునకు ఏ రూపం లేదు. దేవతలకు ఒక రూపం ఇచ్చుట కుదిరే పనికాదు. ఈ మాట విన్నవారికి కోపం రావచ్చు, మరి ఈ విధంగా రూపాలు ఇవ్వటం ఎలా జరిగింది? ఏసుక్రీస్తుని మానవ రూపంగా నమ్ముతాము అలాగే మరియమ్మను మనిషిగానే నమ్ముతాము. అందుకని వారికి రూపాలు తయారుచేసాము. భగవంతుని రూపాన్ని మాత్రం తయారుచేయలేము. క్రీస్తు అంటాడు భగవంతుని రూపం ఎలా చేయగలరని? అలా తయారు చేయుట అయ్యేపని కానే కాదు. అలా చేయకూడదు.

## మరి సాకార రూపమెందుకు?

మిత్రులారా! కొన్నిసార్లు నాకు ఎంతో ఆశ్చర్యమేస్తుంది, తాత్త్విక దృష్టిలో హిందూ ధర్మమేమైనా వెనుకబడలేదు గదా అని అనిపిస్తుంది. నా మదిలో ఎన్నోసార్లు అలాంటి ఆలోచనలు వస్తూ ఉంటాయి. వ్యాపక శక్తులకు రూపాలను ఎందుకిచ్చినట్లు? రూపాలు ఇవ్వడంలో ప్రశ్న ఎదురురైనప్పుడు దానికి ఒకే ఒక జవాబు, హిందూ ధర్మం కళాకారుల ధర్మమని, కవుల ధర్మమని తెలుస్తుంది. కవులు, కళాకారులు ఏదో ఒక విశేషమైన ఉద్దేశ్యంతో, విశేషమైన ఆదర్శాల ఆధారంగా ఇటువంటి రూపాలను ఇచ్చి ఉండవచ్చు. మానవులు ఆదర్శాలు, సిద్ధాంతాలు, కర్తవ్యాల గురించి మరవకుండా గుర్తుంచుకుంటారని ఈ విధమైన రూపములను గుర్తుగా ఇచ్చి ఉండవచ్చు. గార్డుకి బండిని బయలు దేరుటకు ఇచ్చే సంకేతం పచ్చజెండా గాని, లేక పచ్చలైటు మరి ఈ పచ్చ జెండాకి ట్రైన్‌ను నడిపే శక్తి ఉందా? లేదు నాయనలారా! దీనికాశక్తి లేదు, ఇది రైలు బండిని ముందుకు నడుపుమని బండి డ్రైవరుకు అందించే ఒక గుర్తు! దీనినే నోటిమాటతో చెబితే ఎవరికి వినిపిస్తుంది? ఎంత బిగ్గరగా అరచినా, గోలపెట్టినా బండిని ముందుకు నడుపుమని లేక ఆపుమని చెప్పినప్పుడు ఎవరికి వినిపించదు. కాని ఎర్ర జెండా చూపితే బండిని ఆపమని అర్థం అవుతుంది. దృశ్యం ద్వారా భావనలను తెలియపర్చు విధానం. అలాగే అదృశ్యశక్తులను హృదయాంగమము చేసుకొనుట వెనుక ఈ విధానం అవలంభించుట జరిగింది. ఇందుకొరకే నిరాకారాన్ని సాకారరూపంలో చూపే ఉద్దేశ్యం. ఆదర్శాలను, సిద్ధాంతాలను సమన్వయ పరచుకొనుటకు మూర్తులను, చిత్రాలను ఇలా నిర్మించుట జరిగింది!

## మీ ఇష్టం ఏమిటి? లక్ష్యం ఏమిటి?

మీ కిష్టమైన దేవత ఎవరు? మాకు ఇష్టదేవత హనుమాన్‌జీ! దీనికి అర్థం ఏంటి? దీనికి అర్థం మన లక్ష్యం అలాంటి వ్యక్తిగా మారటం. అంటే సమర్థునిగా, బలవంతునిగా, పురుషార్థునిగా తయారుకావటం. మేము అలాంటి వ్యక్తిగా మారాలను కొంటున్నాము. మా లక్ష్యం ఇదే! అటువంటి వ్యక్తిగా మారుటే మా ఉద్దేశ్యం. "ఇద మిదం వాసుదేవః" వాసుదేవుడనటంలో ఇక్కడ అర్థం ఏమంటే మాకు శ్రీకృష్ణునిగా మారాలని ఉంది. మా ఇష్టదైవం భగవాన్ శంకరులు. మీ ఇష్ట దైవం ఎవరు? మా ఇష్టదైవం శ్రీరాముడు అంటే మేము ఆ రాముని మూసలో నమూనాగా మారి మర్యాద పురుషోత్తముడని పిలుపించుకోవాలను కొంటున్నాము. మా లక్ష్యం మర్యాద పురుషోత్తముని స్థాయివరకు చేరాలని అందుకొరకే మేము రాముడిని మా లక్ష్యంగా, మాకు ఇష్టదైవంగా చేసుకొన్నాము.

**మనం చేసే తప్పులకు మనమే బాధ్యులము**

## దృష్టాంతం చూపుట కొరకే ఆకృతులు

భగవంతుని సాకార రూపం దర్శించాలంటే, ఈ గ్లోబ్ నిండా అంటే ఈ విశ్వం నిండా, అంతటా ఆయన నిండి ఉన్నాడు కదా! గ్లోబు అనగా ఏమిటి? గ్లోబు ఒక గుండ్రని వస్తువు, వివిధ రంగులతో కూడిన ప్రపంచ పటం! అస్పష్టంగా గుండ్రని రూపంగా ఉంటుందనే దానిని మనం అర్థం చేసుకొనుటకు గాను అలా తయారుచేయుట జరిగింది. ఈ పృథ్వి మొత్తం గోళాకారంలో ఉంది. ఈ జగత్తు మొత్తం గోళాకారంలో ఉంది! ఇదేమిటి? వీరు శంకరులు శివ భగవానుడు. మరి సాలగ్రామమేమిటి? సాలగ్రామం కూడా అదే! సాలగ్రామాన్ని మన హృదయంలో నిలుపుకొన్నట్లైతే, దాని ప్రభావం మన జీవితాలలోకి రావడంతో, మన బ్రతుకులు ధన్యమైపోగలవు. మిత్రులారా! మీరు గనక సాలగ్రామం మీద, లేక శివభగవానుని మూర్తిమీద జలం అభిషేకిస్తే, బిల్వ పత్రాలు సమర్పిస్తే, పూలు సమర్పిస్తే, మహదేవులు భోళాశంకరులు కాబట్టి, వెంటనే ప్రసన్నుడై మాకు కొడుకునిస్తాడనుకొంటే, వారు ఒక్కొక్కరికి శివలింగం, ఒక్కొక్క సాలగ్రామాల నుండి పుట్టించి ఉండేవారే కదా! ఎక్కడ నుండి ఇస్తాడు? ఆయనకే పిల్లలను పుట్టించగల శక్తి ఉంటే ఇప్పటికి ఆయన రూపాల నుండి ఎంతోమందిని పుట్టించి ఉండేవారు. లేదు మహరాజ్‌జీ! ఈ రాయి చాలామంచిది! వెంటనే ఫలమిస్తుంది! అటువంటి పనికిమాలిన మాటలు మాట్లాడకండి! ఈ మాటలతో మన హిందూ ధర్మం కళంకితమై పోగలదు. మన తాత్త్వికజ్ఞానం అస్తవ్యస్తమైపోగలదు, దీనివల్ల ప్రజలలో అజ్ఞానం పెరిగిపోగలదు! భ్రమలు పెరుగుతాయి! ఈ తెలివిలేని పనులతో, మాటలతో ఎలాంటి లాభం కలుగదు.

## మానవుడు భగవంతునిగా మారాలి

మిత్రులారా! మన ఋషులు భగవంతుడిని మానవరూపంగా ఏనాడు చూడలేదు. మానవుడిని భగవంతునిగా మార్చాలనే వారి ఉద్దేశ్యం! మానవుని భగవంతునిగా మార్చుట పూర్తిగా సంభవమే. కాని భగవంతుణ్ణి మానవునిగా మార్చగలుగుట అసంభవం. భగవంతుడు ఎప్పుడైనా అవతారం దాల్చాలని అనుకొంటే మానవ రూపంలో జన్మ తీసుకొంటాడు. మంచి మనుష్యులను, గొప్ప మనుష్యులను, మనం భగవంతుడని పిలుచుకొంటాం! ఉచ్ఛస్తరీయ మానవుల పేరే భగవంతుడు.

## అవతారాల కళలు - లీలలు

మహారాజ్‌జీ! పరశురాముడు కూడా అవతారమేనా? అవును నాయనా! పరశురాముడు కూడా అవతారమనే చెబుతున్నాను వీరు అవతార పురుషులు దేవుళ్ళయితే, ఒక దేవుడికి మరొక దేవుడితో యుద్ధం ఎందుకు జరిగిందని నేను అడుగుతున్నాను. ఈ భగవంతుడికి ఆ రెండవ ఆయన కూడా భగవంతుడేనని ఎందుకు తెలియలేదు? పరశురామునకు తాను భగవంతుడునని ముందుగా తెలిసి ఉంటే, రామచంద్రుడు కూడా భగవంతుడేనని తెలిసి కూడా భగవంతుడు, భగవంతునితో ఎందుకు యుద్ధం చేస్తాడు? భగవంతునకు మరొక భగవానుని గురించి ఎందుకు తెలియలేదు!

మిత్రులారా! శంకర భగవానుని ధనుస్సుని రామచంద్రుడు విరిచాడు! భగవంతుని ధనస్సు భగవంతుడే విరిచి, మరొక భగవంతునితో యుద్ధం చేస్తున్నాడు. ఇదంతా ఏమిటి? మీ బుద్ధిని శుద్ధిపరచుకోండి. ఒకవేళ మీరు మీ బుద్ధిని శుద్ధి చేయకపోతే, గాయత్రీమాత నుండి చమత్కారమనే లాభాన్ని మీరెప్పటికి పొందలేరు.

## గాయత్రీ ప్రతిమ వెనుక ప్రేరణ ఉంది

మిత్రులారా! గాయత్రీ మంత్రం గురించి మీ అభిప్రాయ మేమిటి? గాయత్రీ మాత స్వరూపాన్ని ఎలా తయారుచేసామంటే, ఆ రూపానికి వెనుక ఒక శిక్షణ ఉంది. శిక్షణ వెనుక ఉద్దేశ్యముంది. ఆ ఉద్దేశ్యాన్ని అర్థం చేసుకొనేందుకు, వాటిని వివరించేందుకు మేము గాయత్రీ స్వరూపాన్ని తయారుచేశాము. అయితే భగవంతునికి ఏ రూపం ఉండదా? భగవంతునికి ఏ రూపానికి అవకాశముండదు. వారు శక్తి స్వరూపులు. ఈలోకంలో రెండు రకాల శక్తులున్నాయి. ఒకటి భౌతికమైనది. రెండవది ఆధ్యాత్మికమైనది. భౌతిక శక్తులలో విద్యుత్, ఆవిరి, ఎండ, అయస్కాంతశక్తి వంటి అనేక విధమైన రూపాలలో ఉంటాయి. ఇవన్నీ భౌతిక శక్తులు! వీటిలో బలం ఉంటుంది. ఇక ఆధ్యాత్మిక శక్తులేమిటి? ఆధ్యాత్మిక శక్తులనగా వాటిలో భావసంవేదనలు సమాహారమై ఉంటాయి. భావాలు-వివేచనలు. సంవేదనలలో మొదలైన వాటిలో ఏదైనా బలం ఉందా? ఆ వివేచనలలో బలముంటుంది. వివేచనల్లో బలముంటుందని మీరు ఇతిహాసాలలో చదవలేదా? వివేచనలలో, భావనల శక్తి ఎలా ఉంటుందని నిన్న మేము వినిపించాము. ఇప్పుడింకా వివరిస్తాము.

## భావనలతో దేవత్వం

అటువంటి భావనాశీలురులలో ఒకరు జార్జి వాషింగ్టన్. ఒక కలప వ్యాపారి ఇంటిలో జన్మించాడు. రెండవ వారి పేరు అబ్రహాం లింకన్. ఒక పేదింటిలో జన్మించాడు. ఎంత పేదవారంటే కడుపు నింపుకోవటానికి సరిపోయే రొట్టె కొరకు ప్రతిరోజు వెదుకులాడే

**సరిదిద్దుకోగలిగే తప్పు జరిగితే వెంటనే సరిదిద్దుకోవాలి**

బీదతనం! అయితే తరువాత వీరు మహాపురుషులుగా ఎలా మారారు? భావనలు అతి నిమ్న వ్యక్తిని కూడా గంతులు వేయిస్తుంది. తెలియదు ఎక్కడ నుండి ఎక్కడకు తీసుకొనిపోయి చేరుస్తుందో! వినోబాభావే గారు తమ జీవిత చరిత్రలో ఇలా వ్రాసుకొన్నారు. "మా అమ్మ శనగపిండి విసురుతున్నప్పుడు నేను ఆమె ప్రక్కకు చేరేవాడిని. తిరగలి నుండి ఎగిరి క్రింద పడుతున్న శనగ గింజలను ఏరుకుని తింటూ ఉండేవాడిని. ఆ రోజుల్లో మా ఆర్థిక స్థితి చాలా హీనంగా ఉండేది. మాకు ఒక్కోసారి ప్రొద్దుట పూట అల్పాహారం ఏదీ దొరికేది కాదు! ఇది నేను ఎవరి గురించి చెప్తున్నాను! వారి పేరే వినోబాభావే! వీరు ఏమయ్యారు? మహాత్మునిగా మారిపోయారు. ఈ వామనుడు, భగవంతునిగా మారగలిగాడు. వారి పదచిహ్నాలు భూదానోద్యమానికి మార్గాలు చూపాయి. భావనలు ఉచ్ఛస్తరీయమైనవిగా ఉంటే మానవుడిని గొప్పవానిగా చేయగలవు. అవి మనిషిని గురువుగా, మహా పురుషునిగా, ఋషిగా, దేవమానవునిగా తయారు చేయటమేగాక ఇంకా ఏమేమోగానో చేయగలవు.

## భావనలలోని దేవాత్మ స్వరూపం

మిత్రులారా! భావన ఒక శక్తి. భావనలను మించిన మరో శక్తి ఏదైనా ఉండగలదా? నాయనలారా, అటువంటిదేదీ లేదు. విద్యుత్తా? విద్యుత్ కూడా అంత శక్తివంతంగా ఉండదు. ఆటమ్ (Atom) (అణుశక్తి). అణుశక్తి కూడా అంత శక్తిగా ఉండదు. మనోభావనల గురించి మీకు తెలియటం లేదు. ఎంత శక్తివంతమైనవో. చేతన గురించి మీకు అర్థం అవుటలేదు. విచారణలు గురించి మీకు తెలియదు. లేదు గురూజీ! విచారణల గురించి నాకు అర్థం కాదు గాని నేను మాత్రం పైసాల (ధనం) గురించి బాగా అర్థం చేసుకోగలను. సంపాదన గురించి తెలుసుకో గలను. చావండి అభాగ్యుల్లారా! మీరు దేన్నీ తెలుసుకోలేరు. జంతువులు మీరు! జంతు లక్షణాలు గురించి అర్థం చేసుకోగలరు! భావన అనే పేరు ఏ వస్తువునంటారో మీకు అర్థం కావటం లేదు. నాయనలారా! భావనే మానవుని ప్రాణం. భావనలే మనిషి యొక్క భావినిర్మాణానికి పునాదులు. భావనలే మానవునిలో హర్షోల్లాసాలను వికసింపచేయగలవు. భావనలే మనిషి లోలోపల దైవత్వాన్ని దర్శింపచేస్తాయి. మనిషికి భావనలే శాంతిని, శక్తులను ఇవ్వగలవు, పై తలానికి తీసికొనిపోగలవు. ఆ భావ సముదాయమే మానవులలో, కలహాల కడలిలో ముంచి నరక లోకాలలోనికి కూడా పడత్రోయగలవు! నాయనలారా! మీరు భావనల విలువ గ్రహించ లేకపోతున్నారు! భావనల విలువ తెలుసుకోండి.

## విలువలను (మాన్యతలు) మార్చుకో

మిత్రులారా! స్మృతులలో ఈ భావనలను దైవీశక్తులుగా చెప్పుట జరిగింది. మీ నమ్మకమేమంటే దైవీ శక్తులు ఏదో స్త్రీల వంటివని అనుకొంటున్నారు. ఎవరో ఒక మహిళగా అనుకొని ఆమెకు మనం వస్త్రాలు కట్టి, మిఠాయిలు తినిపిస్తాము. వెండి గొడుగులు చేయిస్తాము, కొబ్బరికాయలు కొట్టి ప్రసాదాలు తినిపిస్తాము. అప్పుడు ప్రసన్నురాలై మాకు సంపదతో కూడిన సమస్త వస్తువులను పళ్ళేలతో నింపి, ఇంకా మూటలలో ధనరాశులను తప్పక పంపగలదని అనుకొంటారు. నోరు ముయ్యండి! పిచ్చివాళ్ళలాగా పనికిరాని మాటలు వాగుతున్నారు! లేదు గురూజీ! ఎవరో స్త్రీ దేవత మాకు ఇవన్నీ తప్పక ఇస్తుంది! ఎవరా స్త్రీ మూర్తి? గురువుగారు! సంతోషిమాత కూడా మహిళే! గాయత్రీ మాత కూడా స్త్రీ మూర్తే. ఇంకా చాలా మంది మహిళ దేవతామూర్తులు ఉన్నారు గదా! నోరు ముయ్యండి, మహిళ సంపదలిస్తుందని అనకండి. అరే భాయ్... ఆమె తన బిడ్డలకు, తన సంతానానికిస్తుందిగాని నీకిస్తుందా? లేదు స్వామీజీ! ఆమె మా కొబ్బరి ప్రసాదాన్ని తిని మాకు ధనానిస్తుంది. బేటే, వారు మీ కొబ్బరి ప్రసాదాన్ని తినరు, మీకు ధనాన్ని ఇవ్వరు! మరేమిటి? వాస్తవికత ఏమిటి?

## మహాదేవుని వెనుక ప్రేరణలు

మేము శంకరుని గురించి చెప్తాము. శంకర భగవానుడంటే ఎవరు? శంకర భగవానుని మూర్తిని నిర్మించదలచినప్పుడు, దాని వెనుక కొన్ని ఉద్దేశ్యాలను, కొన్ని నియమాలను ఇచ్చుట జరిగింది! 'మీరు గనుక శంకర భగవానుని ఉపాసన చేయాలనుకొంటే, మీరు ఈ ఉద్దేశ్యాలను ఆచరించవలసి ఉంటుంది. ఈ ఉద్దేశ్యాలను మీరు హృదయాంగంలో నిలుపుకోవలసి ఉంటుంది. అవి ఏయే ఉద్దేశ్యాలు? శంకర్ భగవానుని రూపం మీరు చూసే ఉంటారు గదా! ఆ రూపంలో ప్రతిభాగం వెనుక మీకు కొన్ని ఉద్దేశ్యాలు కన్పించగలవు, కొన్ని ప్రేరణలు లభించగలవు, కొన్ని శిక్షణలు కన్పించగలవు. శంకర భగవానుని శిరములోనుండి జలం వస్తూంటుంది. గంగామాత వస్తూంటుంది. ఏమిటి స్వామీ! తలలో నుండి గంగామాత బయటకు వచ్చుట సంభవమా? నాయనలారా! నా ఉద్దేశ్యం ప్రకారం రాకూడదు, ఎందుకంటే ఎవరి తలనుండైనా గంగామాత బయటకు వస్తే, జలం ప్రవహిస్తే, ఆ మనిషి ఎప్పటి వరకు కూర్చొని ఉంటాడో, అప్పటివరకు జలం వస్తే కొంతవరకు ఫర్వాలేదు కాని, ఒకవేళ ఆయన ప్రక్కకు తిరిగినప్పుడు కాని, పడుకుంటానికి ప్రయత్నం చేస్తే మాత్రం నీరు ఆయన ముక్కులోనికి, చెవులలోకి దూరిపోగలదు! దాంతో ఆ మనిషి

**నలుగురు చెప్పేదే న్యాయం కాదు**

స్థితి ఏమవుతుందో భగవంతునికెరుక! శంకర భగవానుడు కూర్చొని ఉంటే మాత్రం ఏం ఫర్వాలేదు! తల నుండి జలం ప్రవహిస్తూ ఉండొచ్చు, కాని ఒకవేళ శంకర భగవాన్‌కు ఏదో పొరపాటున నిద్ర వచ్చి పడుకోటానికి ప్రయత్నం చేస్తే మాత్రం, మొత్తం గంగాజలం ఆయన చెవులలోనికి ముక్కులోనికి దూరిపోతే మాత్రం శ్రీ శంకరుల పరిస్థితి చాలా ఘోరంగా మారిపోగలదు!

## శంకర భగవానుని గంగ

అయితే గురూజీ! మరి శంకర భగవానులో విశేషమేముంది? బేటే, ఏమిలేదు. వారు జ్ఞానానికి గంగ వంటివారు! శంకర జటాఝూటం నుండి వెలుపలకు వస్తుంది. మస్తిష్కం నుండి వస్తుంది! ఎక్కడ నుండి ఆ జ్ఞానగంగ వస్తుందో, అదే మన లక్ష్యం! మన మస్తిష్కంలో కూడా అటువంటి జ్ఞాన గంగ ఉద్భవించాలి. ఎందుకని స్వామీజీ! మస్తిష్కంలో నుండి కూడా గంగ వస్తుందా? గంగా జలం వెలుపలికి వస్తుందా? అవును నాయనా! జ్ఞాన గంగ వస్తుంది! ఇలాంటి జ్ఞానాన్నే గంగాజలానికి ప్రతీకగా రూపంగానే, గంగాజలం వస్తున్నట్లు తయారుచేయుట జరిగింది! మనకు శివ భగవానుని ప్రాప్తి లభించాలంటే, శివుని శిష్యులుగా తయారు కాగలగితే, మనం మన మస్తిష్కానికి అలాంటి సంరచనను చేయగలిగినప్పుడు, మనలో అలాంటి ఆలోచనా తరంగాలు, ఆలోచనా ప్రవాహాలు, ఆలోచనల జలధారలు బయటకు వస్తాయి. ఇదొక అలంకారిక వర్ణన మాత్రమే! అయితే స్వామీ! శంకర భగవాన్ జటాఝూతం నుండి గంగ బయటకు రాదా! లేదు నాయనా! జటల నుండి ఏ గంగ వెలుపలకు రాదు.

## శివుని శిరస్సుపై చంద్రుడు

మంచిది ఇంకా ఏముంది శివుని తలమీద? చంద్రబింబ ముంది! అది శంకర భగవానుని తలమీద వ్రేలాడుతూ ఉంది! చంద్రుని గురించి మీ అభిప్రాయమేమిటి? చంద్రుడంటే ఏమిటి? చంద్రుడేమైనా ఆకుతో చేయబడ్డాడా? లేదు గురూజీ! ఆకుతో తయారుచేయబడలేదు! గోళాకార రూపంగా, బంతివలే గుండ్రంగా తయారు చేయబడి ఉంది. బంతిలాగా ఉంటుంది. అదే బంతిలాగా గుండ్రముగా ఉంటే ఆయన తలపైన ఎలా నిలబడుతుందో ముందు మాకు తెలియపర్చండి. బంతివంటి గుండ్రని చంద్రుణ్ణి తలమీద మేకుతో దించిగాని, లేక తాడుతో కట్టిగాని లేక క్రేన్ సహాయంతో ఎత్తి ఆయన తలపైన ఫిట్ చేసి ఉండవచ్చు! లేనట్లయితే గుండ్రటి బంతివంటి చంద్రుడు శంకర భగవానుని శిరస్సు మీద నిలబడటానికి ఏ విధమైన అవకాశమే లేదు. కాదు గురూజీ! చందమామ శంకర భగవానుని తలమీద ఉంటుంది! మంచిది అయితే అది ఏవిధంగా వ్రేలాడదీయబడింది, దీని రహస్యమేమిటో వివరించండి. లేదు స్వామీజీ! మేము వివరించలేము, మీరే చెప్పండి, మీ అభిప్రాయమేమిటో? బేటే, మా అభిప్రాయంలో చంద్రుడు చల్లదనానికి ప్రతీక. మన మస్తిష్కం అనేకసార్లు వేడెక్కిపోయి, మనం అనేకసార్లు ఆవేశానికి లోనై, కోపం వచ్చి సంతులన కోల్పోతూ ఉంటాము. మాట-మాటకు మనం సంతులన కోల్పోతూ ఉంటాము. మనం టెంపర్‌ని లూస్ చేసుకొని చతికిలపడతాము. అటువంటి స్థితి నుండి బయట పడేందుకు ఏమి చేయాలి?

మిత్రులారా! శివ భక్తులు తమ ఓర్పుని ఎప్పుడూ పోగొట్టకూడదు! మానవ జీవితంలో రెండు రకాల పరిస్థితులు వస్తూ ఉంటాయి. మంచివి వస్తాయి. ఇంకా చెడు పరిస్థితులు కూడా ఎదురవుతాయి. అన్ని పరిస్థితుల్లో కూడా పిచ్చితనం కూడదు. ఈ లోకమంతా అదే విధమైన 'పడుగు-పేక' వంటి నేతలో కూడి వస్త్రంవలే ఉండి, దానిలో ఉన్న ప్రతి మనిషికి కష్టాలు రాగలవు, సుఖాలు రాగలవు. ఎప్పుడు మంచి పరిస్థితులే ఉండవు. మంచి పరిస్థితులు శ్రీరామునికి కూడా లభించలేదు. కృష్ణునికి కూడా దొరకలేదు. లేదు స్వామీజీ! మా జీవితాలు మాత్రం సుఖ సంతోషాలతో ఉండాలి. మేము సుఖంగా జీవించ గోరుచున్నాము! బేటే, మీరు సుఖంగా ఉండుట కుదరని పని! జీవితం ఆ విధంగా తయారుచేయబడలేదు! మన జీవితాలు వస్త్రంలోని పడుగు పేకలవలే నిర్మించబడ్డాయి. ఆ నేతలో ఒక దారం ఇటు ప్రక్కకు వస్తే, మరొక దారం అటు ప్రక్కకు పోతూ ఉంటాయి. అలాంటి రెండు రకాల దారాలతో ఈ జీవితం నేయబడి ఉంది. పగలురాత్రి కలసిమెలసి ఉన్నందునే ఈ ప్రపంచం నిర్మించబడింది. సుఖం దుఃఖం, లాభం నష్టం వంటి రెండు రకాల స్థితులతో మానవ జీవితం కలగలసిపోయి ఉన్నది. అందుకని ప్రతి వ్యక్తి ఈ పరిస్థితులను ఎదుర్కొనటకు ఎల్లప్పుడు సిద్ధంగా ఉండాలి! మాకు కూడా బాధలు వస్తాయా? తప్పక రాగలవు! ఒకవేళ ఎవరైనా మాతో గురూజీ మాకు మా జీవితాలలో ఎటువంటి బాధలు రాకుండా మీ ఆశీస్సులను అందించండని కోరుకోవటం చాలా పొరపాటు. నాయనలారా శ్రీరామచంద్రునికి బాధలు తప్పలేదు! శ్రీకృష్ణునికి కూడా ఎన్నో ఆటంకాలు ఆయన జీవితంలో ఎదురయ్యాయి. పాండవులకు కూడా వచ్చాయి. అలాగే మీ జీవితాలలో కూడా తప్పక రాగలవు!

(సశేషం)

– *అఖండజ్యోతి, మార్చి 2012*

*అనువాదం: జి. చెన్నకేశవరావు*

**నలుగురు ఒక ఆవును మేక అంటే అది మేక అవదు.**

నా వారితో నా మాట

# ఉపాసన కొందరికి ఎందుకు సఫలమవుతుంది? కొందరికి ఎందుకు కాదు?

కొద్ది రోజుల క్రితమే నవరాత్రి గాయత్రీ ఉపాసన పూర్తి చేసుకున్నాం. చాలామంది పరిజనులు ఈ నవరాత్రులను మంత్ర జపము, అనుష్ఠానాల కోసం ఉపయోగించుకున్నారు. కొందరు కఠోర ఆహార నియమాలను పాటించారు. కొందరు నీరు మాత్రమే తాగారు. దైవీ కుటుంబంలోని పరిజనులు చాలా సంవత్సరాలుగా ఈ సాధన చేస్తున్నారు. చాలామందికి సందేహం కలుగుతుంది, సాధన యొక్క ఉద్దేశ్యం కొన్నిసార్లు నెరవేరుతుంది, కొన్నిసార్లు నెరవేరదు. ఇలా ఎందుకు జరుగుతుంది? సాధనతో సిద్ధి అనే సిద్ధాంతం చాలాసార్లు నిరూపించబడుతుంది, చాలాసార్లు విఫలమవుతుంది.

ప్రాచీన చరిత్రలలో, పురాణాల్లో ఎందరో ఋషులు, గొప్ప సాధకులు, తపస్వులు కఠోరమైన ఉపాసనలు చేసి అద్భుతమైన శక్తులను, విభూతులను, వరాలను హస్తగతం చేసుకున్నట్లు కనిపిస్తుంది. తాము చేసే ఉపాసన, సాధనల్లో ఒక భాగాన్ని ఇతరులకు వరాల రూపంలో, ఆశీర్వాదంగా ఇవ్వగలిగిన సామర్థ్యాన్ని సంపాదించుకున్నారు. ఇటువంటి ఈశ్వరీయ సామర్థ్యం గల సాధకులు, తపస్వులు భారతదేశంలోనే కాక ప్రపంచమంతటా కొలువై ఉన్నారు. తమ ఉపాసన, తపశ్శక్తులతో భగవంతుని మెప్పించి వారు ఎన్నో వరాలు పొందిన వర్ణన, వివరణ చరిత్రలో కనిపిస్తూనే ఉన్నది.

సాధన ద్వారా సాధించుకునేది సామాన్యులకు సులభంగా లభించదు అని తెలియజెప్పే ప్రమాణాలు చరిత్రలో చాలా ఉన్నాయి. మనం చర్చించుకుంటున్న మనీషుల్లో ముఖ్యులు మన గురుదేవులు పరమపూజ్య పండిత శ్రీరామశర్మ ఆచార్యగారు. ఎన్నో సంవత్సరాల కఠోర తపస్సుతో గాయత్రీ సాధనను సఫలీకృతం చేసుకున్నారు. వారి తపో సాధనతో గురుదేవులు అలౌకికమైన సూక్ష్మ శక్తులను పొందారు. ఆ సంపూర్ణ విజ్ఞానాన్ని, విధానాన్ని అన్వేషించి అనుసంధానపరిచారు. తమ తపో ప్రయోగాలతో లక్షలకోట్ల మంది కష్టాలను పోగొట్టారు, వారిపై సత్ప్రేరణల ప్రకాశాన్ని కురిపించారు.

మనం చర్చించుకుంటున్న వారిలో ఇల్లు వాకిలి వదిలేసి తమ కాలాన్నంతా ఉపాసనకే వెచ్చించిన వారు కూడా చాలామంది ఉన్నారు. వారి పరిస్థితి ఘోరం. వారిలో వ్యక్తిగత గొప్పతనం కాని, ఆత్మిక ప్రగతి కాని కనిపించలేదు. ఆరోగ్యం, సామాజిక సంపదలు, వివేకం, ఆత్మబలం మొదలైన ప్రతిభలేమీ సంపాదించలేదు. నిజానికి ఏ స్థాయితో ఉపాసన మొదలపెడతారో అంతకన్నా తక్కువ స్థాయికి దిగజారారు. అటూ భౌతిక సంపత్తి దొరకలేదు, ఇటు ఆత్మశాంతి కలగలేదు. రెంటికి చెడ్డరేవడి అయ్యారు.

ఇటువంటి ఉదాహరణలు సాధకులలో, ఉపాసకులలో అయోమయం సృష్టిస్తుంది. ఒకే ఉపాసన ప్రక్రియను అవలంభించిన కొందరికి లాభం, కొందరికి నష్టం ఎందుకు కలుగుతుంది? ఉపాసన అనేది ఒక గుడ్డి నమ్మకం అయ్యుంటే, అంతమందికి లాభమెలా కలిగింది? మరికొందరికి నష్టం ఎందుకు జరిగింది? నీరు అందరి దాహాన్ని తీరుస్తుంది, సూర్యుడు అందరికి వెలుగుని, శక్తిని ఇస్తాడు. మరి ఉపాసన వల్ల ఫలితాలలో వైవిధ్యం ఎందుకుంటుంది?

గాయత్రీ మంత్రమే కాక మరే ఇతర ఉపాసన యొక్క అలౌకిక లాభాలు పొందాలన్నా సాధకుని పాత్రత చాలా అవసరం. ఉపాసనకు సంబంధించిన క్రియా కలాపాలు బట్టీ పట్టేస్తే సరిపోదు. పదునైన కత్తి ఎవరి తలనైనా నరకగలదు అన్నది నిజమే. గొర్రెనో, మేకనో నరకాలన్నా, కత్తి పుచ్చుకున్న వాడి భుజబలం, సాహసం, కౌశలం అవసరము. విద్యుత్ శక్తి సామర్థ్యాన్ని ప్రశ్నించలేం, కాని దాన్ని ఉపయోగించుకోగల మెషీన్లు ఉండాలి. లేని పక్షంలో విద్యుత్తు వృధా అవడమే కాక అనర్థానికి కూడా దారి తీయవచ్చు.

ముత్యపు చిప్పలకే స్వాతి చినుకుల వల్ల లాభం ఉంటుంది. కళ్ళున్న వాడికే వెలుగు కనిపిస్తుంది. గాయత్రీ ఉపాసన విషయంలో కూడా ఇదే న్యాయం వర్తిస్తుంది. వేదమాత గాయత్రి యొక్క మహామంత్రం వలన సరైన, ఖచ్చితమైన, లాభం పొందాలంటే ముందు అంతర్ బాహ్య వ్యక్తిత్వాన్ని, ఆలోచనలను, ఆచరణలను సరిచేసుకోవాలి. పథ్యం పాటించి, తగిన మోతాదులో మందు వేసుకున్న వారికే వైద్యం పని చేస్తుంది. ఉపాసన చేసే వాళ్ళు అతి త్వరగా లాభం పొందడానికి గాయత్రీ మాత, గాయత్రీ మంత్రం వెంట పడతారు. ఆత్మశోధన ఎంత అవసరము అన్న విషయం పట్టించుకోరు. మంత్రం బట్టీ పట్టేసి, పూజా పునస్కారాలు చేసేస్తే పనైపోతుంది అనుకుంటారు, అందుకే వారికి సాఫల్యం కలగదు.

ప్రతి సాధకుడు ఉత్కృష్టమైన గుణ కర్మ స్వభావాలు కలిగి ఉండాలి. ఆహార విహార పద్ధతులు, జీవన శైలి, స్వాధ్యాయ సత్సంగాల బలంతో కషాయ కల్మషాలను రూపుమాపుకోగలిగి అంతఃకరణాన్ని స్వచ్ఛంగా, పరిశుద్ధంగా, పవిత్రంగా, నిర్మలంగా మార్చుకుంటే గాయత్రీ మాత, గాయత్రీ మంత్రం, ఉపాసన, తపోవిధానం వాటంతటవే తగిన లాభాలను వర్షిస్తాయి. పాత్రత సంపాదించుకోకపోతే ఉత్కృష్ట వరాలు కోరుకునే వివేకమే జాగృతం కాదు. మంత్రం బట్టీపడితే కాస్తంత భౌతిక లాభం కలుగుతుందేమో కాని కాస్తంత కూడా దైవత్వం చేజిక్కదు. ఒకవేళ

**మనతో అవసరమున్న వాళ్ళు మన దగ్గరకు ఎలాగు వస్తారు**

ఏదైనా అసుర సిద్ధి లభించినా దాని పరిణామం విపత్కరంగానే ఉంటుంది. అసురులు కోరుకున్న వరాల వల్ల చివరికి వారే సర్వ నాశనమయ్యారని అందరికి తెలుసు. ఎంతటి నిర్మలమైన అంతః కరణ, వ్యక్తిత్వం ఉంటే అంతగా ఉపాసన వల్ల లాభం పొందవచ్చు.

అసలు గాయత్రీ మాత ఎక్కడుంది? ఎలాంటి స్థితిలో ఉన్నది? ఎంత శక్తి కలది? అనే ప్రశ్నలు కూడా తలెత్తుతాయి. అన్నిటికి జవాబు ఒకటే, ఆ ఆదిశక్తి జగన్మాత యొక్క దివ్య చైతన్యం సంపూర్ణ విశ్వంలో వ్యాపించి ఉన్నది. ఆవిడ అనంత కోటి బ్రహ్మాండాల, కోట్ల కోట్ల జీవరాసుల, జడ చైతన్యాల బహుముఖ గతివిధులను (multifacet activities) నిర్వహిస్తుంది. గ్రహ నక్షత్రాలలాగా జగన్మాత కూడా నిరంతరం నియమంగా, క్రమపద్ధతిలో పనులు చేయడంలో నిమగ్నమై ఉంటుంది.

వ్యక్తిగత సంస్కారాలను బలపరచుకోవడం, భావనల ఒడిదుడుకులను పట్టించుకోవడం తల్లికి కుదరదు. ఆమెలోని ఒక అంశ ఈ పనులన్నిటికి ప్రాతినిధ్యం వహిస్తుంది. ప్రతి మనిషి లోను, వారి స్థూల, సూక్ష్మ, కారణ శరీరాల్లో, అన్నమయ, ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయ, ఆనందమయ కోశాల్లో ఆమె తన ఒక అంశను ప్రతిష్ఠించింది. ఆ అంశయే మనిషి బాగోగులు చూసుకుంటుంది. వరాలు, అనుగ్రహాలు అన్నీ ఈ అంశ ద్వారానే లభిస్తాయి.

ఈ అంశ యొక్క సామర్థ్యం, మనిషిలోని శ్రద్ధ, నిష్ఠ భావములను బట్టి ఉంటుంది. సాధకుని నిష్ఠలోని తీవ్రత, వ్యక్తిత్వంలోని ప్రఖరతను బట్టి అతనిలోని గాయత్రీమాత పోషించబడుతుంది, ఆమె అనంత సామర్థ్యం బహిర్గతమై సాధకుడికి ఆశ్చర్యకరమైన సహాయ సహకారాలను అందిస్తుంది. ఇలా కాకుండా సాధకునిలో ఎటువంటి ఆత్మిక విశేషతలు లేకపోతే, అంతరంగంలో నెలకొని ఉన్న గాయత్రీమాతలోని సనాతన సామర్థ్యానికి ఏ పోషణ లభించదు, తద్వారా అది నిష్క్రియంగా, నిస్తేజంగా పడి ఉంటుంది. భావన లేకుండా చేసే పూజా పునస్కారాలు, జప తపాలన్నీ కూడా నకిలీ మందులవలె పని చేస్తాయి, మహాశక్తి అంశను బలపరచలేదు, మరి అప్పుడు ఉపాసనంతా వ్యర్థమేగా!

గాయత్రీమాత ఎంత గొప్పదైనా మనిషి యొక్క వ్యక్తిగత జీవితం, అతని వ్యక్తిత్వానికి తగ్గట్టుగానే సక్రియంగా ఉంటుంది. సజ్జనుల, తపస్వుల అంతఃకరణాల్లో రవ్వంత మనోవికారం జొరబడినా అంతరాత్మ తీవ్రంగా ప్రతిఘటిస్తుంది, ధిక్కరిస్తుంది, పశ్చాత్తాపానికి గురిచేస్తుంది. అక్కడితో ఆగదు, ప్రాయశ్చిత్తం చేయించి తీరుతుంది. దురాచారాలు, దుష్కర్మలు చేసినప్పుడు కూడా అంతరాత్మ ఖండిస్తుంది కాని దాని గొంతు వినిపించనంత మంద్రంగా, నిస్తేజంగా ఉంటుంది. ఇద్దరి హృదయాల్లోను గాయత్రీమాత అంతర్యామిగా ఉన్నది. ఇద్దరి అంతరాత్మల ప్రకృతి ఒకటే, వాటి కర్తవ్యం అవి నెరవేరుస్తూనే ఉంటాయి. కాని పరిణామాలు మాత్రం మారుతాయి. సత్ప్రవృత్తులను పోషించుకుని అంతరాత్మను నిర్మలంగా మార్చుకున్న వారే సజ్జనులు, తపస్వులు కాగలరు.

గాయత్రీమాత సర్వవ్యాపి, సాక్షి, ద్రష్ట, నియంత, కర్త, భర్త, సచ్చిదానందాల విభూతి సంపన్నమైన విరాట్ బ్రహ్మ స్వరూపం. ఆ తల్లి అంశను ధరించి దేవతలు, దైవీ శక్తులు సృష్టినంతటిలో తమ కర్తవ్యాలను నెరవేరుస్తూంటాయి. ఈ తత్వాన్ని అర్థం చేసుకున్నవారికి ద్వైత భావాలు కలగవు. వారు ఎల్లప్పుడూ ఆ తల్లి స్వరూపాన్ని అనుభవిస్తూనే ఉంటారు. ఇతర దేవతా శక్తులను ఉపాసించినా చివరికి గాయత్రీ ఉపాసనలోనే లీనమౌతారు. వేరే దేవతా శక్తులను ఉపాసించే వారిని కూడా తమ ఆత్మీయులుగానే భావిస్తారు.


యుగఋషి, పరమపూజ్య గురుదేవుల ఆలోచనా విధానం కూడా ఇలాగే ఉండేది. వారివలె గాయత్రీ ఉపాసనా ఫలాన్ని పొందాలంటే మన దృష్టికోణాన్ని కూడా ఇదే విధంగా సవరించుకోవాలి. జీవనక్రమాన్ని వారు వ్యవస్థీకరించుకున్నట్టే మనమూ చేయాలి. వారిలాగా కఠోర తపస్సు చేసి, వారివలె జీవనశైలిని అవలంభించుకుని, వారివలె దృష్టికోణాన్ని విస్తరించుకుని, వారిలాగా నిష్ఠతో ప్రజాసేవ చేస్తే, గాయత్రీ సాధన వారికి ఫలించినట్టే మనకు ఫలించి, జీవితంలో ఆశ్చర్యకర పరిణామాలను పొందవచ్చు. ఈ యదార్థాన్ని అర్థం చేసుకోలేని వారు గాయత్రీ ఉపాసనను ఇంద్రజాలంగా, జూదంగా భ్రమ పడతారు. ఆడంబరంగా పూజా పునస్కారాలు, ప్రసాదాలు, దానాలు చేసేసి ఉపాసన పూర్తి చేద్దామనుకునే వారికి నిరాశ తప్పదు.

గాయత్రీ ఉపాసన ఒక సర్వాంగీణ విజ్ఞానం. ఈ యుగంలో ఈ విజ్ఞానాన్ని పరమపూజ్య గురుదేవులు అన్వేషించి, వికసింప జేసారు. గాయత్రీ మహావిజ్ఞానం అనే గ్రంథరాజంలో దీన్ని ప్రతిపాదించారు. నియమాలను, ప్రయోజనాలను అర్థం చేసుకుని ముందుకు సాగితేనే లాభాన్ని పొందవచ్చు. ఈ విషయాన్ని మన పరిజనులు అర్థం చేసుకుంటే ఉపాసనతో పాటు వారి ఆలోచనలను, వ్యక్తిత్వాన్ని సరిదిద్దుకుని, ఆత్మ పరిష్కరణ కూడా పూర్తి చేసుకోగలరు, గురుదేవుల ఉపాసనా మార్గంలో ముందుకు సాగగలరు. అప్పుడు వారి జీవితాల్లో అనుమానం, నిరాశ, అయోమయాలకు తావుండదు. ఈ విషయాన్ని అర్థం చేసుకుని, జీవితంలో అవలంబించుకున్న వారు రాబోయే మరో నవ రాత్రులలో మరింత నియమ నిష్ఠలతో గాయత్రీ ఉపాసన చేసి తప్పనిసరిగా అనుగ్రహాన్నీ, ఫలాన్ని చేజిక్కించుకోగలరు.

*– అఖండజ్యోతి, నవంబర్ 2012*

*అనువాదం: శ్రీమతి జయలక్ష్మి*

**లోపాల మీద కాక సామర్థ్యం మీద దృష్టి కేంద్రీకరించాలి**



ఆరోగ్యమే మహాభాగ్యం - 25

# హోమియో వైద్య సేవ

## మడమ నొప్పికి మేలైన చికిత్స - ఎక్సర్‌సైజ్‌లు - హోమియో మందులు

వయసు పెరుగుతున్న కొద్దీ, అరికాలిలో ఉండే ప్లాంటార్ ఫెషియ (plantor fascia) సాగే గుణాన్ని కోల్పోయి, గట్టిపడుతుంది. మడమలో ఉండే ఫ్యాట్ పాడ్ ఇది, షాక్ అబ్సార్బర్‌గా పనిచేస్తుంది. ఇది సన్నబడటం వలన గాయాలను తట్టుకునే శక్తిని కోల్పోతుంది. షాక్ వలన ప్లాంటార్ ఫెషీయ డామేజ్ అవుతుంది.

దీని వల్ల వాపు, నొప్పి వస్తుంది. దీంతోపాటు మడమ నొప్పి, వాపు కలిగి ఉంటుంది. ఊబకాయం, బరువు ఎక్కువగా ఉండటం, మధుమేహం, ఎక్కువ సమయం నిలబడటం, పనిచేయడం, అధిక శ్రమ వల్ల ప్లాంటార్ ఫైసియైటిస్ (plantor fasciitis) సమస్య అధికం అవుతుంది.

**నిర్ధారణ ఎలా?**

వైద్యుడు ముందుగా మీ నొప్పి గురించి అడిగి తెలుసుకుంటారు. నొప్పి ఏ విధంగా ఉంది, ఎప్పుడు వస్తుంది, ఎన్ని రోజుల నుంచి మీరు ఈ నొప్పితో బాధపడుతున్నారు? అనే విషయాల్ని తెలుసుకుంటారు. ఉదయం పూట మీరు మొట్ట మొదటగా నిలుచున్నప్పుడు మీ మడమలో నొప్పి కలిగిన దానిని ప్లాంటార్ ఫెసియైటిస్ అంటారు. చాలామందికి పొడిచినట్లుగా లేదా సూదితో గుచ్చినట్లుగా నొప్పి ఉంటుంది. ఈ నొప్పి అరికాలు కింది భాగంలో ఉంటుంది. ఎక్కువసేపు నిలబడడం వల్ల నొప్పి అంత తీవ్రంగా ఉండదు. చాలా సేపు కూర్చొని తిరిగి నిల్చోవడం వల్ల ఈ నొప్పి తీవ్రంగా ఉంటుంది.

**విముక్తి ఎలా?**

ఎక్కువ సమయం నడిచినా, లేదా పరుగెత్తినా నొప్పి ఎక్కువగా ఉంటుంది. దీనిని తగ్గించండి. పాదము పెద్దదిగా ఉన్నా లేదా ముందు భాగము పెద్దదిగా ఉన్నా వైద్యులను సంప్రదించి, మీ పాదమునకు తగిన షూస్‌ను ధరించండి. వీటిని ఆర్థోటిక్స్ అంటారు. ఇవి పాదమునకు సపోర్ట్‌గా పనిచేస్తాయి. ఎక్కువ బరువును కలిగి ఉన్నా ఈ నొప్పి ఎక్కువగా ఉంటుంది.

బరువు తగ్గించుకుంటే ఈ నొప్పిని చాలా వరకు తగ్గించుకోవచ్చు. ఎక్కువ సమయం ఒకే చోట నిలబడి పనిచేసిన లేదా గట్టిగా ఉండే నేలపైన ఎక్కువ సమయం పనిచేయవలసి వచ్చినా, ఆ నేలపైన పాడింగ్‌ను ఉంచి పనిచేయండి అప్పుడు మడమనొప్పి సమస్య అదుపులో ఉంటుంది.

**ఎక్సర్‌సైజ్‌లు మేలు:** ఈ సమస్య పరిష్కారానికి స్ట్రెచింగ్ ఎక్సర్‌సైజ్ చేయడం ఉపయోగకరంగా ఉంటుంది. ఇది రోజుకి రెండుసార్లు చేయండి.

**ప్లాంటార్ ఫెషియ స్ట్రెచ్:**

ఈ ఎక్సర్‌సైజ్‌లో నిటారుగా నిలబడి గోడను రెండు చేతులతో పట్టుకొని, గోడకు ఎదురుగా గాయమైన కాలును, మామూలుగా ఉన్న కాలికి కొంచెం వెనుకగా పెట్టండి. మడమ భాగమును, నేలకు సరిసమానంగా పెట్టండి. నెమ్మదిగా రెండు కాళ్ళ మోకాళ్ళను వంచండి. ఇలా చేయడం వలన కాలి కింది భాగంలో స్ట్రెచ్ (సాగుతుంది) అవుతుంది. ఈ స్ట్రెచ్‌ను 10 నుంచి 15 నిమిషాల వరకు ఇలానే ఉంచండి. ఇలా ఈ ఎక్సర్‌సైజ్‌ను 6 నుంచి 8 సార్లు చేయండి.

**కాఫ్ స్ట్రెచ్ (పిక్క):**

ఈ ఎక్సర్‌సైజ్‌లో గోడకు ఎదురుగా నిటారుగా నిలబడి, రెండు చేతులతో గోడను పట్టుకొని (తోస్తూ) గాయమైన కాలిని మామూలుగా ఉన్న కాలికి కొంచెం వెనుకగా పెట్టండి. మడమ భాగమును నేలకు సరిసమానంగా పెట్టండి. గాయమైన కాలును స్ట్రెట్‌గా ఉంచండి. మామూలుగా ఉన్న కాలు మోకాలును వంచండి. ఇలా చేయడం వలన కాలు మధ్యభాగంలో ఉన్న పిక్క కండరాలు స్ట్రెచ్ (సాగుతాయి) అవుతాయి. ఈ స్ట్రెచ్‌ను పదిసార్లు చేయండి. ఈ రెండు ఎక్సర్‌సైజులే కాక ఇతర ఎక్సర్‌సైజులు కూడా చేయవచ్చును.

కాలులో ఉన్న కండరాల బలానికి పాదము మీద నిల్చొని, నెమ్మదిగా కాలు చివరి భాగమును పైకి లేపి బొటనవేళ్ళపైన నిల్చోండి. కాసేపు ఇలానే ఉంచి, తిరిగి నెమ్మదిగా పాదమును కిందకి పెట్టండి. కొన్ని సందర్భాల్లో వ్యాయామాలు చేసినా నొప్పి తగ్గదు. ఎక్సర్‌సైజ్‌లు, ఆర్చ్ సపోర్ట్స్, మెడిసిన్స్ మొదలైనవి ఉపయోగకరంగా లేనపుడు వైద్యులను సంప్రదించి ఇతర చికిత్సలు తీసుకోవాలి. రాత్రివేళల్లో పాదములో స్ప్లింట్స్‌ను ధరించవలసి ఉంటుంది. కొన్ని కేసులలో శస్త్రచికిత్స చేయవలసి ఉంటుంది.

ప్రపంచంలో మంచిని చూడు.

**హోమియో చికిత్స:**

రూట, అమ్మోనియం మూర్, కాల్కేరియ ఫ్లోర్, రస్టాక్స్, లెడమ్‌పాల్, రొడోటెండ్రాన్, పల్సటెల్లా మందులు మడమ నొప్పికి బాగా పనిచేస్తాయి.

**రూట :** సయాటికా, నొప్పి నడుమ భాగము నుంచి తుంటి భాగము, కాళ్ళు, మడమ వరకు ఉంటుంది. పడుకున్నప్పుడు, రాత్రివేళల్లో అధికం, టెండాన్‌లలో నొప్పి, ఎముకలలో నొప్పి, కీళ్ళలో నొప్పులు, మెడ భాగములో నొప్పులు, ఉదయంపూట సమస్యలు అధికం. కాళ్ళు, చేతులు పట్టేసినట్లుండుట. కండరాలలో నొప్పి, ఆందోళన, స్ప్రెయిన్స్, దెబ్బల వలన నొప్పులు, మూత్రం వెళ్ళిన తర్వాత మళ్ళీ వెళ్ళాలనిపించడం ఈ సమస్యలకు రూటా చక్కగా పనిచేస్తుంది.

**రస్టాక్స్ :** కండరాలు, లిగమెంట్స్, కనెక్టివ్‌టిష్యూ డిసార్డర్స్‌కు మంచి మందు. వీటి వాపు వలన కలిగే కండరాల బాధలు, సంకోచ వ్యాకోచ లోపాలు, బెణుకులు, ఆటలు ఆడేవారిలో శారీరక శ్రమ ఎక్కువ చేసేవారిలో, ఎక్కువగా పరిగెత్తే వారిలో వచ్చే నొప్పులకు వాడదగినది. ఆందోళన, ఒక ప్రదేశంలో ఉండలేరు. కాళ్ళు పట్టేసినట్లుండుట, మడమనొప్పి, వాపు, సయాటికా, విశ్రాంతి వల్ల, రాత్రిళ్ళల్లో సమస్యలు అధికం. వేడి వాతావరణంలో, చలనం వలన ఉపశమనం, భయము, తరుచూ ఏడ్చే స్వభావం ఉన్నవారికి ఈ మందు మేలు చేస్తుంది.

**అమ్మోనియం మూర్ :** మడమలో పొడిచినట్లుగా ఉండే నొప్పి, వాపు, సయాటికా, కూర్చున్నా సమస్యలు అధికం, పడుకున్నప్పుడు ఉపశమనం. కాళ్ళల్లో నొప్పులు, చేతులలో, వేళ్ళల్లో నొప్పి, పాదములో చెమటలు భరించలేని వాసనను కలిగి ఉండుట, కీళ్ళలో నొప్పులు, కండరాల నొప్పులు, మలబద్ధకం, చలిని భరించలేరు, ముఖ్యంగా ఇది ఊబకాయం ఉండేవారిలో, ఇవ్వదగినది, బాధ, చిరాకు, కోప స్వభావం గల వారికి ఈ మందు బాగా ఉపయోగపడుతుంది.

**సలహాల కొరకు సంప్రదించవల్సిన చిరునామా**


**డా॥ టి. నీలవేణి,** బి.హెచ్.ఎమ్.ఎస్.
ఆర్.ఎన్.జి. అడ్వాన్స్‌డ్ హోమియో క్లినిక్,
ఇ.నెం. 3-211, యశోద గార్డెన్స్ దగ్గర, శాంతినగర్,
కూకట్‌పల్లి, హైదరాబాద్ - 500 072.
ఇ-మెయిల్: drneelaveni@gmail.com


*ఈ శీర్షిక హోమియో వైద్య విధానం మీద అవగాహన పెంచుకోవడానికే. దయచేసి స్వంత వైద్యం ప్రయత్నించవద్దని మనవి.*

## రావణుని పొరపాట్లు

*రావణునికి పరాభవం, విభీషణునికి పట్టాభిషేకం జరిగిన తర్వాత విభీషణుడు తన కర్తవ్యపాలనకు సంబంధించిన ఆదేశాలను రాముని ద్వారా స్వీకరించాలనే ఆకాంక్షను వ్యక్తం చేస్తాడు. దానికి రాముడు అనునయంగా "విభీషణా! నీ అగ్రజుడైన రావణుని యొక్క జ్ఞాన విజ్ఞాన పరంపరను రక్షించి, వికసింపచేయి. కాని నీ ఆలోచనా సరళిని మాత్రం సదా ధర్మ పరాయణునిగానే కొనసాగనివ్వాలి" అని పలుకుతాడు. రావణుని యొక్క ఆలోచనా స్థాయిలో సంభవించిన లోట్లు, పొరపాట్లు ఏమిటో తెలియజేయమని విభీషణుడు ప్రార్థించగా దానికి రాముడు "రావణుడు ఋషి పరంపర యొక్క వ్యవస్థీకృతమైన ఆలోచనా క్రమాన్ని విడనాడి అస్తవ్యస్తమైన లాలస దృష్టిని స్వీకరించాడు. సంకుచిత స్వార్థ పూరితమైన ఆలోచనలు అతణ్ణి నీచకర్మల వైపు లాక్కొని పోయాయి. ధర్మాన్ని రక్షింవలసిన వాడై ఉండి కూడా అధర్మాన్ని పెంచి పోషించాడు" అతని పతనానికి ఈ లోట్లు, పొరపాట్లే కారణమని విభీషణునితో బదులు పలికాడు.*

- ప్రజ్ఞాపురాణం నుండి

## ఇష్టమైతే కష్టం లేదు

*ఒక మహాత్ముడు పర్వతాన్ని ఎక్కుతున్నాడు. అదే సమయానికి 10 సంవత్సరాల పాప కూడా తన రెండు సంవత్సరాల తమ్ముని ఎత్తుకొని పర్వతం మీదకి వెళుతోంది. అది చూచి మహాత్ముడు "పాపా నీవే చాలా చిన్నదానివి. పైగా అంత బరువు ఎత్తుకొని ఎలా పైకి వెళ్ళగలవు?" అని ప్రశ్నించాడు. ఆ మాటలకా పాప "బాబా! నేను మోస్తున్నది బరువుని గాదు, సోదరుడిని" అని వినయంగా బదులు పలికింది. మహాత్ముడు పాపవంక ఆశ్చర్యంగా చూచి కన్నులతోనే ఆశీర్వదించాడు.*

***ఎక్కడైతే ప్రేమ, ఆత్మీయతల వంటివి ఉంటాయో అక్కడ ఎంతటి భారమైన పనులు కూడా భారంగా తోచవు.*** *ఆ భావన లోపించిననాడు ఎవరి జీవితం వారికే భారంగా తోస్తుంది. ముసలి తల్లి-తండ్రులు పిల్లలకు భారమనిపించినా, అశక్తులు అంగవిహీనులు అయిన బిడ్డలు తల్లితండ్రులకు భారమనిపించినా అక్కడ ఆత్మీయతలు, అనురాగాలు లోపించాయని గుర్తించండి.*

- ప్రజ్ఞాపురాణం నుండి

**కోపం ద్వారా సాధించేది ఏమి ఉండదు**



# సుమతీ సూక్తం - 3

అపార లోకజ్ఞానంతో, ఏది మంచో, ఏది చెడో, ఎవరితో స్నేహం చెయ్యాలి? ఎవరితో చేయకూడదు? అనే విషయాలను మనకు తెలియపరచిన బద్దెనకవి నిజంగా నిత్యస్మరణీయుడే. ఎందుకంటే లోకం పోకడ, మనుష్యుల తీరుతెన్నులు అంత సులభంగా అర్థం కావు. అందువల్లనే తన అనుభవజ్ఞానంతో మనలను ఇలా హెచ్చరిస్తాడు ఈ క్రింది పద్యంలో...

*ఉదకము ద్రావెడు హయమును*
*మదమున నుప్పొంగుచుండు మత్తేభంబున్*
*మొదవు కదనున్న వృషభము*
*జదువని యా నీచుఁజేరఁజనకుర సుమతీ ॥*

గుఱ్ఱం నీరు త్రాగేటపుడు, దాని దగ్గరకు ఇతరులు వెళ్ళకూడదు. వెళితే అది ఆ నీరు తనకు దక్కదేమోనన్న భయంతో తన్నడమో, లేక కొరకడమో చేస్తుంది. అలాగే మదముతో కూడిన ఏనుగును కూడా దరిచేరరాదు. ఎందుకంటే ఆ స్థితిలో దానికి ఒక రకమైన మత్తుతో కూడిన కోపంతో దంతాలతో కుమ్మి, తొక్కి చంపేస్తుంది. అలాగే ఆవు, ఆంబోతులు కలిసి ఉన్న సమయంలో ఎవరైనా దగ్గరకు వెళితే, వాటి సంగమానికి ఆటంకం కల్పించే ప్రయత్నం చేస్తాడన్న కొమ్ములతో పొడిచే దుష్ప్రవర్తన కలిగి ఉంటాయి.

అలాగే చదువు సంస్కారం లేని వ్యక్తితో స్నేహం చేస్తే, ఆ కుసంస్కారి తన దుర్గుణాల ప్రభావం వల్ల అపకారం చేస్తాడు. అందువల్ల చదువు, సంస్కారం లేనివారితో స్నేహం తగదు. అది ఎప్పటికైనా ప్రమాదకరమే.

ఉత్తమోత్తమ సంస్కారం ఎలా ఉంటుందో, ఈ క్రింది పద్యంలో వివరించారు మన బద్దెన కవి.

*ఉపకారికినుపకారము*
*విపరీతముకాదు సేయవివరింపంగా*
*నపకారికినుపకారము*
*నెపమెన్నక సేయువాడు నేర్పరి సుమతీ ॥*

'కృతజ్ఞత' అంటే ఒక వ్యక్తి నుండి సహాయం పొందినపుడు, ఆ సహాయానికి కృతజ్ఞతగా మరొక సహాయం చేయడం పరిపాటి. అంతేగాక ఆ వ్యక్తిని, ఆ సహాయాన్ని మర్చిపోకుండా ఉండడమే సంస్కారవంతుని లక్షణం. అయితే మహోన్నతమైన వ్యక్తిత్వం కలవాడు, కేవలం తనకు సహాయం చేసిన వానికి మాత్రమే సహాయం చేస్తూ కాలక్షేపం చేయకుండా, గతంలో అపకారం చేసినవారికి కూడా, ప్రస్తుతం ఉపకారం చేస్తే మహోన్నతులుగా కీర్తించబడుతున్నారు. ఇటువంటి మహోన్నత వ్యక్తిత్వం అరుదుగా అగుపిస్తుంది.

శరణు కోరిన శత్రువును కూడా, (గతంలో వాడు చేసిన అపకారాన్ని, వాడు కలిగించిన నష్టాన్ని గురించి ఆలోచించకుండా) అక్కున చేర్చుకునే అపార సంస్కారాన్ని కలిగి ఉండాలి. అందుకు అతణ్ణి సమాజం మహనీయునిగా స్మరిస్తుంది. శత్రుదేశాలు ఎన్ని అవరోధాలు సృష్టిస్తున్నా, భారతదేశం వాటిని ఎదుర్కొంటూనే వారికి అవసరమైనప్పుడు స్నేహ హస్తాన్ని అందించే ధార్మిక సంస్కృతిని కలిగి ఉంది. ఇదే భావాన్ని వేమన

*"చంప తగినయట్టి శత్రువు తన చేత*
*చిక్కినేని కీడు చేయరాదు*
*పొసగమేలు చేసి పొమ్మనుటయే చాలు"* అంటాడు.

దుష్టునితో స్నేహం ఎలా ఉంటుందో బద్దెన ఇలా వివరించాడు.

*ఉపమింపమొదట తియ్యన*
*కపటం బెడనెడనుజెఱకుకై వడివే, పో*
*నెపములు వెదకును గడపట*
*గపటవు దుర్జాతి పొందుగదరా సుమతీ ॥*

దుష్టునితో స్నేహం మొదటి దశలో ఆకర్షణీయంగా, అతి మధురంగా అగుపిస్తుంది. క్రొత్త క్రొత్త అలవాట్లతో మధురంగా చెఱుకుగడలాగా రుచికరంగా ఉంటుంది. కానీ రాను రాను ఆ దుర్గుణాలను, చెడు అలవాట్లను, ప్రమాదకర ఆలోచనలను, దుష్ట బుద్ధిని తట్టుకోలేక వెగటు పుడుతుంది. చెఱుకు కూడా తొలిదశలో ఉన్నంత మాధుర్యం, క్రమక్రమంగా తగ్గుతూ, వెగటు పుట్టిస్తుంది. అదే విధంగా చెడ్డవానితో స్నేహం కూడా క్రమక్రమంగా వెగటు పుట్టించి, ఆ స్నేహాన్ని తెంచుకోవాలనిపించే స్థితిలో, అది ఊబిలాగా బయటకు రానీయదు. బలహీనతలు, వాటివల్ల చేసే తప్పులు మనలను వెంటాటి వేటాడి చివరకు నాశనం చేస్తాయి. కాబట్టి ఇతరులలోని చెడు లక్షణాలను, భావాలను పసిగట్టి, ముందుగానే దూరంగా ఉండడం శ్రేయస్కరం.

**మనకు అభిరుచి ఉన్న రంగంపై మన దృష్టిని కేంద్రీకరించాలి**

లౌక్యం, పరిస్థితులను బట్టి ప్రవర్తనను మార్చుకునే నైపుణ్యం ఉన్నవాడు సమాజంలో చాకచక్యంగా నెగ్గుకురాగలడన్న సత్యాన్ని ఇలా వివరించాడు బద్దెన కవి.

*ఎప్పటికెయ్యది ప్రస్తుత*
*మప్పటికా మాటలాడి యన్యుల మనముల్*
*నొప్పింపక తానొవ్వక*
*తప్పించుకు తిరుగువాడు ధన్యుడు సుమతీ ॥*

ఏది ప్రస్తుతము, ఏది అప్రస్తుతము అన్న విచక్షణతో, దానికి తగిన రీతిలో నడుచుకుంటూ, ఇతరులను నొప్పించకుండా, తాను కలత చెందకుండా సమయానుకూలంగా ప్రవర్తిస్తూ, హఠాత్తుగా ఎదురయ్యే సమస్యల నుండి, ఉపద్రవాల నుండి తెలివిగా తప్పించుకుంటూ, చెలామణి అయ్యేవాడే లౌక్యుడు, నేర్పరి అంటే రాబోయే స్థితిగతులు, వ్యక్తుల తీరుతెన్నులను సరియైన రీతిలో అంచనావేస్తూ, తగిన రీతిలో స్పందిస్తూ తన లక్ష్యాన్ని చేరుకోవాలన్నా సందేశాన్ని అందించాడు కవి.

ఎదుటివారిలో ఎప్పుడూ తప్పులు వెదుకుతూ, విమర్శిస్తూ ఉండేవారి స్నేహాన్ని, పరిచయాన్ని కొనసాగించడం అంతమంచిది కాదు. అలాంటి దుర్బుద్ధి కలిగినవాడిని సేవించడం మరింత ప్రమాదకరం. ఎందువలననగా ఆ దుష్టుని మిత్రునిగానో, సేవకునిగానో చెలామణి కావడం వల్ల ఇతరులు (లోకులు) మనలను కూడా దుష్టునిగా పరిగణించి, మనకు శాస్తి చేసే అవకాశం ఉంటుంది.

*ఎప్పుడు తప్పులు వెదకెడు*
*నప్పురుషుని గొల్చుగూడదది యెట్లన్నన్*
*సర్పంబుపడగనీడను*
*గప్పవసించిన విధంబుగదరా సుమతీ ॥*

ఇతరులలోని తప్పులను వెతుకుతూ, రంధ్రాన్వేషణ చేసేవాడు లోకశత్రువు, లోక విరోధి. అతను అందరి విషయంలో ఒకేలా ప్రవర్తిస్తూ, హానికరంగా, ప్రమాదకరంగా ఉంటాడు. కప్ప, పాము పడగనీడలో ఉంటూ, అదే తనకు రక్షణ కవచం అనుకుంటే ఎంత పొరపాటో, దుష్టుని కొలువు కూడా అంత ప్రమాదకరమే. అందువల్ల దుష్టునికి దూరంగా ఉండమని హితబోధ చేస్తాడు బద్దెన. ఆ హితవును మనం అర్థం చేసుకుని, నడుచుకోవడమే ఆయనకు మనమిచ్చే యదార్థ నివాళి.

– సాధన నరసింహాచార్య

## ఈశ్వరుని మీద విశ్వాసముంచు

*మీ కొరకు ఈ పృథ్వి మీద ధన సంపదలను కూడా పెట్టుకోవలదు. చెద పురుగులు పట్టి చెడిపోవచ్చు లేక దొంగల పాలుకావచ్చు. మీ ధనాన్ని స్వర్గంలో ప్రోగేసుకోండి. అక్కడ ఎవ్వరు దొంగిలించరు. ఎక్కడైతే నీ సంపద ఉంటుందో అక్కడే నీ మనసు కూడా ఉంటుంది. శరీరానికి జ్యోతులు నీ నేత్రాలే. అందుచేత నీ దృష్టి నిర్మలమైతే నీ శరీరం మొత్తం ప్రకాశంతో వెలిగిపోతుంది.*

*ఆకాశం వైపు చూడండి, ఎగిరే పక్షులు ఏమీ నాటవు. ఏమి కోసుకోవు. లేక పోగేసుకుంటూ గాదెలు నింపుకోవు. అయినప్పటికి ఆ భగవంతుడు వాటిని పోషిస్తూనే ఉన్నాడు కదా! ఓ తుచ్ఛమానవులారా! మీలో ఒక్కరైనా తన ప్రయత్నంతో పైకి వచ్చిన వాడెవడైనా ఉన్నాడా? వస్త్రాల కొరకు ఎందుకు విచారిస్తావు? చెట్లను చూడు! అవి వస్త్రాలను ధరించనప్పటికి ఎలా పైకి పెరుగుతున్నాయో చూడు. రేపటికి రాలిపోయే ఆకులనే వస్త్రాలతో 'పరమాత్మ' వాటిని ఎంత సుందరంగా అలంకరించాడో గమనించండి. ఓ అల్ప విశ్వాసులారా! ఆ ప్రభువు వస్త్రములు మీకు ఇవ్వలేదా? మీకు ఏ వస్తువులు అవసరమో మీకంటే ఆయనకు తెలుసు! ముందుగా మీరు ఆయన రాజ్యం గురించి, ధర్మం గురించి తెలుసుకోండి.*

*ఎవరి మీద ఎలాంటి దోషారోపణ చేయకు. నీ మీద ఆ దోషం పడకుండా చూసుకో. ఎందుకనగా నీవు ఎదుటివారి మీద దోషం వేస్తే ఆ విధంగానే నీ మీద కూడా అలాంటి దోషమే ఆరోపించబడుతుంది. ఏ కొలబద్ధతో ఎదుటవారిని నీవు నిందిస్తావో అదే కొలత నీకు కూడా వర్తిస్తుందని తెలుసుకో!*

– యేసుక్రీస్తు

అఖండజ్యోతి, జులై 1941

**ఏ పనిని నిరాశా దృక్పథంతో మొదలుపెట్టవద్దు**

# యుగ సృజన సాధన శిబిరము-గాయత్రీధామ్, సేంధ్వా, మధ్యప్రదేశ్

యుగనిర్మాణ సాధన శిబిరము 2012 అక్టోబరు 27,28 మరియు 29న గాయత్రీధామ్, సేంధ్వా, మధ్యప్రదేశ్‌లో జరిగిన 3 రోజుల కార్యశాలపై ఒక సమీక్ష.

గాయత్రీ సేవాధమ్, సేంధ్వాలో అఖిల విశ్వగాయత్రీ పరివార్ శాంతికుంజ్ హరిద్వార్ వారి సారథ్యంలో 3 రోజుల కార్యశాలకు దేశంలోని 12 రాష్ట్రముల నుండి కాక నేపాల్ దేశం నుండి కూడా దాదాపు 1200 మంది స్త్రీ, పురుష కార్యకర్తలు పాల్గొన్నారు. హైదరాబాద్ చేతనాకేంద్రం ప్రతినిధులుగా 20 మంది పాల్గొన్నారు.

పై సందర్భాన్ని పురస్కరించుకొని **దేవ సంస్కృతి విశ్వ విద్యాలయ కులపతి మరియు అఖిల విశ్వగాయత్రి పరివార్ ప్రముఖ్ ఆదరణీయ డా॥ ప్రణవ్ పంద్యా గారు మరియు ఆదరణీయ శ్రద్ధేయ శైలాబాల పంద్యా దీదీ గార్ల దివ్య సందేశము.**

"గాయత్రీ పరివార్ సేంధ్వా ద్వారా చేపట్టబడిన గోసంరక్ష మరియు గో విజ్ఞాన్ కార్యక్రమ విశేషాలు విని మేము ఎంతో ఆనందించాం. ఈ కార్యక్రమం ద్వారా మధ్యప్రదేశ్ మరియు మహారాష్ట్రాలలోని 6 జిల్లాలోని గ్రామీణ ప్రజానీకం, గోపాలన విధి విధానాల ద్వారా ప్రభావితం చెంది, తదనుగుణ దైనందిన జీవన విధానాన్ని అనుసరించుటకు మార్గం సుగమం కాగలదు. ఈ లక్ష్యాన్ని స్వీకరించి, ఆ గ్రామీణ ప్రజానీకం సంకల్పం చేసేలా చూడగలరు. నేటి ఈ క్లిష్ట పరిస్థితులలో, కొట్టుమిట్టాడుతున్న గ్రామీణ ప్రజానీకాన్ని తిరిగి ఉన్నత, శ్రేష్ట మార్గంలో పయనింప జేయుటకు మీరు చేపట్టిన ఈ కార్యక్రమం ఎంతగానో తోడ్పడ గలదని, వారిని వెలుగుబాటలో నడిపించగలదని మా ప్రగాఢ విశ్వాసం. ఈ పవిత్ర కార్యక్రమంలో భాగస్వాములై కృషి చేయుచున్న సమర్పిత కార్యకర్తల జీవితాలలో సుఖ సంతోషాలు, శ్రేయ సౌభాగ్యాలు నిండి, వారు అత్యంత ఉత్సాహంతో పనిచేయుటకు కావలసిన శక్తియుక్తులను అందించుటకై గురు దేవుల ప్రార్థిస్తూ మా ఇరువురి శుభాశీస్సుల అందించుచున్నాం.

గాయత్రీ సేవాధామ్, సేంధ్వా, ఇండోర్ నుండి ముంబాయి వెళ్ళే రహదారిపై ఇండోర్ నగరానికి 200 కి.మీ. దూరంలో దాదాపు 25 ఎకరాల విస్తీర్ణంలో రూపుదిద్దుకొన్నది. దీనిలో ఈ క్రింది విభాగాలు ఉన్నాయి. (ఈ క్షేత్రానికి సంబంధించిన సంపూర్ణ సమాచారము యుగశక్తిగాయత్రి మాసపత్రిక జూన్ 2012 సంచికలో ప్రచురించుట జరిగింది.)

**1) గోశాల:** 125 దేశవాళి గోవులతో గోశాల నడచుచున్నది.

**2) గురుకుల పాఠశాల:** 350 మంది బాలబాలికలతో గురుకుల విద్యాలయం పనిచేయుచున్నది. 6 నుండి 8వ తరగతి వరకు హిందీ మాధ్యమంగా విద్యాబోధన జరుగుచున్నది. ఈ బాలబాలికలు నేటి కాలపు చదువులలోనేగాక, అలనాటి నుండి వచ్చుచున్న యజ్ఞయాగవిద్యలందు కూడా దిట్టలే.

**3) ప్రకృతి చికిత్సాలయం:** మాతా భగవతిదేవి యోగ నిరోపచార కేంద్రము పేరిట ప్రకృతి చికిత్సాలయము నిర్వహింప బడుచున్నది.

**4) ఆయుర్వేద ఔషధాలయం:** గోవు ఆధారిత పదార్థములతో మరియు వనమూలికల సహాయంతో ఆయుర్వేద శాస్త్రానుసారం తయారుచేయబడిన ఔషధాల సహాయంతో రోగనివారణ జరుగుటకు ఔషధుల తయారీ మరియు వాని విక్రయం జరుగుచున్నది.

యుగనిర్మాణ సాధన 3 రోజుల శిబిరము ఈ క్రింది అంశముల సాధన లక్ష్యంగా ఎంచుకొని ఏర్పాటు చేయుట జరిగింది. అవి 1) గోవిజ్ఞాన కార్యశాల 2) గోపుష్టి గాయత్రీ మహాయజ్ఞము 3) సూర్యసాధన

జాతిచరిత్రలో ఇటువంటి మహత్వపూర్ణకారకమైన యుగనిర్మాణ కార్యక్రమాన్ని చేపట్టుటకై అప్పుడప్పుడు ఆహ్వానం అందుతూ ఉంటుంది. అట్లే గాయత్రీధామ్, సేంధ్వా చరిత్రలో గోమాత "సురభి" నామధేయురాలు, తన 25 సంవత్సరాల ఆయుష్మ (రజిత జయంతి) కాలములో 500 గ్రామాలలో పాదయాత్రను 3500 మంది గోపాలకుల సంఘటితపరచి, "గోగ్రామ తీర్థయాత్రను" జయప్రదంగా పూర్తిగావించింది. అదృష్టవశాత్తు ఈ దిగ్విజయ యాత్ర పూర్తియైన సందర్భంగా నిర్వహించుచున్న వేడుకలు, సూర్యసాధన మరియు గోపుష్టి యజ్ఞ వేడుకలతో మేళవింపబడుట దైవీకృపగా పేర్కొనవచ్చును.

ఈ పవిత్రవేళ గోమాత సురభి, సూక్ష్మశరీరధారిగా (సంవత్సరం క్రితం సురభి స్థూల శరీరాన్ని విడిచిపెట్టింది) తన దివ్య సందేశాన్ని అందించింది.

పిల్లలారా! పవిత్రకార్య పురుషార్థులకు నేను, బలాన్ని, బుద్ధిని, ఆయుష్షును, ఆరోగ్యాన్ని, సుఖాన్ని, సమృద్ధిని, ఐశ్వర్యాన్ని మరియు కీర్తి ప్రతిష్టలను చేకూర్చుతాను. వీనిని అనుభవంలోనికి తెచ్చుకొన్న వారు నన్ను మాతగా గుర్తిస్తారు. అట్లే నేను వారిని నా పిల్లలుగా ప్రేమిస్తాను. తల్లికి రక్షణతోపాటు సేవచేయుట

**మనుష్యుల సంబంధాలను పాడుచేసే విష కీటకం "కోపం"**

పిల్లల కర్తవ్యం కాగా, పిల్లలకు చక్కని జీవితాన్ని ప్రసాదించుట తల్లి బాధ్యత! నేను అనాది కాలం నుండి విశ్వ కళ్యాణాన్ని చేకూర్చుచున్నందున, నన్ను విశ్వమాత అని పిలుచున్నారు. నా కర్తవ్యాన్ని నేను సమాజ అంతం వరకు నిర్వహిస్తూనే ఉంటాను. నా పిల్లలు నన్ను ప్రేమతో చూచినా లేక కష్టపెట్టినా నేను మాత్రం, తల్లిలా వారిని సర్వదా ప్రేమిస్తూ ఉంటాను.

సేవ, నామస్మరణ మరియు సత్సంగాల ద్వారా సేవలను అందించేవారు సర్వదా నా అనుగ్రహాన్ని పొందుతూనే ఉంటారు.

**2012, అక్టోబర్ 28 మరియు 29 (గోవిజ్ఞాన కార్యశాల:** గోపాలన, గో సంరక్షణ, గోశాల నిర్వహణ, గోవిజ్ఞానము మున్నగు వానిపై ప్రముఖులు ప్రసంగించారు. 25 కుండముల గోపుష్టి మహాయజ్ఞం నిర్వహించబడింది.

**2012, అక్టోబర్ 29 (వృక్షారోపణ):** గోస్మృత్యర్థం - వృక్షాలు నాటే కార్యక్రమం సంకల్పం గావించబడింది. నాటుటకై 2500 రావి మొక్కలు, 2500 వేపమొక్కలు మరియు 2500 తులసి మొక్కలు పంచబడ్డాయి.

**మాతా భగవతీదేవి యోగకేంద్రం ద్వారా రోగనివారణ:** ఈ యోగ చికిత్సా కేంద్రము సాత్పూర పర్వతాల నడుమ ప్రకృతి ఒడిలో ఏర్పాటు అయిఉన్నది. మందుల నుండి విముక్తి మరియు దుష్ట చింతనల నుండి విముక్తి పొందుట ద్వారా శరీరానికి సంపూర్ణ శుద్ధి జరుగుతుంది. ఇది 10 రోజుల చికిత్సా కార్యక్రమం - ప్రతి నెల, రెండు చికిత్సా శిబిరాలు నిర్వహించెదరు.

మానవ శరీరం పంచ భూతములైన ఆకాశం, వాయు, అగ్ని, జలం మరియు పృథ్వి తత్వములతో నిర్మితమై ఉన్నది. ఈ పంచ తత్వముల శుద్ధి ద్వారా మానవ శరీరం స్వస్థతను పొందుతుంది. మనకు వచ్చే రోగాలకు మూలం మన దినచర్యలో కలిగే మార్పులే. కావున ప్రకృతిని ఆలంబనగా చేసికొని మీ జీవన విధానంలో మార్పులు తెచ్చుకొని, మీ ఆరోగ్యాన్ని, మీ ధనాన్ని మరియు మీ సమయాన్ని ఆదాచేసికొని, నూతనోత్సాహంతో రోగరహిత జీవితాన్ని జీవించండి.

మీ శరీరానికి కావలసింది మందులు కాదు, మలినాలను తొలగించుకోవాలి. ఈ క్రింది రోగాల నుండి విముక్తిని పొందండి.

మలబద్ధకం, లావు తగ్గుట (అధిక బరువు నుండి విముక్తి), మధుమేహం, రక్తనాళాలు మూసుకుపోవుట, సంధివాతం లేక కీళ్ళ నొప్పులు, శ్వాస సమస్యలు, ఆయాసం, హృదయ సంబంధిత రోగాలు, ఒత్తిడి, అశాంతి, రక్తలేమి, సయినస్, మైగ్రేన్, కొలెస్ట్రాల్ సమస్య, మూత్ర సంబంధిత రోగాలు, సయాటికా, అల్సర్, ఎసిడిటి, అనిద్ర, డిప్రెషన్ (మానసిక ఒత్తిడి), భయం మున్నగు శారీరిక, మానసిక వ్యాధుల నుండి 10 రోజుల చికిత్స ద్వారా నివారణ పొందండి. ప్రకృతి వైద్య విధానం ద్వారా స్వస్థతను పొందండి.

## వైద్య విధానాలు

**ప్రకృతి చికిత్స:** మట్టి, నీరు, వాయువు, అగ్ని, సూర్యరశ్మి, ఆహారం, మర్దనం, ఉపవాసం, రస చికిత్సల ద్వారా

**యోగ చికిత్స:** ఆసన, ప్రాణయామ, ధ్యానం, ముద్ర, బంధనాల ద్వారా పంచగవ్య చికిత్స, యజ్ఞ చికిత్స.

**ఆయుర్వేద చికిత్స:** ఆయుర్వేద లేపనం, ఆయుర్వేద కల్ప చికిత్స

**ఆక్యుప్రెషర్ చికిత్స:** సుజోక్, ఆయుర్వేదిక్ లేక చైనీస్ ఆక్యుప్రెషర్, ప్రాణిక్ హీలింగ్ మరియు దర్పణ చికిత్స.

గోవు పాలు లేత పసుపురంగును సంతరించుకొనుటకు కారణం, గోవు సూర్యకాంతిలో పచ్చిగడ్డిని తిని నెమరువేయుటచే సూర్యప్రకాశంతో సూర్యకేతు నాడి ప్రకోపించబడి ఆవుపాలలో కెరోటిన్ అనే ఔషధి ఉత్పన్నమవుతుంది. అన్ని విధాలా ఆవు పాలను సంపూర్ణ ఆహారంగా పౌష్టికాహారంగా గుర్తించారు. దీనికి తోడు ఆవుపాల సేవనంతో, మనుష్యులు సరళ స్వభావమనస్కులై సేవాభావం, దూరదృష్టి, కఠోర పరిశ్రమపట్ల శ్రద్ధ, దృఢ సంకల్పం, సాహసం, పరాక్రమం, మున్నగు లక్షణాలు వానిలో వికసితం కాగలవు, చివరకు దివ్య మానవులుగా ఎదుగుతారు.

దేశవాళి ఆవు నెయ్యి బుద్ధిని, జ్ఞాపకశక్తిని, జఠరాగ్నిని, శుక్లవృద్ధిని, నేత్ర దృష్టిని పెంపొందింపజేస్తుంది.

సాధనా వేదికకు వెళ్ళేదారిలో 5 ద్వారాలు ఏర్పాటు చేశారు. క్షీర సాగర మథనంలో ఉద్భవించిన 5 గోమాతలను, 5 ద్వారాల వద్ద స్మరించుట జరిగింది.

**మొదటి ద్వారం-వశిష్ఠ మహర్షి ద్వారం:** యుగానుసారంగా ధర్మ, కర్మల మార్గనిర్దేశనం చేశారు. అట్లే 'సుఖద' గోమాత ఈ ద్వారము వద్ద దర్శనమిస్తుంది.

**రెండవ ద్వారం-గౌతమ మహర్షి ద్వారం:** అన్నిప్రాణులలో అగ్నిహోత్రి పరంపరను సుఖసంపత్తులనందించిరి. ఈ ద్వారం వద్ద గోమాత "బహుళ" దర్శనమిస్తుంది.

**మూడవ ద్వారం-అత్రి మహర్షి ద్వారం:** జనులందరికి హితకారి మరియు శ్రేష్ఠ బ్రాహ్మణ సత్స్వరూపులు. ఈ ద్వారం వద్ద గోమాత "సురభి" దర్శనమిస్తుంది.

**నాల్గవ ద్వారం-భరద్వాజ మహర్షి:** స్వాధ్యాయ శీలి - జ్ఞాన సాగరుడు. గోమాత "నంద" ఇచ్చుట దర్శనమిస్తుంది.

**సమస్య లేకపోతే ఆనందమే లేదు**

**ఐదవ ద్వారం-జమదగ్ని మహర్షి:** సుఖ దుఃఖములను సమంగా చూచే వాడు. గోమాత "సుశీల" ఇచ్చట దర్శనమిస్తుంది.

సాధనా మంటపంలో 2500 మంది సాధకులు ఆశీనులై సాధన చేసికొనుటకనువుగా నిర్మించారు. 7 కక్షలుగా ఏర్పాటు చేశారు. ఆహ్వాన పత్రము గోమాత "సురభి" పేరున ముద్రించుట జరిగింది. అన్ని కార్యక్రమాలు "సురభి" పేరిట రూపుదిద్దు కున్నాయి. దీనిని బట్టి ఈ గాయత్రీధామ్ సేంధ్వా అభివృద్ధిలో అడుగడుగునా గోమాత "సురభి" పాత్ర ఎనలేనిది. భారతీయుని నిత్య జీవనంలో గోమాత పాత్ర పెనవేసికొనిపోయి ఉన్నది అని ఈ ఆశ్రమ చరిత్ర చాటి చెప్పుచున్నది.

మూడు రోజుల కార్యక్రమ వేడుకలు గాయత్రీ మంత్ర ప్రార్థనతో ప్రారంభమైనాయి. **ఈ కార్యక్రమానికి ఆదరణీయ శ్రీవీరేశ్వర ఉపాధ్యాయ శాంతికుంజ్ నుండి ప్రధాన అతిథిగా విచ్చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.**

### శ్రీ వీరేశ్వర్‌జీ ప్రసంగం:

ప్రారంభోపన్యాసంలో ఉపాసన-సాధన-ఆరాధనలపై చక్కని విశ్లేషణనిస్తూ ప్రధానోపన్యాసం గావించిరి. మనస్సును ఏకాగ్రత గావించుకొనుటపై ప్రసంగిస్తూ ఇలా వివరించారు. చేసే పనిమీద, చూసే దానిపైన, వినే దానిపైన ధ్యానం నిలుస్తుంది. అట్లే మనకు ఇష్టమైన వానిపై ప్రేమ, ఇష్టం ఏర్పడతాయి. మనస్సు దాని మీద లగ్నమవుతుంది.

భగవంతునిపైన మనస్సు నిలవటం లేదని తరచు వింటూ ఉంటాం. అనగా మనకు భగవంతునిపైగాని, ఆయన గురించిన విషయాలపై మక్కువ లేనప్పుడు మనకు సహజంగానే ఆయనపై మనస్సు నిలుపుట లేక, ధ్యానం చేయుట అసంభవం. అట్లే మనం ప్రేమించే వారిని మనం ఏ కోరికలు కోరం కేవలం వారి సాన్నిధ్యాన్ని ఇష్టపడతాం. అట్లే భగవంతునిపై ప్రేమ కలిగిననాడు ఆయనను ఏమి కోరము, కేవలం ఆయన సాన్నిధ్యాన్ని అమితంగా ఇష్టపడతాం. నది తన కన్నా పెద్దదైన సాగరాన్ని చేరుతుంది. అట్లే ఆత్మ-పరమాత్మను చేరుటకు ప్రయత్నిస్తూ ఉంటుంది. మనస్సు యొక్క చంచలత్వాన్ని నియంత్రించి, దానికి స్థిరత్వాన్ని చేకూర్చినచో, బుద్ధిననుసరించి ఆత్మ, పరమాత్మ దిశగా పయనించుటకు అవకాశం లభిస్తుంది. ఈ రీతిగా మనలో ఇంద్రియాలు, సక్రియత నొంది జ్ఞానేంద్రియాలు సహకారంతో మానవుడు దేవమానవునిగా రూపుదాల్చుటకు దారితీస్తుంది. మనకన్నా శక్తిమంతుడు, బుద్ధిమాని, అయిన భగవంతుడు మనకు ఏది ఉపకారమో దానినే మనకు అందిస్తాడు. ఇదియే గురుతత్వానికి ప్రతీక.

గంగానదికి నిండుపాత్రతో వెళ్ళినచో, గంగాజలం పాత్ర లోనికి ప్రవేశింపజాలదు. అందువలన గంగానదికి వెళ్ళినా గంగా జలాన్ని పొందకుండా రావల్సి వస్తుంది. అట్లే మనం గురువు వద్దకు మనస్సు నిండా కోరికలను నింపుకొని వెళ్ళినచో ఆయన మనకందించేది ఏమీ ఉండదు. ఏలనన ఆలోచనలు, కోరికలతో నిండి ఉన్న మన మనస్సు లోపలికి గురువు యొక్క సందేశాలు ప్రవేశింపవు-తత్ఫలితంగా అజ్ఞానంతో తిరిగి రావలసినదే - అట్లే భగవంతుని వద్దకు వెళ్ళినా జరిగేది ఇదే.

కావున నిజమైన శిష్యుడు లేక భక్తుడు తన గురువు లేక భగవంతుని వద్దకు ఖాళీ పాత్ర వంటి మనస్సుతో వెళ్ళినచో అతనికి (శిష్యునికి లేక భక్తునికి) ఏది ఉచితమో దానిని, పాత్ర వంటి ఆ మనస్సులో గురువు నింపి పంపుతాడు. ఇదే గురుతత్వం.

పరమపూజ్య గురుదేవులు యుగనిర్మాణ సత్సంకల్పాలను తయారుచేసి వానిని మన నిత్య జీవితంలో ధారణ గావించుకొని జీవించవలసినదిగా ఆదేశించారు. ఈ సూత్రాలు ప్రపంచంలోని అన్ని వర్గాలవారికి అనుకూలమైనవి మరియు ఆమోదయోగ్య మైనవి. కేవలం భగవంతుని పేరు, రూపాలపైనే విభేదాలు ఏర్పడ్డాయి. భగవంతుడు ఉన్నాడా లేడా అనే దానిపై ఎవరికి అనుమానం లేదు. భగవంతుడు సర్వవ్యాపి, న్యాయకారి. ఆయన అనుశాసనానికనుగుణంగా మనం నడచుకోవాలి. ఇదంతా భగవంతునిదే-మనది కాదు అని గుర్తుంచుకోవాలి. ఆయన మనలను నిరోగిగా సృష్టించాడు. కాని ఆయన అనుశాసనాన్ని ఉల్లంఘించి ప్రవర్తించుటచే, మనం రోగగ్రస్తులమవుతున్నాం. భగవంతుడు మనకు శరీరంలోని వివిధ అవయవాలను దుర్వినియోగపరచుటచే తగిన శిక్షను అనుభవింపక తప్పుట లేదు. దీనికి తోడు మానవ నిత్యజీవనం అస్తవ్యస్తమై పెక్కు అనర్థాలకు దారి తీయుటతోపాటు అనారోగ్యాలతోపాటు అశాంతిని పొందుచున్నాడు. తన ఇంటిని, పరివారాన్ని సరిదిద్దుటలో చాలినంత సమయాన్ని వెచ్చించక, అనవసరమైన వ్యవహారాలను గురించి, ఫలితం శూన్యమని తెలిసి కూడా విలువైన సమయాన్ని వృథా చేయుచున్నాడు. కావున ఈ స్థితిని సరిదిద్దుకోవాలి. అట్లే విశ్వాసపాత్రులైన (ఇమాందారీ-నిజాయితీ) వారితో చేతులు కలిపి సమర్థవంతంగా (సమజ్‌దారీ-ఇంగిత జ్ఞానం) పనిచేయి. అప్పుడు బాధ్యతాయుతమైన వ్యక్తిగా (జిమ్మేదారి -బాధ్యత) తయారౌతాడు.

**మానవజీవన ప్రధాన సూత్రాలైన సత్యం, అహింస, ధర్మపాలన, వివేకశీలత, ధైర్యం, సహకార శీలత, అస్తేయము, అపరిగ్రహం, దానశీలత, సమయదానము, ఆపన్నుల ఆదుకొనుట, సహనశీలత, ప్రేమతత్వం మున్నగువానిపై ఉపాసన, సాధన, ఆరాధనలు చేయాలి. ఇదే మానవజీవన లక్ష్యం.**

**ఒక పెద్ద సమస్య తరువాత అనుభవంగా మిగులుతుంది**

ధనవంతుడు, తనలో దృఢ నిర్ణయం లేనప్పుడు, ఊగిసలాటకులోనై, సంకీర్ణ స్థితిలో మునిగిపోతాడు. ఇంద్రియాలలో నీరసం చోటు చేసికొని సక్రియత లోపిస్తుంది. దీనితో బుద్ధి వికసితం కాక వివేకహీనమౌతుంది. నియమ ఉల్లంఘనం జరుగుతుంది. బుద్ధి మరియు భావనలు (మనస్సు లోని) జోడింపబడిన వేళ సరియైన దిశా నిర్దేశనం వ్యక్తికి లభిస్తుంది. అప్పుడు, వాసన (ఇంద్రియ వాసనలు), తృష్ణ మరియు అహంకారం సమాప్తమవుతాయి. సమిధ అగ్నిలో ప్రవేశించి నప్పుడు క్రమక్రమంగా తన రూపాన్ని కోల్పోయి, కణకణంలో అగ్నిని రగిలింపజేసికొని దానిలో లయమైపోయిన రీతిలో మనలోని వాసన, తృష్ణ మరియు అహంకారం సమాప్తం చేసుకోవాలి. మనశరీరంలోని పంచకోశాలు జాగృతమవుతాయి. మనమంతా సాధకుల్లా మారాలి. నౌకర్లతో కాక సాధకుల ద్వారా మాత్రమే యుగ నిర్మాణం జరుగుతుంది.

నిన్ను నీవు మొదట సంస్కరించుకో. అప్పుడే నీవు ఇతరులను సంస్కరించగలవు. లోక్‌సేవక్ పరివ్రాజక్ జీవితం ఒక తెరచిన పుస్తకం కావాలి. నీ కర్మననుసరించి ఫలప్రాప్తి జరుగుతుంది. ఈ రోజు కాకుంటే రేపు తప్పక జరుగుతుంది. శాఖాహారివై రోగాల బారినుండి విముక్తిడవుకమ్ము. నాటుకొన్నవాడు ఎప్పటికీ నష్టపోడు. లోకసేవలో నిమ్నగమైనవాడు సమయం, సాధన, అంశదానం, సత్ప్రయోజనల ప్రాధాన్యతలను గుర్తించి వీని సత్ ఫలితాలను తన జీవితంలో చవిచూస్తాడు. సమాజసేవకు, మంచి పనులకు సమయం లేదనేవాడు, ఏదో ఒకరోజున ఆ విలువైన సమయాన్ని తమకు అందుబాటులో లేకుండా శాశ్వతంగా కోల్పోతాడు. సమయదానమిచ్చేవాడు ధనమిచ్చేవాడి కన్నా మిన్న.

**పరమపూజ్య గురుదేవులు తమ విజయ రహస్యానికి రెండు కారణాలను తరచు చెప్పేవారు. 1) సమయాన్ని సంపూర్ణంగా అత్యంత శ్రద్ధా నిష్టలతో వినియోగించాను. 2) లభించిన పనిని పూర్తి మనస్సు పెట్టి అత్యంత భక్తి శ్రద్ధలతో పూర్తిచేశాను.**

నేడు నా పనికి యుగనిర్మాణం చేసేవారు కావాలి, అంతేకాని యజ్ఞం చేసేవారు కాదు – ఋషిలా భగవంతునికి, మానవులకు మధ్య సేతువులా నిలబడి ఋషిలా మానవజాతిని నడిపించు – నీవు ఇచ్చే సేవాదక్షిణ, వస్తు దక్షిణ, నగదు దక్షిణ – నీవు జీవితంలో ఉన్నతికి రాచమార్గమని మరచిపోకు. సేవలో అహంకారానికి తావివ్వకు. శ్రద్ధ, సంవేదనలతో సేవ పుష్పిస్తుంది.

అందరికి ఆరోగ్యవంతమైన శరీరం, స్వచ్ఛమైన మనస్సు, సభ్యతతో కూడిన సంస్కారం. ఇవే యుగనిర్మాణ లక్ష్యం.

**శ్రీ కె.పి. దూబే గారి ప్రసంగం:** మనల గురించి మనం తెలిసికొననిచో, ఇతర విజ్ఞానమెంత ఉన్నా వ్యర్థమే. దేవతలు మన వెలుపల లేరు – అవగాహన చేసికొన్నచో ఆ దైవీ (దేవతా) శక్తులన్నీ మనలోనే ఉన్నాయి. మనకు లభించే వరాలన్నీ మనలో ఉన్న ఆ పరమాత్ముని కృపే – ఇది యదార్థం. ఉపాసన ద్వారా ఈ శక్తులు మనలో ఉత్పన్నమై, సాధనతో గట్టిపడి, ఆరాధన ద్వారా అవి సేవారూపంలో సమాజానికి మన ద్వారా అందివ్వబడతాయి.

మూడు రోజుల శిబిర ముగింపు శరత్ పూర్ణిమ వేడుకలతో ముగించారు.

శరత్ పౌర్ణమి రోజున చంద్రుడు తన సంపూర్ణ కళలతో కనువిందు చేస్తూ అమృతవర్షాన్ని సకలప్రాణికోటిపై వర్షిస్తున్నాడు. సుదూరప్రాంతాల నుండి ఆబాల గోపాలం వయోవృద్ధుల వరకు, స్త్రీ–పురుషులు, వర్గ, వర్ణ, జాతి, కుల, మత భేదాలు లేకుండా దాదాపు 6 నుండి 7 వేల మంది ఆ పుణ్యస్థలికి చేరుకున్నారు.

స్వచ్ఛమైన దేశవాళి గోవుల నుండి సేకరించిన పాలతో చిక్కని పాయసం (ఖీర్) ప్రసాదరూపంలో పంచుటకు సిద్ధం చేసి ఉంచారు. ఈ పాయసంలో శరత్కాల పున్నమినాటి చంద్రుడు తన అమృతధారల వర్షింపజేసి ఆ పాయసాన్ని అమృతతుల్యం చేశారు. దీనిని ప్రసాద రూపంలో సేవించి ఇన్ని వేలమంది తమ శ్వాస, హృదయసంబంధిత, జలుబువ్యాధుల నివారణ గావించు కొని, దీర్ఘాయురారోగ్యముల పొందవలయుననేది వారి ఆకాంక్ష.

పై రీతిలో అలనాటి భారతీయ అద్భుత సంస్కృతీ సౌరభాలు శరత్కాల పున్నమి చంద్రుని కాంతిలో గుభాళించాయి. ఇదే భారతీయ సంస్కృతి. దీని పునరుద్ధరణ – పరిరక్షణ – వ్యాప్తి మనందరి బాధ్యత.

– ఎ. వేణుగోపాలరెడ్డి

## రాష్ట్రంలో జరిగిన కార్యక్రమాలు

**నారాకోడూరులో:** అక్టోబరు 2012 మాసంలో గాయత్రీ శక్తిపీఠం నారాకోడూరు వారి సారథ్యంలో పలుచోట్ల ఏకకుండీ గాయత్రీ యజ్ఞాలు, అక్షరాభ్యాసాలు, పుంసవన సంస్కారాలు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. 2012 డిశంబరు 29న సామూహిక సత్యన్నారాయణ వ్రతం నారాకోడూరులో జరుగుతుంది.

**వివరములకు ఫోన్: 0863-2534658**

**సమస్య యొక్క తీవ్రత మనం బాధపడినంత కాలమే ఉంటుంది**